Entered

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

మే 30, 2010



రవీంద్రనాథ్ టాగూర్ 150వ జయంతి

ప్రత్యేక సంచిక

విశ్వకవి 'చిన్నారి' లోకం

రవీంద్రనాథ్ టాగూర్!

ఈ జంట పదాల నామస్మరణ పూర్తయ్యేలోపు పొడవాటి గడ్డమున్న బక్కపల్చటి రూపం మన మనోఫలకంపై కదలాడుతుంది. ఆయన రాసిన జాతీయగీతం పెదాలపై పలుకుతుంది. ఆయన కథలు, కవితలు, గేయాలు, నాటకాలు, చిత్రాలు మెల్లగా మనల్ని చుట్టేసి ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. అంతటి బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన రవీంద్రుడి బాల్యంలోకి...లోలోకి తొంగి చూడాలని ఎవరికి మాత్రం వుండదు!

గంగాతీరంలో ... పాథూరియా ఘటాజూరాసెంకో ప్రాంతం. ధనిక బెంగాలీల నివాస ప్రాంతం. అక్కడో విశాలమైన పాతకాలపు భవనం. అక్కడ జమిందారీ కుటుంబానికి చెందిన దేవేంద్రనాథ్, శారదాదేవి దంపతులకు 1861 మే 7వ తేదీన రవీంద్రనాథ్ జన్మించాడు. అయితే రవీంద్రుడు జన్మించేసరికి టాగూర్ కుటుంబీకులు నిరాడంబరంగా జీవిస్తుండేవారు. పిల్లలకు ఆటవస్తువులైనా తగినన్ని వుండేవికావు. సాదా నూలు బట్టలే వేసుకునేవారు. పద్నాల్గవ సంతానం కావడంతో చిన్నారి రవికి తల్లి ఆదరాభిమానాలూ లభించేవికావు. పనివాళ్ల సంరక్షణలోనే రోజులు గడిచేవి. పిల్లలను చూసుకోవడం కష్టమై తమ పని సులువయ్యేందుకు వారిని ఇష్టమొచ్చినట్లు తిరగనిచ్చేవారుకాదు. రవీంద్రుణ్ణి గదిలో బంధించిన రోజులెన్నో వున్నాయి. అతని చుట్టూ సుద్దతో గీత గీసి 'గీత దాటావంటే ప్రమాదం' అని బెదిరించేవారు. హద్దుదాటి ప్రమాదానికి గురైన సీతమ్మవారి కథ తెలుసుగనుక రోజంతా ఆ మూసిన గదిలోనే కిటికీ దగ్గర కూర్చొని కాలక్షేపం చేసేవాడు. కిటికీ కర్ర తలుపుల సందుల్లోంచి చెరువూ, రాతి కట్టడం గల స్నానాల రేవూ కనిపించేది. చెరువుకి తూర్పున ఊడలు దిగిన పురాతన వట వృక్షమూ దక్షిణాన కొబ్బరి చెట్ల వరసలూ కనబడుతుండేవి. ఉదయం నించి మిట్ట మధ్యాహ్నం వరకూ జనం స్నానాసికి వస్తూనే వుండేవారు. ఒక్కొక్కరు ఒక్కోరకంగా స్నానాలు చేసేవారు. రవీంద్రుడు వారందరినీ గమనిస్తుండేవాడు. బాహ్య ప్రపంచమంతా అతనికో వింతగా, నిగూఢ రహస్యంగా తోచేది. పనివాళ్లలో ఒకరు రామాయణ భారతాలు గొంతెత్తి చదివి వినిపిస్తుండేవాడు. గదిలో రవీంద్రుడొక మూలన చిరిగిన తుంగ చాపమీద కూర్చుని సీతారాముల కథలు, భీమార్జునుల కథలు వింటుండేవాడు. దాంతో ఎక్కువగా భావనా జగత్తులోనే వుండేవాడు. అందులో కల్పిత కథల్లోని బందిపోటు దొంగలూ, రాజకుమారులూ, మాంత్రికురాళ్లూ, రాక్షసులూ అందరూ రామాయణంలోని పాత్రల్లాగే యదార్థమైన వారుగా తోచేవారు. ప్రకృతి సౌందర్యం బాల రవీంద్రుని విచలితుణ్ణి చేసేది. పొద్దున్నే నిద్రలేవగానే తోటలోకి పరిగెత్తేవాడు. బాలభానుని అరుణకిరణాలు, కొబ్బరి ఆకులూ, మంచుతో తడిచిన పచ్చిక ఆకట్టుకునేవి.

ఇంటి పాఠశాలలో చదువు ముగిశాక ప్రాచ్య విద్యా పీఠంలోకి ప్రవేశించారు. గుర్రపు బగ్గీలో వెళ్లేవారు. పెద్ద గదుల పెట్టెలా వుండే ఆ స్కూలులో కిటికీ తలుపుల సందుల్లోంచి బయటకు చూసి ఊహాలోకంలో విహరించేందుకు కూడా వీలుండేదికాదు. అయితే ఆ స్కూల్లో ఎక్కువ రోజులు చదవలేదు. నార్మల్ స్కూల్లో చేర్చారు. అక్కడ రవీంద్రుడు ఒక నిర్దిష్ట క్రమంలో అధ్యయనం చేయవలసి వచ్చేది. తెల్లారింది మొదలు రాత్రి వరకు విరామం వుండేదికాదు. రేఖాగణితము, సంఖ్యాగణితము, బెంగాలీ, చరిత్ర, భూగోళము, భౌతిక, జీవ, తర్క శాస్త్రాలు చెప్పేవారు. సాయంత్రం స్కూలయ్యాక ఇంటికెళ్లేసరికి ట్యూటర్ సిద్ధంగా వుండేవాడు. ఆయన డ్రాయింగు, కసరత్తు నేర్పేవాడు. ఆ తర్వాత వైద్య విద్యార్థి వచ్చేవాడు. ఆ సమయంలో ఇంగ్లీషు, అస్థిసంజరాన్ని పెట్టి శరీర శాస్త్రాన్ని బోధించేవాడు. పిల్లలు కునికిపాట్లు పడుతూ వినేవారు. ఆదివారం కూడా విరామం వుండేదికాదు. కాకపోతే రోజుటికంటే భిన్నంగా బోధన జరిగేది. కుటుంబ గాయకుడు విష్ణు వారికి ఉదయం భక్తిగీతాలు, అప్పుడప్పుడూ జనాదరణ పొందిన లలిత గీతాలూ నేర్పేవాడు. ఒక్కోసారి సైన్స్ మాష్టారొచ్చి ప్రయోగాలు చూపేవాడు. ఇక వీటన్నిటినుంచి విశ్రాంతి లేదా? అంటే ... అందుకు రవీంద్రుడు ఒక ఉపాయం ఆలోచించి ఆచరించేవాడు. తల్లి దగ్గరకెళ్లి కడుపునొప్పిగా వుందని నసిగేవాడు. ఆమె తనలో తాను నవ్వుకుని ఆవేళ అతనికి పాఠాల నుంచి సెలవు ఇప్పించేది.

రవికి పాఠ్యపుస్తకాలంటే గిట్టని మాట నిజమేకానీ బెంగాలీ మాత్రం బాగా ఒంటపట్టింది. దాంతో స్కూల్లో బెంగాలీలో ఎప్పుడూ ఫస్టుమార్కే వచ్చేది. మెల్లగా కవిత్వం కూడా రాయడం మొదలెట్టాడు. రవి పధ్నాలుగేళ్ల పిల్లవాడిగా వున్నప్పుడు అ[illegible] తల్లి [illegible]ంచింది. అయితే అందుకు నెలరోజుల ముందుగా ప్రజల ముందు తొలిసారిగా కవిగా నిలబడ్డాడు. ఒక సభలో తను రచించిన పద్యం ఒకటి చదివి వినిపించాడు.

పదిహేనేళ్లప్పుడు అతని కవిత 'జ్ఞానాంకురం' అనే పత్రికలో ప్రచురితమైంది. అదే పత్రికలో అతని తొలి వచన రచన, విమర్శనాత్మక వ్యాసం ఒకటి పడింది. పదిహేడేళ్లప్పుడు రంగస్థల ప్రవేశం చేశాడు. 'అలిక్‌బాబు' అనే నాటకంలో ప్రధాన పాత్ర పోషించాడు.

చిన్నారి రవీంద్రుడు జ్ఞానార్జనలోనూ, భావనలోనూ సాగించిన స్వైర విహారం వల్ల ఎంతో జ్ఞానాన్ని సముపార్జించగలిగాడు.

-అంజన

ENTERED

మా మాట

రచయితలు అధికారిక గుర్తింపు పొందని శాసన సభ్యులు (రైటర్స్ ఆర్ అన్ అక్రిడిటేటెడ్ లెజిస్లేచర్స్ ఆఫ్ ది సొసైటీ) అని ఒక మహానుభావుడు చక్కగా చెప్పారు. ఎక్కడైనా ఎప్పుడైనా జాతి జీవితాన్ని వారు ప్రభావితం చేస్తారు. వారి రచనలు ఉత్తేజం నింపుతాయి. మహా రచయితల విషయం చెప్పనే అక్కర్లేదు. వారి మాటలు, చేతలు కూడా కథలుగా నిలిచిపోతాయి. నాగరికతకు పేరెన్నికగన్న భారతావనిలో ఇలాంటి మహనీయులు చెప్పుకోదగినంతమంది వున్నారు. కానీ 19వ శతాబ్దిలో దేశ సరిహద్దులు దాటి విశ్వవ్యాప్తంగా పేర్గాంచిన కవీంద్రులు అరుదు. అటువంటి వారిలో ప్రప్రథములు రవీంద్రనాథ్ టాగూర్. విశ్వకవి. గురుదేవులు. మహారుషి. మహత్తర సాంస్కృతిక రాయబారి. మానవతావాది. తన జీవన ప్రస్థానంలో ఎన్నెన్ని రచించాడు! ఏమేమి సృజించాడు! సమాజాన్ని ఎంతగా అధ్యయనం చేశాడు! నోబుల్‌తో సహా ఎన్ని పురస్కారాలు అందుకున్నాడు!

రవీంద్రుడు కథ రాసినా, కవిత అల్లినా, నాటకం కట్టినా, చిత్రం వేసినా, పాఠం చెప్పినా, పాట పాడినా తనదైన ప్రత్యేకత తొణికిసలాడుతుంది. ప్రాచీన కథలకు కొంగొత్త రూపాన్నిచ్చాడు. సంప్రదాయాలతో నిండిన మతం మీద మానవత్వమనే మతం విజయం సాధించినట్టు రచనలు చేశాడు. ఆయన కథల్లో వాస్తవికతతోపాటు, అనుభూతివాదం దర్శనమిస్తుంది. అప్పుడప్పుడు అద్భుతాలూ జరుగుతుంటాయి. అలాంటి కథల్లో సైతం ఆయన ఎక్కడా నేల విడిచి సాము చేయలేదు. సాంఘిక ప్రయోజనం, సామాజిక స్పృహ కనిపిస్తాయి. తన కవిత్వం మనుషులకు ఒకింత సంతోషం కలిగిస్తే చాలునని రవీంద్రుడు ఆశపడ్డాడు. బ్రిటిష్ పాలకులు అకృత్యాలకు, అమానుషాలకు పాల్పడినప్పుడు శక్తివంతమైన కవిత్వంతో విరుచుకుపడ్డాడు. సుదూర భవిష్యత్తును దర్శించగలిగాడు. మత ఛాందసంపై తిరుగుబాటు చేశాడు. లౌకికతత్వాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని కోరుకున్నాడు. అంతర్జాతీయంగా శాంతి సామ్యవాదానికి అనుకూలంగా టాగూర్ నిర్వహించిన పాత్ర విశిష్టమైనది. గుండెను పిండేసే కథ 'కాబూలీవాలా' అయితే, నాటి సంక్లిష్ట సామాజిక స్థితిగతులకు అద్దం పట్టిన నవల 'గోరా'. ఆయన రాసిన 12 నవలల్లో 'గోరా' పెద్దదే కాకుండా సంక్లిష్టమైనది. చిరస్థాయిగా నిల్చిపోయేది. టాగూర్ తన సృజనాత్మక పయనంలో చివరి మజిలీగా చిత్రకళను ఎంచుకున్నాడు. తన 67వ ఏట బొమ్మలు వేయనారంభించినా భారతీయ ఆధునిక చిత్రకళకు ఆద్యులలో ఒకడిగా నిలిచిపోయాడు. అమ్మ ఒడిని వీడి బడిలో చేరిన బుడిబుడి అడుగుల చిన్నారులంతా ప్రతిరోజూ పాడుకొనే జాతీయగీతం సృష్టికర్తగా రవీంద్రుడు చిరస్మరణీయుడు. రవీంద్రుని సంగీతం వంగదేశంలోనేగాక భారతదేశమంతటా సుపరిచితమే.

దాదాపుగా రవీంద్రుని రచనలన్నీ తెలుగుతో సహా పలు ప్రాంతీయ, అంతర్జాతీయ భాషల్లోకి తర్జుమా అయ్యాయి. ఒక్క 'గీతాంజలి'నే ఇప్పటికి 18 మంది ఆంధ్రులు అనువదించారు. మనిషి, విశ్వాంతరాళం, సమస్త సృజనల అపూర్వ సంగమం 'గీతాంజలి'. ఆయనలోని స్వేచ్ఛా ప్రియత్వం, సౌందర్యారాధనా దృష్టి, దేశభక్తి భావన రవీంద్రుని మనకు సన్నిహితం చేసినట్టు కనిపిస్తుంది.

అందుకే శతాబ్దిన్నర తర్వాత కూడా ఆయన్ని మనం స్మరించుకుంటున్నాం. ఆ మహనీయుని 150వ జయంతి సందర్భంగా ఆయన విశిష్టతలను స్పృశించే ప్రత్యేక సంచిక ఇది.

★

ఈ సంచికలో....

కథకుడు టాగూర్	...	2
మానవతావాది, సామాజిక భావశిల్పి	...	4
తెలుగులో రవీంద్రుని పుస్తకాలు	...	6
ముఖ్య సంఘటనలు	...	7
కవి హృదయాంజలి 'గీతాంజలి'	...	8
చిత్రకారునిగా రవీంద్రుడు	...	12
జాతి గీతిక దేశ ప్రతీక	...	14
పోరాడి రవీంద్రుని సాధించుకున్నాం	...	16
మన శాంతినికేతన్	...	17
కాబూలీవాలా	...	18
రవీంద్ర సంగీతం	...	21
గురుదేవ్ రంగస్థలం	...	24

ఇంకా...

విశ్వకవి విశిష్ట సృష్టి 'గోరా' ... 10

భారతీయ పునర్వికాస కవీంద్రుడు ... 22

రవీంద్రనాథ్ టాగూర్ పేరు వినని తెలుగువాళ్లు అరుదుగా ఉంటారు. హైదరాబాద్ వాస్తవ్యులకైతే 'రవీంద్ర భారతి' అనునిత్యం ఆయన్ని గుర్తు చేస్తూనే ఉంటుంది. బహుముఖ ప్రజ్ఞాశాలి టాగూర్ నవలలు, కథలు కవితలు, నాటికలు, పాటలు (రవీంద్ర సంగీత్), వ్యాసాలు మొదలైనవి పుంఖానుపుంఖాలుగా రాశారు. ఇవి కాక ఆయనకి సంగీతం, చిత్రకళలో కూడా ప్రవేశం ఉండేది. 1913లో సాహిత్యానికి నొబెల్ బహుమతి అందుకున్న టాగూర్ రచనలు ఈనాటికీ నిత్యనూతనంగా కనిపించటమే కాక తన రచనా కాలానికన్నా ఎన్నో దశాబ్దాలు ముందున్నట్టు కూడా అనిపిస్తాయి..

కథకుడు టాగూర్

-ఆర్.శాంతసుందరి

రవీంద్రుడు 1891లో మొట్టమొదటిసారి కథలు రాయటం మొదలు పెట్టారని అంటారు. వందకిపైగా కథలు రాశారు. దాదాపుగా ప్రపంచ భాషలన్నిటిలోకీ తర్జుమా అయిన కథ 'కాబూలీవాలా'. అది కాక ఆయన రాసిన ఎన్నో కథా సంపుటులు బెంగాలీలోనూ, ఇతర భారతీయ భాషల్లోనూ, ఆంగ్లం ఒక్కటే కాక ఇంకా ఇతర ప్రపంచ భాషల్లోనూ అనువాదాలుగా వెలువడ్డాయి. కథలకన్నా కవితల అనువాదాలు విరివిగా జరిగాయి.

రవీంద్రుడు రాసిన అన్ని కథలనీ ఇక్కడ ప్రస్తావించటం సాధ్యంకాదు. దానికి ముఖ్యమైన కారణం, నాకు బెంగాలీ రాకపోవటం. ఇంగ్లీషు, హిందీ భాషల్లో లభించిన కొన్ని అనువాదాలను చదివాను. వాటిలో కొన్నిటిని గురించి మాత్రమే ఇక్కడ ప్రస్తావిస్తాను. కథల్లోకి వెళ్లేముందు టాగూర్ కథల్లోని, కథా రచనలోని విశిష్టత గురించి కొంత చెప్పాలి.

టాగూర్ కథలు రాయటం ప్రారంభించేప్పటికి కథారచనకి బెంగాలీ భాషలో అంత ప్రాచుర్యం లేదు. ఆ సమయంలో రొమాంటిక్ కథలే ఎక్కువగా వచ్చేవి. టాగూర్ వాటి జోలికి పోకుండా, ఆధునిక మానవ జీవితానికి సంబంధించిన కాల్పనిక సాహిత్యాన్ని నేలమీదికి తీసుకొచ్చాడు. ప్రాచీన కథలకి కొత్త రూపాన్ని కల్పించాడు. ఆచారాలూ, సంప్రదాయాలతో నిండిన మతం మీద మానవత్వం అనే మతం విజయం సాధించేట్లు రచనలు చేశాడు.

ఆయన కథల్లోని ఇతివృత్తం, మధ్యతరగతి బెంగాలీల రోజువారీ జీవితం, గ్రామీణ అనుభవాలు చిన్ననాటి జ్ఞాపకాలు, వీటి చుట్టూ అల్లుకుని ఉండటమే కాక, వాటిలో చరిత్రకి సంబంధించిన ప్రస్తావన, వాస్తవిక రాజకీయ పరిస్థితి చిత్రం, వ్యక్తుల జీవితాల మీద వాటి ప్రభావం కూడా మనకి కనిపిస్తాయి. ఆయన మానవత్వంతో నిండిన జీవితాన్ని వాస్తవిక లోకంలోనే కాకుండా బెంగాలీ సాహిత్యంలో కూడా చూడాలని తపించాడు.

టాగూర్ కథల్లో వాస్తవికతతోపాటు అనుభూతివాదం, అద్భుతాలు జరగటం లాంటివి కూడా కనిపిస్తాయి. కానీ అలాంటి కథల్లో కూడా ఆయన నేల విడిచి సాముచెయ్యడు. సాంఘిక ప్రయోజనం, సామాజిక స్పృహ లాంటి అంశాలు ఇక్కడ కూడా మనకి కనిపిస్తాయి.

నేను ఇటువంటి కథలనే పరిచయం చేయటానికి ఎంచుకున్నాను.

'పోయిన నగలు' అనే కథల్లో రచయిత ఒక ప్రయోగం చేయటం మనకి కనిపిస్తుంది. ఈ కథలో కథ చెప్పే వ్యక్తి (అతను రచయితే అయ్యే అవకాశం ఉంది.) పడవలో ప్రయాణం చేస్తూ ఒక ఊళ్లో ఆగుతాడు. 'కళ్లలో అతీంద్రియమైన మెరుపు' ఉన్న ఒక స్కూలు మాస్టారు. ఒడ్డున అతనికి ఎదురుపడతాడు. అప్పుడా ప్రయాణికుడు 'అతన్ని చూస్తే నాకు ancient mariner గుర్తుకొచ్చాడు అంటాడు (పాఠకులతో). అంటే అప్పటి బెంగాలీ పాఠకులకి కోలెరిడ్జ్ అనే ఆంగ్ల కవి రాసిన ancient mariner అనే శీర్షికతో వెలువడిన దీర్ఘ కవిత సుపరిచితమని అనుకోవాలి. 1898లోనే టాగూర్ భాష, ప్రాంతం, దేశంలాంటి హద్దులన్నీ చెరిపేస్తూ తన పాత్రలచేత ఇటువంటి ఆలోచనలు చేయించాడు. అందుకే ఆయన దాదాపు 90 ఏళ్లక్రితమే పోస్ట్ మోడరన్ సాహిత్యం రాశాడని అంటున్నారు.

'పోయిన నగలు' కథలో స్కూలు మాస్టర్ చెప్పిన భార్యా భర్తల కథ ప్రధాన ఇతివృత్తం. భార్య నగలు పోతాయి. భర్త బాగా చదువుకున్న వ్యాపారవేత్త. అతని పేరు ఫణిభూషణ్ సాహా. అతనికీ, భార్యకీ పడదు.. భార్య చనిపోయి దెయ్యం అవుతుంది. కథంతా విన్న పడవ ప్రయాణికుడు తన పేరు ఫణిభూషణ్ సాహ అని మాస్టర్‌తో అంటాడు. మాస్టర్ ఫణిభూషణ్ భార్య పేరేమిటని అడిగినప్పుడు అతను ఆ పేరు మార్చి మరో పేరు చెపుతాడు.. ఇవన్నీ చదివిన పాఠకుడికి అతను కావాలనే అబద్ధం చెపుతున్నాడనిపిస్తుంది. చివరికి టాగూర్ కథ ముగింపుని పాఠకుడి ఊహకే వదిలేస్తాడు. ఏం జరిగిందో చెప్పడు. ఇవన్నీ కూడా ఉత్తర ఆధునిక రచనా శైలికి సంబంధించిన అంశాలే. అందుకే 'రవి గాంచనిచో కవిగాంచు' అనీ గొప్ప సృజనాత్మక శక్తి గల మేధావులని ద్రష్టలనీ అనటం మనం వింటూ ఉంటాం.. టాగూర్ లాంటి రచయితలు తాము జీవించిన కాలాన్ని దాటి ఊహించగల ద్రష్టలు.

'హంగ్రీ స్టోన్స్' అనే శీర్షికతో ఆంగ్లంలో టాగూర్ కథల అనువాదాలు కొన్ని ప్రచురితమయ్యాయి.'ఆకలిగొన్న రాళ్లు' అని ఈ శీర్షికని తెలుగులో తర్జుమా చేసుకోవచ్చు. 'పోయిన నగలు' కథలాగే ఈ కథలో కూడా దెయ్యాలూ, అభూత కల్పనలూ, అబద్ధాలు (లేక అవి నిజాలా?) ఉన్నాయి.

ఇద్దరు స్నేహితులు ఒక వ్యక్తిని రైల్లో కలుస్తారు. అతను తను చాలా ప్రతిభావంతుణ్ణని చెప్పుకుంటాడు. అలా గొప్పలు చెప్పుకుంటూ అతను స్నేహితులతో "మా వార్తా పత్రికల్లో అచ్చయ్యే సమాచారాన్ని మించిన సంఘటనలు ఈ లోకంలోనూ, పై లోకంలోనూ, జరుగుతూ

ఉంటాయి హోరేషియో!" అంటాడు. హోరేషియో అనేది షేక్స్పియర్ నాటకం, 'హేమ్లెట్'లోని ఒక పాత్ర. టాగూర్ తన కథలోని ఒకపాత్ర చేత, 'హేమ్లెట్'లోని పాత్ర ప్రస్తావన తీసుకురావటం, ఆ పాత్రకి విశ్వసాహిత్యం తెలుసునని చెప్పటానికే కాక, 'హేమ్లెట్'లో లాగే ఇక్కడ కూడా అలౌకిక శక్తుల ప్రస్తావన ఉండబోతోందని పాఠకులకి ముందే చెప్పటం టాగూర్ ఉద్దేశం. అదే విధంగా ఆ కాలంలోని బెంగాలీ పాఠకులకి విశ్వసాహిత్యం, ముఖ్యంగా ఆంగ్లసాహిత్యం పరిచయమే అని చెప్పటం కూడా ఆయన ఉద్దేశం.

వేదాల నుంచి పర్షియన్ కవిత్వం దాకా అన్ని విషయాలూ తెలిసిన వాడిలా కనిపించే ఆ వ్యక్తి, తను ఒకప్పుడు నివసించిన భవంతిలో అందమైన ఒక ఆడదెయ్యంతో తనకి కలిగిన అనుభవం గురించి ప్రస్తావిస్తాడు. సరిగ్గా అదే సమయానికి అతను మారవలసిన రైలు స్టేషన్‌లోకి వచ్చి ఆగుతుంది. మరుక్షణం ఒక ఆంగ్లేయుడు వచ్చి అతన్ని పిలుచుకుపోతాడు. కథ ఇంకా ప్రారంభించకుండానే ఆ వ్యక్తి వీళ్లిద్దర్నీ వదిలి వెళ్లిపోతాడు. మన మిత్రులిద్దరు, అందమైన ఆడదెయ్యంతో అతనికి కలిగిన అనుభవం ఏమిటో వివరంగా తెలుసుకోలేకపోయినందుకు, విపరీతంగా బాధపడిపోతారు. ఆ తరవాత 'నా స్నేహితుడికీ నాకు మధ్య జరిగిన చర్చవల్ల మా స్నేహం, శాశ్వతంగా పాడయింది' అనే వాక్యంతో కథ ముగుస్తుంది.

మొత్తం మీద రైల్లో వ్యక్తికి కలిగిన అనుభవం ఏమిటీ? అతను ఎక్కడికి వెళ్లిపోయాడు, తరువాత ఏం జరిగింది. ఈ వివరాలేవీ రచయిత చెప్పడు. పాఠకుడు తన అవగాహనకి తగ్గట్లు రకరకాల అర్థాలనీ, ముగింపులనీ ఈ కథలో వెతుక్కుంటాడు.

రైల్లో తారసపడ్డ వ్యక్తి నిజమే చెప్పాడు. దెయ్యాలున్నాయి. అతనొక అబద్ధాలకోరు, అతనిది అంతా అభూతకల్పన, తను ఎక్కవలసిన రైలు వచ్చేదాకా ఊరికే కాలక్షేపం కోసం ఏవేవో కల్పించి చెప్పాడు. ఇవన్నీ సరైన ఊహలే కావచ్చు. ఉత్తర ఆధునిక కథ అనేది రూపొందింది, ఇంకా పేరు సంతరించుకోక ముందే రవీంద్రుడు రాసిన ఈ కథ ఆ కోవకే చెందుతుంది... రచయిత ముగింపుని చెప్పని కథ.

రవీంద్రుడు పిల్లలకోసం కూడా కథలు రాశాడు. అవి 'చందమామ' కథల్లాగ పిల్లలకీ, పెద్దలకీ కూడా పనికి వచ్చే కథలు. వాటిని పిల్లల కథల్లాగ కూడా చదవొచ్చు. అదే సమయంలో అందులో రచయిత చెప్పక చెప్పిన విషయాన్ని కూడా గ్రహించొచ్చు. 'అనగనగా ఒక రాజు', 'చిలుక కథ', 'పనివాళ్ల స్వర్గం', 'ఒకహాస్యకథ', మనందరికీ తెలిసిన 'కాబూలీవాలా', ఇవన్నీ పిల్లలూ పెద్దలూ కూడా చదివి ఆనందించే విధంగా ఉన్నాయి.

'అనగనగా ఒకరాజు' కథ 'అనగనగా ఒక రాజు ఉండేవాడు', అనే వాక్యంతో ప్రారంభమవుతుంది. చిన్న పిల్లలకి ఆ రాజు పేరు తెలుసుకోవాలన్న ఆసక్తి ఉండదు. తరవాతేం జరుగుతుందో తెలుసుకోవాలని ఉంటుంది. కానీ పెద్ద వాళ్లు ఈ వాక్యం చదవగానే, వాళ్ల మనసుల్లో కొన్ని ప్రశ్నలు తలెత్తుతాయి. రాజు ఏ వంశంవాడు? అతని పేరేమిటి? ఏ కాలంలో పరిపాలించాడు? చరిత్రలో అతనికున్న స్థానం ఏమిటి, అన్నీ తెలుసుకుంటేగాని నేటి పాఠకులు కథ చదవటానికి ఇష్టపడరు.

రచయిత ఇక్కడ ఒక తమాషా చేస్తాడు. ఈ కథని పిల్లలెవరూ చదవకుండా చూడమనీ, దీన్ని స్కూళ్లలో పాఠ్యపుస్తకాలలో చేర్చవద్దనీ అంటాడు. కారణం మాత్రం చెప్పడు.

ఈ కథలో ఒక ముసలమ్మ తన మనవడికి కథ చెపుతుంది. ఒకరాజు. అతనికొక కూతురు. కొడుకు కావాలనే కోరికతో దేవుణ్ణి ప్రార్థించేందుకు రాజు అడవికి వెళ్తాడు కూతురూ, రాణీ రాజభవనంలోనే ఉండిపోతారు. పన్నెండేళ్లు తపస్సు చేశాక రాజు వెనక్కి వస్తాడు. రాజకుమార్తె యుక్త వయసుకి చేరుకుంటుంది. వెంటనే రాజు, మర్నాడు పొద్దున్నే తనకి ఎదురుపడే మొదటి వ్యక్తికి కూతుర్నిచ్చి పెళ్లి చేస్తానని నిర్ణయిస్తాడు.

మర్నాడు రాజుకి ఒక ఏడెనిమిదేళ్ల బ్రాహ్మణ పిల్లవాడు ఎదురు పడతాడు. సరిగ్గా ఇక్కడే రచయిత కథ చెప్పే ముసలమ్మకీ, ఆమె మనవడికీ, (పాఠకుడికి కూడా) మధ్యకొస్తాడు. ఈ కథ మా అమ్మమ్మే చెపితే నేను ఒప్పుకుంటానా? రాజవంశంలో పుట్టి యుక్త వయసులో ఉన్న రాజకుమార్తె ముక్కుపచ్చలారని ఏడేళ్ల బ్రాహ్మణ పిల్లవాడిని పెళ్లాడటమా? అంటాడు.

మామూలు పిల్లల కథని టాగూర్ ఎంతో చాకచక్యంతో ఈనాటి కుల వ్యవస్థకీ, వర్గ స్పృహకీ జోడిస్తాడు.

ఒకే మూసలో ఆదర్శాలని పట్టుకుని వేలాడే పాత్రలని టాగూర్ తన కథల్లో చిత్రించాడు. సామాజిక వాస్తవికతగల పాత్రలకీ, వాళ్ల మనో విశ్లేషణకీ ఎక్కువ ప్రాధాన్యం ఈయన రచనల్లో కనబడుతుంది.

ఇంతవరకూ మనం చెప్పుకున్న కథలకి భిన్నంగా ఉన్న ఒకే ఒక కథ గురించి చెప్పి నేను నా వ్యాసాన్ని ముగిస్తాను. 'శిక్ష' అనే కథ బెంగాలు గ్రామీణ ప్రాంతపు జీవితాలకి సంబంధించినది. రైతుకూలీలుగా పనిచేసే బడుగు జీవులకీ, వాళ్ల యజమానులైన భూస్వాములకీ మధ్యన ఉండే సంబంధాలూ, సమస్యలూ చిత్రించే కథ 'శిక్ష'. గ్రామీణ ప్రాంతంలో పదేళ్లు నివసించిన టాగూర్ ఆర్థిక, సామాజిక, పితృస్వామ్య దోపిడీని కళ్లారా

చూసి అర్థం చేసుకున్నాడు. ధనికులు పేదవారిమీద చేసే జులుం చూశాడు. ముఖ్యంగా పేద స్త్రీల బతుకులు ఎంత అధ్వానంగా ఉన్నాయో చూశాడు.

చందరా ఈ కథలోని ప్రధాన పాత్ర. సామాజిక అణచివేతకీ, అవమానాలకీ గురౌతూ కూడా దాన్ని ప్రతిఘటిస్తూ నిలబడి, ఆత్మగౌరవం కోసం పోరాడే పాత్ర ఆమెది.

చందరా చాలా అందమైనది, అభిమానవతి, ఆమె భర్త చిదమ్, అతని సోదరుడు దుఖీరామ్. ఇద్దరూ పొలం కూలీలుగా పనిచేస్తూ ఉంటారు. ఒకరోజు పగలంతా పొలంలో రెక్కలు ముక్కలు చేసుకుని ఇంటికి చేరుకునే సరికి భార్య భోజనం సిద్ధం చేయలేదన్న పిచ్చికోపంతో దుఖీరామ్ తన భార్యని చంపేస్తాడు. చిదమ్ దుఖీరామ్‌ని కాపాడేందుకు చందరా తన తోడికోడల్ని కత్తితో పొడిచి చంపిందని పోలీసులకి చెపుతాడు. చందర ఆ నింద తనపై వేసుకుంటుంది. పోలీసుల వెంట వెళ్తూ 'నా యవ్వనాన్ని నీకు దక్కనిచ్చే బదులు ఆ ఉరికంబానికి దక్కనివ్వటమే మేలు', అని భర్తతో అనకపోయినా, మనసులో అనుకుంటుంది.

ఆ తరువాత అన్నదమ్ములిద్దరూ తామే నేరస్తులమని ఒప్పుకున్నప్పటికీ, చందరాకే శిక్ష పడుతుంది. ఉరి తీసేముందు డాక్టర్ ఆమెతో, 'నీభర్త నిన్ను ఒకసారి చూడాలనుకుంటున్నాడు,' అంటాడు. 'వెళ్లి పాడుబావిలో దూకమనండి' అంటుంది చందరా.

'స్త్రీ వాదం' అనే మాట వాడుకలోకి రాకముందే, చాలామంది మన తెలుగు రచయితల్లాగే టాగూర్ ఇలాంటి కథలెన్నో రాశాడు. సముద్రాన్నంతటినీ ఒక చిన్న చెంబులో పట్టి చూపించినట్టు, రవీంద్రనాథ్ టాగూర్‌ని కథకుడిగా పరిచయం చేసే ప్రయత్నం ఇది. దీన్ని పాఠకులు మెచ్చుతారని ఆశిస్తాను.

★

మానవతావాది, సామాజిక భావశిల్పి

-తెలకపల్లి రవి



దేశంలో రవీంద్రనాథ్ టాగూర్‌తో పోల్చదగిన విఖ్యాత కవి, సాంస్కృతిక రాయబారి మరొకరు లేరని అందరూ అంగీకరిస్తారు. ఆయనకు నీరాజనాలర్పిస్తారు. దేశం ప్రతిరోజూ అధికారికంగా ఆలపించే జాతీయ గీతంలోనే రవీంద్రుడు పలకరిస్తుంటాడు. కాని ఆయన గురించి బెంగాల్‌లోనే ఎప్పుడూ అనేక భిన్నాభిప్రాయాలు వినిపిస్తుంటాయి. ఇందులో మూడు తరహాలు ముఖ్యమైనవి. మొదటి తరహాలో బెంగాలీ పండితులూ మేధావులు ముఖ్యంగా విద్యారంగానికి సంబంధించిన వారుంటారు. వీరు తక్కిన సాహిత్యకారులందరికన్నా టాగూర్ గొప్పవాడని ఆకాశానికెత్తుతుంటారు. ఈ క్రమంలో దేశ విదేశీ కవులెందరినో తక్కువ చేసేందుకు కూడా వెనకాడరు. ఇంకో రకం వారేమో టాగూర్ రచనలన్నీ బూర్జువా భావమయమని కొట్టిపారేస్తారు. ఎలాటి సహనమూ లేకుండా విమర్శనాత్మక దృష్టి లేకుండా టాగూర్‌ను మొత్తంగా తిరస్కరిస్తారు. ఇక మూడో తరహా వారేమో టాగూర్ వీర విధేయులు. ఆయనపై ఈగ వాలినా సహించరు. వాస్తవానికి ఈ మూడు ధోరణులూ పొరబాటే.

అలాగే టాగూర్‌లోని ప్రకృతి ప్రియత్వాన్ని సౌందర్యారాధనను కీర్తించే భావ కవులు తెలుగులోనూ వున్నారు. వీరంతా ఆయనను అనువదించారు కూడా. ఇందుకు భిన్నంగా అభ్యుదయ కవులనుకునే వారు టాగూర్‌లోని శాంతి ప్రజాస్వామిక దృష్టికోణాలను గౌరవించారు. ఆయనకు తామే వారసులమని ప్రకటించారు (ఇందుకు సంబంధించిన వివరాలు ఇదే సంచికలో మరో వ్యాసంలో చూడొచ్చు). ఈ విషయంలో భావ కవితా పితామహుడి వంటి రాయప్రోలు సుబ్బారావు ఇలస్ట్రేటెడ్ వీక్లీకి వ్యాసం రాస్తే దాన్ని ఖండిస్తూ కె.వి.రమణారెడ్డి మరో వ్యాసం రాయడం ఇందుకొక ఉదాహరణ మాత్రమే. శ్రీశ్రీ చివరి వరకూ టాగూర్‌పై విమర్శనాస్త్రాలు సంధిస్తూనే వున్నారు.

టాగూర్ గురించి ఇన్ని భిన్నాభిప్రాయలు ఇంత కుతూహలం కలగడానికి కారణమేమిటి? ఆయన జీవితంలో వివిధ దశల్లో వివిధ కోణాలుగా పాయలుగా సాగిన సృజన ప్రవాహమే ఇందుకు ఏకైక కారణం. అత్యంత ప్రతిభావంతుడైన టాగూర్ ఏది రాసినా ఏం చెప్పినా కళాత్మకంగా శక్తివంతంగా అలరాలింది కనకే అన్ని తరహాల వారూ ఆయన వారసత్వాన్ని ప్రకటించుకున్నారు. ఆయన జీవితంలో మామూలుగా చూసే క్రమం తలకిందులవడం ఇందుకు ముఖ్య కారణం. సాధారణంగా యవ్వనంలో గంభీరోక్తులు విప్లవ వాక్యాలు పలికిన కొందరు తదుపరి దశలో ఆధ్యాత్మికవాదులుగా భక్త శిఖామణులుగా మారిపోతుంటారు. ఇందుకు మినహాయింపుగా నిలిచే కొద్ది జీవితాలలో టాగూర్ జీవితం కూడా వుంటుంది. ఆయన మొదటి దశలో అచ్చమైన సౌందర్యారాధకుడుగా మానవ సమాజంతో సంబంధం లేని స్వేచ్ఛాపిపాసిగా విహరించారు. కలం నుంచి వెలువడిన ప్రతి అక్షరమూ ప్రతి రేఖ అందుకే అంకితం చేశారు. ఈ క్రమంలో ఉపనిషత్తులు, ఆముష్మిక చింతనల ప్రభావానికి కూడా ప్రబలమైన చోటే ఇచ్చారు. దైవ చింతన కూడా కనపర్చారు. గీతాంజలి కూడా ఆ ధోరణిలో వెలువడిన కావ్యమే. ఆ దశలో ఆయనకు సామాన్య ప్రజల జీవనవేదన గురించి పట్టలేదు. వాటి గురించి ఏమంతగా తెలియదు కూడా. తన దృష్టి కోణంలోని లోపాలనూ ఆయన గ్రహించేందుకు సమయం పట్టింది. జీవితానుభవం ప్రపంచ పరిశీలన టాగూర్ దృక్పథంలో సమూలమైన మార్పు తెచ్చాయి. ఒకానొక విశ్వ కవీంద్రుని పరిణామ క్రమానికి సంబంధించిన బాధామయ వాస్తవమిది.

టాగూర్ ప్రేమ కవిత్వాన్ని మార్మిక భావజాలాన్ని మాత్రమే ఇష్టపడే వారు ఆకాశానికెత్తే వారు ఈ వాస్తవాలను చూడటానికి ఇష్టపడరు. ఆయన తొలి దశలో రాసిన రసగుళికలంటేనే వారికి ప్రీతి. అవే ఆయన ప్రతిభకు నిదర్శనమని కొనియాడుతుంటారు. సంపన్న కులీన కుటుంబంలో పుట్టి విలాసవంతంగా పెరిగిన ఒక రసిక యువకుని స్వేచ్ఛాసృజనగా దాన్ని పొగిడి పొగిడి పరవశించి పోతారు. వాస్తవానికి ఇదో కల్పన. తాను పెద్ద సంపన్న కుటుంబంలో పుట్టాననుకోవడం సరికాదని టాగూర్ తన ఆత్మకథలో రాశాడు. తనకు కాస్త వయస్సు వచ్చేనాటికి సంపదగా చెప్పుకోదగిందేదీ మిగల్లేదని స్పష్టంగా పేర్కొన్నాడు. ఒక విధంగా అది మేలే చేసింది. ఆయన భావాలు పరిపక్వం కావడానికి అది దోహదపడింది. అటు ఐశ్వర్యం ఇటు దారిద్ర్యం రెంటి గురించి ఆయనకు చిన్న తనంలోనే అవగాహన కలిగింది. ఆ విధంగా సంపన్న కుటుంబం సామాన్య స్థితిలోకి జారుకోవడంలోని పరిణామ క్రమం ఆ యువ హృదయం తెలుసుకోగలిగింది. అయితే రష్యన్ రచయిత టాల్‌స్టాయ్ విషయంలో జరిగినట్టుగా ఈ పరిస్థితి ఆయనలో ఎలాటి అపరాధభావనను గాని అసహాయ శీలతను గాని తీసుకురాలేదు. సామాజిక కళా రంగాలకు సంబంధించిన అంశాలలోనేగాక సమాజానికి మతానికి సంబంధించిన విషయాలలో కూడా ఆయన ఉదారవాదిగానే వుండిపోయాడు. వ్యక్తికి సమాజానికి కూడా స్వేచ్ఛ వుండాలని భావించాడు.

టాగూర్ స్వేచ్ఛా భావన సంపూర్ణమైంది. సంతోషం సృజన శీలత

నిండినది. ఆయనకు వైరాగ్యం, సన్యాసం వంటి వాటిపై నమ్మకం వుండేది కాదు. అలాటి ముక్తి నాకు అక్కర్లేదు అని ప్రకటించాడు. టాగూర్ ఎన్ని సమస్యలు సవాళ్లు ఎదుర్కొన్నా మనుషులపై నమ్మకం కోల్పోలేదు. మానవులు వున్నందుకే ఈ భూమండలం ఇంత అందంగా వుందని ఆయన అనేవారు. తన కవిత్వం మనుషులకు ఒకింత సంతోషం కలిగిస్తే చాలునని ఆయన ఆశించాడు. ఆఖరుకు చనిపోయే ముందు కూడా టాగూర్ మనుషులపై నమ్మకం కోల్పోవడం మహాపాపమని ప్రకటించాడు. ఈ విశాల మానవతా వాదమే ఆయనను సాహిత్యంలోనూ చిత్రకళలోనూ విద్యారంగంలోనూ కూడా ప్రయోగాలకు పురికొల్పింది.

శిలాల్ దాహలోని తమ పూర్వీకుల ఆస్తులను ఆజమాయిషీ చేస్తున్నప్పుడే టాగూర్‌కు రైతులు, వ్యవసాయ కార్మికులు, మధ్య తరగతి జనులు తదితరులతో సంబంధం ఏర్పడింది. తనలో చిరకాలంగా నాటుకుపోయిన సాంఘిక భావాలను కూడా ఆయన వదిలించుకోవడానికి ఆ అనుభవం తోడ్పడింది. ఆ సమయంలోనే వ్యవసాయ రంగంలో రావలసిన సంస్కరణలను గురించి చేసిన రచనలు చూస్తే ఆయన గ్రామీణ జనబాహుళ్యం గురించి తపన పడుతున్నారని తెలుస్తుంది. వాటిలో సహజంగానే అనేక లోపాలున్నా నన్ను కూడా మీలో (సామాన్యులలో) ఒకరుగా భావించండి' అని చెప్పడంలో నిజాయితీ కనిపిస్తుంది.

ఇక అంతర్జాతీయంగా శాంతి సామ్యవాదానికి అనుకూలంగా టాగూర్ నిర్వహించిన పాత్ర మరింత విశిష్టమైంది, విలక్షణమైంది కూడా. అప్పట్లో ప్రపంచంలో ఒకే ఒక్క సోషలిస్టు దేశంగా వున్న సోవియట్ యూనియన్ గురించిన వార్తల ప్రచురణపై సెన్సారింగు వుండేది. అనేక అసత్య కథనాలు కూడా బ్రిటిష్ పాలకులు ప్రచారంలో పెట్టేవారు. అనేక మంది సోషలిస్టు వ్యతిరేకులలాగే టాగూర్ కూడా వీటిద్వారా స్వల్పంగానైనా తెలియవస్తున్న విశేషాలను పట్టించుకోకుండా ప్రతికూల వ్యాఖ్యలు చేస్తూ వచ్చారు. ఆయన చుట్టూ చేరిన వారిలో కొందరు అదే పనిగా కమ్యూనిస్టు వ్యతిరేకతకు ఆయనను సాధనంగా చేసుకున్నారు. అయితే ఒకసారి సోవియట్‌ను సందర్శించడానికి అవకాశం రాగానే ఆయనలోని ఈ దురభిప్రాయాలన్నీ పటాపంచలైపోయాయి. రష్యాలో పేదరికాన్ని, అవిద్యను, వ్యాధులను నిర్మూలించేందుకు సాగుతున్న సామ్యవాద మహాయజ్ఞం ఆయనను ఉత్తేజపర్చింది. ఈ మహత్తర విజయాలను గురించి అక్కడ మానవుడి చైతన్య గాథలను గురించి ఆయన రష్యా నుంచి ఉత్తరాలు పేరిట రాశారు.

ఒక ప్రముఖ కవిగా టాగూర్ అవసరమైనప్పుడు రాజకీయ ఉద్యమాలలో పాలు పంచుకోవడానికి వెనుకాడలేదు. కవి సమాజంలోంచే పుడతాడు. దానిపట్ల బాధ్యత కలిగి వుంటాడని ఆయన గుర్తించాడు. టాగూర్‌కు బ్రిటిష్ పాలన ఫలితాల పట్ల భిన్నమైన అంచనాలుండేవి. ఈ దేశంలో రకరకాల మతాలు జాతులను బ్రిటిష్ పాలన ఏకం చేయడం సానుకూల అంశంగా ఆయన పరిగణించేవారు. 1893లో ఇంగ్రేజి ఓ భారత్ బాసి రాశాడు. (ఇలాటి అంచనా కారల్ మార్క్స్ కూడా మరో కోణం నుంచి ఇచ్చాడు.) కాకపోతే ఆ కారణంగా బ్రిటిష్ పాలకులతో సామరస్యపూర్వకమైన సంబంధాలుండాలని ఆయన మొదట వాదించేవారు. అలాగే బ్రిటిష్ వారు ఏర్పరిచిన జమీందారీలలో స్వదేశీ సమాజ్ ఏర్పాటు చేయవచ్చునని కూడా 1904లో వాదించాడు. అయితే ఇవన్నీ ఆయన భావావేశాలతో గాని ఆశయాలతో గాని పొసిగేవి కావు కనకనే ఘర్షణ తప్పలేదు. బ్రిటిష్ పాలకులు అకృత్యాలకు అమానుషాలకు పాల్పడినప్పుడు అత్యంత భీషణమైన భాషలో శక్తివంతమైన కవిత్వంతో విరుచుకుపడ్డాడు. హిలాల్ జైలులో నరమేధం సాగినపుడు గట్టిగా ఖండించాడు. జలియన్ వాలాబాగ్ వుచకోతకు నిరసనగా తనకు బ్రిటిష్ వారిచ్చిన సర్ బిరుదును పరిత్యజించాడు. మహాత్మాగాంధీతో టాగూర్ ఎప్పుడూ ఆత్మీయ సంబంధాలు కలిగివుండేవాడు. ఆయనను 'మహాత్మా' అని మొదటిసారి పిలిచింది కూడా టాగూరే. ఈయనను 'గురుదేవ్' అని ఆయన సంబోధించేవాడు. టాగూర్‌లో ఎప్పుడూ మత ఛాందసం లేదు. లౌకికతత్వాన్నే ఆయన కోరుకున్నారు. తను ప్రతిపాదించిన స్వదేశీ సమాజ్‌లో ఒక హిందూ ఒక ముస్లిం అధినేతలుగా వుండాలని చెప్పారు.

మొదటి ప్రపంచ యుద్ధం ఆయన తాత్వికతను పూర్తిగా మార్చేసింది. 1916లో ఆయన జపాన్ సైనిక దురాక్రమణలను నిశితంగా ఖండించాడు. హిట్లర్ ముస్సోలినీలపై నిప్పులు చెరిగేలా రాశాడు. ఫాసిస్టు పోకడలను జాతి విద్వేషాన్ని గట్టిగా వ్యతిరేకించాలని నిర్ణయానికి వచ్చాడు. హెన్రీ బార్బూస్, రోమరోలా వంటి రచయితల ఫాసిస్టు వ్యతిరేక పోరాటంతో గొంతు కలిపాడు. చైనాపై జపాన్ దురాక్రమణను ఖండిస్తూ 1937 మేలో చైనా ప్రజలకు ఒక సందేశం పంపించాడు. తనను కలిసిన చైనా మేధావి ప్రొ॥టాన్ యున్ సేన్ ద్వారా ఈ సందేశాన్ని అప్పటి నాయకుడు చాంగ్ కై షేక్‌కు పంపినప్పటికీ ఉత్తరం మాత్రం ఆయన పేరిట గాక చైనా ప్రజలనే ఉద్దేశించి రాయడం విశేషం. తను వ్యక్తిగతంగా రు.500 విరాళంతో ప్రారంభించి చైనా ప్రజల సంఘీభావ నిధి వసూలుకు కృషి చేశాడు. ఆయన సందేశం సహాయం చైనా రేడియోలో విస్తృతంగా ప్రచారం చేశారు. అది సహించలేక జపాన్ ఫాసిస్టు ఆస్థాన కవి యోన్ నోగుచి అత్యంత నీచమైన భాషలో టాగూర్ పై దాడి చేస్తే విశ్వ

కవీంద్రుడు అందుకు దీటైన భాషలో జవాబిచ్చాడు. తన మహోజ్వల సాహితీ జీవితపు ఆఖరి ఘట్టంలో రాసిన గొప్ప వ్యాసం "నాగరికతా సంక్షోభం'లో సామ్రాజ్యవాదపు విస్తరణ కాంక్షలు మానవత్వాన్ని బాహాటంగా సమాధి చేస్తున్నాయని పాశవికతకు పాలు పోసి పెంచుతున్నాయని ఖండించాడు. కాలాంతర్ (నవ యుగోదయం) అన్న కవితలో ఆయన మానవాళి ఎదుర్కొంటున్న సవాళ్లపై ఆవేదనను వెలిబుచ్చాడు. ధనస్వామ్య వర్గం నుంచి వచ్చిన ఒక ఉదార వాదిగా ఆయనకు కొన్ని పరిమితులున్నా ప్రజల పక్షపాతం తిరుగులేనిది. వర్గ పోరాటం అనివార్యమని కూడా ఆయన గుర్తించాడు. అయితే దానికి పూర్తిగా తనను తాను అంకితం చేసుకోలేకపోయాడు. తన నేపథ్యం, ఆలోచనలూ ఆచరణ విధించే పరిమితులేమిటో ఆ కవికి బాగా తెలుసు. కొత్త యుగం తననుంచి ఏమి కోరుతున్నదో అర్థం చేసుకున్నా ఆ కారణంగానే కొంచెం ఎడంగా వుండిపోయాడు.

సమస్య ఏమిటంటే టాగూర్ జీవితంలోని ఈ పార్శ్వానికి తగినంత ప్రచారం ఇవ్వకుండా పక్కన పెట్టేస్తారు. ఎంతసేపటికీ ఆయనను కేవలం సౌందర్యారాధకుడైన ఒక మహామేధావిగా చూపించడానికే ప్రాధాన్యతనిస్తారు. వాస్తవం ఏమిటంటే సంపూర్ణ అర్థంలో టాగూర్ పీడిత ప్రజల కవి కాకున్నా నిరంతరం వారి గురించి తపించిన వాడే. వారే నాగరికతా నిర్మాతలని ఆయన తలపోశాడు. అందుకే ఆయన నిరంతరం ప్రకాశించే ఒక ఉజ్వల సృజన తార. మానవతా ప్రతీక. శాంతి సౌహార్ద్రతల అక్షర పతాక.

★

ఆ కాలంలో తెలుగులో మంచి సాహిత్యానికి ఆదరణ ఉండేది. అప్పటికి కమర్షియల్ నవలా సాహిత్యం ప్రారంభం కాలేదు. అందువల్ల మంచి సాహిత్యాన్ని ప్రజలు కొని చదివేవారు. పుస్తకాల అమ్మకాలు బాగానే ఉండేవి. ప్రముఖ కవి బెల్లంకొండ రాందాసు, మీజాన్ పత్రికలో పనిచేసిన శ్రీనివాస చక్రవర్తి, మద్దిపాటి సూరి, వెలిచాల కొండలరావు వంటి వారు రవీంద్రుని పుస్తకాలను అనువాదం చేసేవారు. మద్దిపాటి సూరి నేరుగా బెంగాలీ నుండి తెలుగు చేసేవారు. ఇంగ్లీషు నుండి ఎక్కువగా అనువాదం జరిగింది. హిందీ, బెంగాలీ నుండి కూడా కొన్ని అనువాదాలు చేశారు. 'గీతాంజలి' వంటి క్లాసిక్స్‌కు తప్ప ఇతర బెంగాలీ సాహిత్యానికి ఆనాటి వైభవం తెలుగులో ఇప్పుడు లేదు. రవీంద్రుని రచన 'చరణదాసు'ను తెలుగులో గొప్ప సినిమాగా మలిచారు. మరికొన్ని రచనలు కూడా సినిమాలుగా వచ్చాయని ఆయన అన్నారు. అప్పట్లో ప్రచురణకర్తలకు సాహిత్యంతో ఉండే అనుబంధం పెరుమాళ్ళు గారి మాటల్లో వ్యక్తమయింది.

తెలుగులో రవీంద్రుని పుస్తకాలు

- వొరప్రసాద్

బెంగాలీ సాహిత్యంతో తెలుగువారికి గల అనుబంధం అందరికీ తెలిసిందే. ఏదో ఇంటర్వ్యూలో 'ప్రముఖ తెలుగు రచయితలలో ఒకరి పేరు చెప్పు? అని అడిగితే వెంటనే 'శరత్' అని చెప్పాడట ఆ తెలుగు అభ్యర్థి. దేవదాసు, శేషప్రశ్న, శ్రీకాంత్, పరిణిత వంటి ప్రముఖ నవలలు రాసిన బెంగాలీ రచయిత శరత్‌చంద్ర చటోపాధ్యాయ. బెంగాలీ సాహిత్యం ప్రస్తావన వచ్చినప్పుడల్లా ఈ విషయం సరదాగా చెబుతుంటారు. జాతీయోద్యమకాలం అనంతరం అరవైదశకం నుంచి తెలుగులోకి విస్తృతంగా బెంగాలీ సాహిత్యం వచ్చింది. గ్రంథాలయాలతో పాటు ప్రతీ తెలుగింట తెలుగు పుస్తకాలతో పాటు బెంగాలీ అనువాద సాహిత్యం కొలువుండేది. వాటిలో శరత్‌చంద్ర, రవీంద్రనాథ్ టాగూర్ రచనలదే అగ్రస్థానం. వీళ్ళిద్దరి పేర్లు తెలిసినంతగా ఇతర బెంగాలీ రచయితల పేర్లు తెలుగులో పెద్దగా చలామణీలో లేవు. ముఖ్యంగా రవీంద్రనాథ్ టాగూర్ 'గీతాంజలి' కావ్యానికి 1913లో నోబుల్ బహుమతి ప్రకటించిన తర్వాత ఆయన రచనలపట్ల ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరిగింది.

అలాగే దేశంలోని ఇతర భాషా సాహిత్యాభిమానులు కూడా రవీంద్రుని రచనలు చదవడం పెరిగింది. ముఖ్యంగా రవీంద్రుని శతజయంతి (1861-1961) సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా ఆయన రచనలు విస్తృతంగా ప్రచురించారు. అలాగే మనదేశంలోగల వివిధ భాషలలోకూడా రవీంద్రుని రచనలు ప్రచురించారు. అదేకాలంలో తెలుగులో కూడా పలు ప్రచురణ సంస్థలు బెంగాలీ సాహిత్యాన్ని ప్రచురించారని ప్రముఖ ప్రచురణ కర్త, జయంతి పబ్లికేషన్స్ అధినేత పెరుమాళ్ళు చెబుతున్నారు. నోబుల్ బహుమతి పొందిన భారతీయ కవిగా, విశ్వకవిగా, గురుదేవులుగా ప్రసిద్ధుడైన రవీంద్రుని సాహిత్యం ఆ రోజుల్లో ప్రజలు విరివిగా కొనిచదివేవారని ఆయన అన్నారు. ఆయన మరిన్ని వివరాలు చెబుతూ 'కొన్ని సంస్థలు శతజయంతి సంవత్సరం కంటే ముందు తెలుగులో ఒకటి రెండు ప్రచురణలు తీసుకొచ్చినప్పటికీ 1961 నుండి 1980 మధ్యలో రవీంద్రుని సాహిత్యం ఎక్కువశాతం అంటే ఇంచుమించు అన్ని రచనలూ తెలుగులో ప్రచురించారు. దేశి కవితా, ఆదర్శ గ్రంధమండలి, గద్దె లింగయ్య వంటి పబ్లిషర్లు బెంగాలీ సాహిత్యాన్ని తెలుగులోకి తీసుకొచ్చారు. ఆ కాలంలో తెలుగులో మంచి సాహిత్యానికి ఆదరణ ఉండేది. అప్పటికి కమర్షియల్ నవలా సాహిత్యం ప్రారంభం కాలేదు. అందువల్ల మంచి సాహిత్యాన్ని ప్రజలు కొని చదివేవారు. పుస్తకాల అమ్మకాలు బాగానే ఉండేవి. ప్రముఖ కవి బెల్లంకొండ రాందాసు, మీజాన్ పత్రికలో పనిచేసిన శ్రీనివాస చక్రవర్తి, మద్దిపాటి సూరి, వెలిచాల కొండలరావు వంటి వారు రవీంద్రుని పుస్తకాలను అనువాదం చేసేవారు. మద్దిపాటి సూరి నేరుగా బెంగాలీ నుండి తెలుగు చేసేవారు. ఇంగ్లీషు నుండి ఎక్కువగా అనువాదం జరిగింది. హిందీ, బెంగాలీ నుండి కూడా కొన్ని అనువాదాలు చేశారు. 'గీతాంజలి' వంటి క్లాసిక్స్‌కు తప్ప ఇతర బెంగాలీ సాహిత్యానికి ఆనాటి వైభవం తెలుగులో ఇప్పుడు లేదు. రవీంద్రుని రచన 'చరణదాసు'ను తెలుగులో గొప్ప సినిమాగా మలిచారు. మరికొన్ని రచనలు కూడా సినిమాలుగా వచ్చాయని ఆయన అన్నారు. అప్పట్లో ప్రచురణకర్తలకు సాహిత్యంతో ఉండే అనుబంధం పెరుమాళ్ళు గారి మాటల్లో వ్యక్తమయింది.

'గీతాంజలి' కావ్యానికి తెలుగులో దాదాపు ఇప్పటికి 18 అనువాదాలు వచ్చాయి. అనువాదం చేసిన వారిలో చలం వంటి ప్రసిద్ధులు ఉన్నారు. ప్రముఖ తెలుగు సినీనటుడు కొంగర జగ్గయ్య కూడా గీతాంజలికి అనువాదం చేశారు. ఇంగ్లీషులో ఉన్న 'గీతాంజలికే ఎక్కువగా తెలుగు అనువాదం జరిగింది. ఒకరు నేరుగా మూలభాష బెంగాలీ నుండి కూడా అనువాదం చేశారు. తాజాగా 2009 డిసెంబరు నెలలో భూషి కృష్ణదాసు చాలా సరళమైన వచనంలో 'గీతాంజలి'ని అనువదించి ప్రచురించారు. ఇలా తెలుగు వారికి రవీంద్రుని రచనలతో అనుబంధం ఏర్పడింది. ఇప్పటికీ రవీంద్రుని సాహిత్యంపట్ల ఆదరణ తెలుగులో బాగానే ఉంది. తెలుగులో నిత్యం అమ్ముడుపోయే పుస్తకాల్లో 'గీతాంజలి' ఒకటి. ★

దోపిడీపై పోరాటం 'రక్తకరబీ'

-చందన్‌సేన్

1923, మే 1న మద్రాస్‌లోని మత్స్యకారులు భారత్‌లో మొదటిసారిగా మే డే జరుపుకున్నారు. ఆ సమయంలో రవీంద్రనాథ్ టాగూర్ 'రక్తకరబీ' (ఎర్ర గన్నేరు) నాటకం రాయడం మొదలుపెట్టారు! 1920వ సంవత్సరంలో సోవియట్ కమ్యూనిస్టుపార్టీ తోడ్పాటుతో భారత్‌లో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. 1920వ సంవత్సరం అక్టోబర్ 30న బొంబాయిలో 'ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్' ఏర్పడింది. 1921-22 భారత్‌లో సుమారు 400 సమ్మెలు నిర్వహించబడ్డాయి. బెంగాల్ జనపనార మిల్లుల్లో, అస్సాం టీ తోటలలోని కార్మికులు ఉద్యమాలను నడుపుతున్నారు. అస్సాం, బెంగాల్ రైల్వే కార్మికులు దీనికి సంపూర్ణ మద్దతునిచ్చారు. 18,000 మంది కార్మికులు రెండున్నర నెలలపాటు ఈ పోరాటాన్ని నడిపారు. దగ్గర దగ్గరగా 300 బంద్‌లు విజయవంతమయ్యాయి. 1921లో బీహార్‌లో బొగ్గుగనుల కార్మికులు సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని కోరారు. ఈ చరిత్రను దృష్టిలో పెట్టుకునే ముందుకెళ్తున్నాడు మన రవీంద్రుడు.

ఆ దశలో బెంగాల్‌లో అదేవిధంగా భారత్‌లో ప్రతి నిమిషం చరిత్ర అసలు రూపాన్ని మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీని ఫలితంగా తప్పని ప్రమాదాలు ఏర్పడుతున్నాయి. అప్పుడప్పుడు వాషింగ్‌టన్‌లో, అప్పుడప్పుడు జి-9 వల్ల నానా కార్యకలాపాలు. తమ చేతగానితనం నుంచి బయటపడడానికిగాను వారితో కలిశారు భారతీయ దళారీలు. నిమిషంలో ఆ తర్వాత మళ్లీ మళ్లీ ధ్వనిస్తుంది 'రక్తకరబీ'లోని పాత్ర మోడల్‌లో భయంతో కూడిన వాక్యోపవాక్యాలు.... "గడిపెట్టి గట్టిగా కట్టేశాం. కాసేపటి తర్వాత చూస్తే ఏవిధంగా జారి బయటికి వచ్చిందో- ఆ శరీరం మీద కొంచెం కూడా అదిమిపెట్టి ఉంచే ప్రయత్నం చెయ్యకు. మరి తను మాటిమాటికి వేషం మారుస్తాడు. ఆకారం మారుస్తాడు. అశ్చర్యపడే విధంగా వుంది తన బలం. కొన్ని రోజులు తను ఇక్కడ ఉంటే ఒప్పంద కార్మికులు మాట వినరు. వినరు వినరంతే. ఎన్నిసార్లు తనను పిప్పి చేసి పారేస్తున్నారో, అన్ని సార్లు తిరిగి నిలబడాలనే తీవ్ర కోరిక... జీవితంలో ఒక్కసారి శక్తి వచ్చిందో, కనీసం ఒక్కరోజు కోసమైనా... కేవలం ఈ సర్దార్ మెడలు విరగ్గొట్టడం కోసమైనా... ఈ సర్దార్ గుండెలమీద ఒక్కసారి కొరకడం కోసం, ప్రపంచంలో నలుమూలల ఆకలితో పస్తులుంటున్న కార్మికులు, అప్పుల భారంతో ఆత్మహత్యలు చేసుకునే రైతులలో ఈ వాక్యోపవాక్యాలు మళ్లీ మళ్లీ ప్రతిధ్వనిస్తాయి. రవీంద్ర నాటకం మనల్ని ప్రస్తుత పరిస్థితి అద్దం ముందుకు మళ్లీ మళ్లీ లాక్కెళుతుంది.

మనసును ఆక్రమించకుండా శరీరాన్ని ఆక్రమించలేం. లేకపోతే తన వస్తువులు అమ్ముడు పోవు. శ్రమశక్తి అమ్మడంలో, అమ్మవలసిందే అని నిర్ణయించడంలో మానసిక శిక్షావ్యవస్థ ఎలా అయినా తనే సొంతగా నమ్ముతాడు. ఇదే తన ముక్తి. ఇదే తన అభిప్రాయం. ఇదే తన పరమ సౌభాగ్యం. ఇది తనకు సెలవు. ప్రతి ముహూర్తం బంగారం బంగారం అని ప్రాణం కొట్టుకుంటూ వుంటుంది. శ్రమ దోపిడీ చివరి వరకు కార్మికుడి బలాన్ని క్షీణింపచేస్తూ వుంది. పెట్టుబడిదారుల పీడనలో శ్రామిక్ తన మానవ గుణాలను కోల్పోతూ ఉండేవాడు. తనలోని మానవత్వం, మనుషత్వం తగ్గుతూ తగ్గుతూ కేవలం లాభం తెచ్చే యంత్రంలో ఒక భాగంగా మారతాడు. తన వ్యక్తిత్వాన్ని కోల్పోయి తను కేవలం ఒక సంఖ్యలా మిగిలిపోతాడు. 'రక్తకరబీ'లోని ఆ భయంకర వాక్యాలు ముద్దలు ముద్దలుగా బంగారం తీసుకువస్తున్నా, మనం మనుషులం కాదు. కేవలం సంఖ్యలం.

కానీ విశ్వకవికి, మానవ జాతి విముక్తి కోరే రవీంద్రనాథ్‌కు తెలుసు.... పెట్టుబడిదారుల దగ్గర రాజా - సర్దార్, గోసాయ్ -మొడల్‌ల మాటే చివరి మాట కాదని. రంజన్, విశ, ఫాగు చివరికి ఈ కారాగారాన్ని కూలుస్తారు. చరిత్ర రంజన్ పక్షమే. కాని ఈ కాలంలో నలువైపుల చూసినప్పుడు వాళ్ల వీపు మీద ఒక వైపు గోసాయిలు, మరొక వైపు సర్దార్.

'రక్తకరబీ' నాటకం గురించి చాలాసార్లు, చాలావిధాలుగా ఆలోచనలు జరిగాయి. ప్రదర్శనలు జరిగాయి. రవీంద్రనాథ్ ఎలాంటి నాట్యకారుడంటే, ఆయన ప్రయోగాల ద్వారా, మంచి నాట్యకారులకే అవకాశాన్ని కల్పించాడు. 'రాథర్ రోషి, టేసర్ దేష్, డాక్‌ఘర్, అచలయాతన్' డ్రామాలలో ఆయన ప్రతి నిమిషం మృదువుగా నవ్వి నాట్యక్రియలను ఇంకా బాగా చెయ్యాలని ఆహ్వానం తెలిపారు. సమాజ వ్యవస్థ కోరుకున్న విధంగా మారడానికి పోరాటం చెయ్యాలని ఆహ్వానించారు. అదే విధంగా ఈరోజు పర్యావరణాన్ని పరిరక్షించడానికి ఎవరైతే పోరాటం చేస్తున్నారో వాళ్లకి కూడా పిలుపునిచ్చింది 'రక్తకరబీ'.

(ఆంధ్రానువాదం: సంధ్యా ఘోష్)

రవీంద్రుడి జీవితంలో ముఖ్య సంఘటనలు

♦విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ 1861లో మే 7న కలకత్తాలో జన్మించారు.

♦తండ్రి దేవేంద్రనాథ్ ఠాగూర్. తల్లి శారదాదేవి. ఆయన వారి 14వ సంతానం.

♦బాల్య దశలోని చదువంతా ఇంట్లోనే సాగింది.

♦1868లో పాఠశాలలో విద్యాభ్యాసం మొదలైంది.

♦ఆయన తన పెద్ద అన్నయ్య స్ఫూర్తితో దాదాపు 7వ సంవత్సరంలోనే మొదటి పద్యం రాశారు.

♦1870లో సంగీతం నేర్చుకోవడం ప్రారంభించారు.

♦1871లో ఆయనకు ఉపనయనం చేశారు. అదే సంవత్సరంలో ఆయన 'పృథ్వీరాజ్ పరాజయం' నాటకం రచించారు.

♦1874లో ఆయన కవిత 'అభిలాష' అచ్చయింది.

♦పద్నాలుగేళ్ల పిల్లవాడిగా వున్నప్పుడు తల్లి మరణించింది.

♦1875లో తొలిసారిగా ప్రజలముందు కవిగా నిలబ్డాడు.

♦1877లో పదహారేళ్లప్పుడు రంగస్థల ప్రవేశం చేశాడు. జ్యోతిరింద్రనాథ్ రచించిన ఒక నాటకంలో అలిక్ బాబు అనే ప్రధానపాత్ర పోషించాడు.

♦1878లో పై చదువుల కోసం ఇంగ్లండు వెళ్లారు.

♦1881లో మొదటిసారిగా భక్తిగీతాలకు బాణీలు కట్టారు. అదే సంవత్సరంలో సంగీత నాటకం 'వాల్మీకి ప్రతిభ'ను స్టేజి మీద వేశారు.

♦ తన పెద్దన్నయ్య జ్యోతిరింద్రనాథ్‌తో కలిసి సరస్వతి సమాజాన్ని స్థాపించారు.

♦1883లో మృణాళినీ దేవిని వివాహం చేసుకున్నారు.

♦1892లో విద్యపై రాసిన మొదటి వ్యాసం 'విద్య గురించి' ప్రచురితమైంది.

♦1898లో 'భారతి' వారపత్రికకు సంపదాక బాధ్యతలు చేపట్టారు.

♦1901లో శాంతినికేతన్‌ను స్థాపించారు.

♦1902 - 1907 మధ్య కాలంలో ఆయన భార్య, కుమారుడు, కూతురు మరణించారు.

♦1911లో మన జాతీయ గీతం 'జన గణ మన'కు బాణీ కట్టారు.

♦రవీంద్రనాథ్ టాగూర్ రాసిన అద్భుత కావ్యం 'గీతాంజలి'కిగాను ఆయనకు 1913 వ సంవత్సరంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే నోబెల్ బహుమతి వచ్చింది.

♦1919లో జరిగిన జలియన్‌వాలాబాగ్ దురంతాన్ని ఖండిస్తూ ఆయనకు వారిచ్చిన 'సర్' బిరుదును పరిత్యజించారు.

♦1878- 1932 మధ్య కాలంలో 30 దేశాలను, 5 ఉపఖండాలను పర్యటించి అనేక ఉపన్యాసాలు ఇచ్చారు.

♦1940 సెప్టెంబర్ చివరి రోజుల్లో కలింపాంగ్‌లో అకస్మాత్తుగా జబ్బు పడ్డారు.

♦1941 ఆగస్టు 7న రవీంద్రుడు మరణించారు.

కవి హృదయాంజలి 'గీతాంజలి'

-దేవి

'గీతాంజలి' విశ్వకవి హృదయం మనపై వర్షించిన కవితామృతధార. గీతాంజలిని ఆస్వాదించడానికి ఈశ్వరుడిపై నమ్మకం ఉండాల్సిన అవసరం లేదు. సౌందర్య భావన చూపులనుంచి లోపలికి కుంభవృష్టిగా కలిసి ఆ దృశ్యోద్వేగం గుండెగట్లు తెంచుకు పారేటప్పుడు... అది వ్యక్తీకరించడానికి...

శ్రీశ్రీకి విప్లవం, చలానికి స్త్రీ, ఫేయిజ్ అహ్మద్ ఫెయిజ్‌కి ప్రవాసాలు- ప్రేయసి కన్నీళ్ల, గోర్కీకి చెమటా-నెత్తురూ, మయకోవ్స్కీకి సామ్యవాదమూ- లెనిన్, నెరుడాకి ఆకాశమంత ఆశా -దాని ఆకాంక్ష, బ్రెక్ట్‌కి వైరుధ్యాలూ.... ఒక్కొక్కరికీ ఒక్కొక్కటి సాధనం... రవీంద్రుడికి ప్రకృతీ-ప్రేమా...

ఈశ్వరుడున్నాడా లేదా అనే చర్చ ఇక్కడ అప్రస్తుతం. విశ్వకవి దృష్టిలో ఈశ్వరుడంటే ఎవరు? ప్రకృతీ... దాని అసమాన సుకుమార బీభత్స సౌందర్యం, గానం, చిత్రం, నృత్యం, మనిషీ, బాల్యం, ప్రేమలూ, స్త్రీలు, జీవితం ఒక్కటనేమిటి భౌతిక ప్రపంచంలో ఆనందం కలిగించే ప్రతిదాన్నీ ఈశ్వరుడనే అన్నాడు.

ఆ ఒక్క పదం తీసేసి ఆస్థానంలో మరో పదం... ఎవరికిష్టం అయిన పదం వారు చేర్చి చదువుకుంటే... ఆశయం, విప్లవం, భావజాలం, సమభావం, సామ్యవాదం, నవలోకం, శ్రామికవర్గం, కమ్యూనిజం...ఏది చేర్చుకున్నా ...సరిగ్గానే సరిపోతుంది. అరే... నేననుకున్న దాన్ని ఇంత అద్భుతంగా ఎట్లా రాశాడబ్బా అని ఆశ్చర్యపోతాం.

సమత్వం సౌందర్యం ఒకటి లేకుండా రెండోది లేదు. దోపిడీ, పీడన క్రూరం. అన్యాయం, దుర్మార్గం వికృతం. రమణీయ ప్రకృతిని కాలుష్య ఉత్పాతం నుండి కాపాడాలంటే లాభాల ఉత్పీడనం పోవాలి. ప్రకృతిలో మానవునికి స్నేహం సమతుల్య సాధన అవసరం. నేరుగా మార్పుని ప్రభోదించలేకపోయినా కవి తపనంతా ఇదే...

గీతాంజలి శూన్యవాదం కాదు. శుష్క వేదాంతం కాదు. కనిపించని లోకాల మైమరపు భ్రమా కాదు. బలహీనులూ, వృద్ధులూ, లక్ష్యరహితులూ, బద్ధకస్తులైన వంచక గురువుల పంచన చేరి తమను తాము మోసం చేసుకునే జాడ్యమూ కాదు. భయమో! అభద్రతో! చిక్కుముడులవుతున్న పరిస్థితుల గందరగోళంలో దారి దొరక్క మాదకద్రవ్యాల్లో అతీతాల్ని అందుకోవడమూ కాదు.

"వైరాగ్యంలోని మోక్షం నాకవసరంలేదు. సహస్ర ఆనంద బంధాలతో స్వతంత్రం నన్నాలింగనం చేసుకుంది" అంటే టాగూర్ దృష్టిలో ఆనందం స్వేచ్ఛలో వుంది. ఇహలోకపు అనుబంధాలు తెంపుకునే స్వేచ్ఛకాదు. కనిపించని దేవుడిచ్చే మోక్షం కాదు. తోటివారితో, పూవులతో, పుడమితో, వెలుగుతో విడదీయలేని బంధాలిచ్చే గాఢానుభవమే స్వేచ్ఛ.

"ఎక్కడ దరిద్రాతి దరిద్రులూ పరిత్యాతి పరిత్యుజులు వుంటారో అక్కడ పీలికలు ధరించి తిరుగుతాడు ఈశ్వరుడు. నిస్సహాయులకి సఖుడయి" నిజమే దేవుడు పేదలకు ఓదార్పు... అతని స్థానం వారి మధ్యనే. మరి బాధల మాటేంటి? అవెట్లా తీరాలి? ఎవరు తీర్చాలి? కవికి దుఃఖం తెల్సు. దాని వేదన తెల్సు. పరిష్కారం తెలియదు. ఓదార్పు తెల్సు. మార్పు కోసం తిరగబడ్డం తెలియదు. కాఠిన్యం, కల్లోలం అతని సౌందర్యారాధనకు భంగం కలిగిస్తాయనా! ప్రశ్నలు వేసుకున్నాడా కవి. ఏం సమాధానాలొచ్చాయి... తననింత బలంగా అల్లుకున్న అందానికి కుట్టబడిన కవి వాస్తవాల్ని వైరుధ్యాల్ని ఎందుకు పట్టించుకోలేదో!

"గుడి మూలన లేదు దేవుడు. ఎక్కడైతే గట్టి నేలని రైతు దున్నుతున్నాడో ఎక్కడ బాట వేయడానికి కూలీలు రాళ్ల కొడుతున్నారో అక్కడ ఎండలో వానలో వాళ్ల మధ్యలో వున్నాడు ఈశ్వరుడు. నీ మడి బట్టలు విడిచి దుమ్ము నేలమీదికి రా" అని ఆర్తిగా విన్నవించాడు పూజారులకీ, దైవజనులకి.. వచ్చారా ఎవరైనా? నుదుటి చెమటతో కష్టించడమే దైవత్వమని కూడా వివరించాడు.. విన్నారా ఎవరైనా? కష్టించారా?

బంగారు లేయండల్నీ, సోమరి మబ్బుల్నీ, అల్లరిగా ఆడుకునే పువ్వుల్నీ, లక్ష్యపెట్టకుండా, నవ్వకుండా, పాడకుండా వాళ్ల కఠోరసాధన చేశారు. నిర్జీవ గ్రంథాల్లో, వెండి బంగారాల్లో దేవుడిని ప్రతిష్టించారు. తమని తాము సుఖపెట్టుకుని సామాన్యుల్ని మోసం చేశారు. కాని అవ్యక్త ఆనందపు కలల మసక నీడలకి తనని తాను అప్పజెప్పుకుని గొడ్లు కాసే పిల్లవాడి

బంగారు లేయండల్నీ, సోమరి మబ్బుల్నీ, అల్లరిగా ఆడుకునే పువ్వుల్నీ లక్ష్యపెట్టకుండా, నవ్వకుండా, పాడకుండా వాళ్లు కఠోరసాధన చేశారు. నిర్జీవ గ్రంథాల్లో, వెండి బంగారాల్లో దేవుడిని ప్రతిష్టించారు. తమని తాము సుఖపెట్టుకుని సామాన్యుల్ని మోసం చేశారు. కాని అవ్యక్త ఆనందపు కలల మసక నీడలకి తనని తాను అప్పజెప్పుకుని గొడ్లు కాసే పిల్లవాడి వేణుగానంలో మునిగిపోయిన రవీంద్రుని చెంతకు ఈశ్వరుడు వచ్చాడు. ఈశ్వరుడంటే అందం... ఆనందం.

మనిషి వాంఛల రూపధారి ప్రేమోద్వేగం. సంగీతం దాని మృదు మధుర వాహకం. అలంకార అహంకారం లేని గానం మాత్రమే జీవితంలో కర్కశత్వాన్ని అపభ్రంశాన్ని కరిగించివేస్తుంది.

రెల్లు పిల్లంగోవిలోని గాలిపాటల ఇంద్రజాలం

విశ్వరాగంతో మేళవించిన ఓ చిన్నరాగపు అలౌకిక మంత్రం

మనిషీ - విశ్వాంతరాళం, సమస్త సృజనా ఏకమయిన అపూర్వ సంగమం - గీతాంజలి

గీతాంజలి సంపూర్ణంగా ఇహలోకంపై భౌతిక ప్రేమ. దృశ్యంపై కావ్య మోహం. భూమిపై అవ్యాజానురాగం. కమకనే సహజత్వాన్ని ధ్వంసించే ప్రతిదాన్ని తిరస్కరిస్తాడు కవి. మమతల్ని నాశనం చేసే కాపట్యాలన్నింటినీ చీకటి పొరలల్లే తొలిచేస్తాడు ఈ రవి. ప్రభాతకిరణం కాంతిని నింపే పిల్లల్ని, బీటలు పూడ్చే వానల్ని, నిశ్శబ్దం నిండిన మాటల్ని, మౌనం ఆలపించే రాగాల్ని ఆరాధిస్తాడు.



వేణుగానంలో మునిగిపోయిన రవీంద్రుని చెంతకు ఈశ్వరుడు వచ్చాడు. ఈశ్వరుడంటే అందం... ఆనందం.

మనిషి వాంఛల రూపధారి ప్రేమోద్వేగం. సంగీతం దాని మృదు మధుర వాహకం. అలంకార అహంకారం లేని గానం మాత్రమే జీవితంలో కర్కశత్వాన్ని అపభ్రంశాన్ని కరిగించివేస్తుంది.

రెల్లు పిల్లంగోవిలోని గాలిపాటల ఇంద్రజాలం

విశ్వరాగంతో మేళవించిన ఓ చిన్నరాగపు అలౌకిక మంత్రం

మనిషీ – విశ్రాంతరాళం, సమస్త సృజనా ఏకమయిన అపూర్వ సంగమం

– గీతాంజలి

గీతాంజలి సంపూర్ణంగా ఇహలోకంపై భౌతిక ప్రేమ, దృశ్యంపై కావ్య మోహం. భూమిపై అవ్యాజానురాగం. కనుకనే సహజత్వాన్ని ధ్వంసించే ప్రతిదాన్ని తిరస్కరిస్తాడు కవి. మమతల్ని నాశనం చేసే కాపట్యాలన్నింటినీ చీకటి పొరలల్లే తొలిచేస్తాడు ఈ రవి. ప్రభాతకిరణం కాంతిని నింపే పిల్లల్ని, బీటలు పూడ్చే వానల్ని, నిశ్శబ్దం నిండిన మాటల్ని, మౌనం ఆలపించే రాగాల్ని ఆరాధిస్తాడు.

శిశువు కళ్లపై సీతాకోకచిలకల్లే వాలే నిద్ర, చంద్రుని నవధవళ రేఖా కానుకిస్తాడు. పువ్వులెందుకు రంగుల స్వప్నాలయి విరుస్తాయి. పిల్లల కోసం.. చెట్లెందుకు మధురఫలాలిస్తాయి? బిడ్డల కోసం.. ఆకుల్లో సంగీతం, అలల కంఠాల మార్దవం బిడ్డల కోసమే.. బిడ్డలే మన సంపద.. వెలుగు... వాళ్లే తేజోసముద్రం..

బిడ్డలపై భావిపై ఆర్ద్రతతో మనసు తడి చేస్తాడు.

మన మనసు తెరిచి పెడితే స్వాతి చినుకల్లే వాలి ముత్యాలిస్తాడు. చెప్పాలంటే రాయాలంటే...

ఎంత ఈదినా తీరం దొరకని గాఢానుభూతి గీతాంజలి

ఎంత దూకినా చల్లని ఏకాంతమంత అగాధపులోతు

ప్రతి వాక్యానికి గుండె కవాటాలు తెరిచే లయ గీతాంజలి.

గీతాంజలి సారాంశం ఏమిటసలు?

"ఎక్కడ మనసు నిర్భయంగా వుంటుందో"

ఎక్కడ వుంటుంది మనసట్లా? అణిచివేత భయం హింసలేని లోకంలో.. ఆ లోకం కావాలి.

కవికీ మనందరికీ కూడా...

"ఎక్కడ మనుషులు తలెత్తి తిరుగుతారో"...

దారిద్రపు సిగ్గు, దయనీయ యాచకత్వం, వివక్షతల అవమానం అగ్ర ఆధిపత్యాలు కుంగదీయవో అక్కడ.. ఆ ప్రపంచం కావాలి.

"ఎక్కడ జ్ఞానం విరివిగా వెలుస్తుందో ఎక్కడ నిర్జీవమయిన ఆచారపుటెడారిలో స్వచ్ఛమయిన బుద్ధి ప్రవాహం ఇంకి పోకుండా వుంటుందో"

అవును మరి గతమే వర్తమానాన్ని శాసిస్తుంటే, భవిష్యత్తును వెనక్కి నడిపే ఆటవికత ఆధునికతగా చలామణి అవుతుంటే వివేక బుద్ధి వికసిస్తుందా? ఆచారాల నిర్బంధం లేకుండా మూఢత్వం వారసత్వంగా నెత్తికెక్కకుండా హేతువు తార్కిక స్రవంతితో ప్రవహించాలి కదా జగతిలో.. ఆ శాస్త్రజ్ఞానపు రాజ్యంలో... అది తెచ్చుకోవాలి.

"ఎక్కడ సంసారపు గోడల మధ్యన భాగాల కింద ప్రపంచం విడిపోలేదో"..

సంసారం ప్రపంచానికి అద్దం. ఎన్ని గోడలు... వర్ణం వర్గం జాతి మతం దేశం.. ఆడామగా... "ఒక మనిషిని మరొక మనిషీ ఒక జాతిని మరోజాతి దోచే, అణిచివేసే సాంఘీక ధర్మం ఇంకానా?" ఇకపై సాగకూడదు.. గోడలు బద్దలుకొట్టాలి. ఎల్లలు చెరిపేయాలి. ఆప్యాయత అందిన కుటుంబం పెత్తనం హింసలతో కాలిపోకూడదు. సంకెళ్లు లేని ఓ స్వేచ్ఛానుబంధంలో కట్టుబడిన కుటుంబం ఉద్భవించే ఓ సామాజిక నీతి నూత్నరీతి కావాలి.

"ఎక్కడ అలసట ఎరుగని శ్రమ తన బాహువుల్ని పరిపూర్ణతవైపు చాస్తుందో" "ఎక్కడ మనసు నిరంతరం వికసించే భావాల్లోకి, కార్యాల్లోకి నడుస్తుందో"...

శ్రమపై శ్రామికులదే అదుపు. దానికి శాస్త్ర సాంకేతికతల మదుపు. శారీరక మానసిక శ్రమల చక్కటి మేళవింపు.

శ్రమ చేయడమే విశ్రాంతిగా మారే ఆ కాలం...

మనిషీ – మేధస్సూ, పరికరమూ ప్రకృతీ ఒకే శృతిలో యుగళ గీతికలాలపించే... ఆ స్వర్గం....

ఆ కాలానికి ఆ లోకానికి మానవచైతన్యం మనిషిని నడిపించాలి. ఆ స్వర్గానికి వ్యక్తి సమిష్టిగా మేల్కోవాలి. ఇదీ గీతాంజలి ఆకాంక్ష.

సౌందర్య రసాత్మకతకూ, అవధులెరుగని సృజనాత్మకతకూ ఆనందాద్భుత స్వప్నాలకూ అంచుల్లేని స్వేచ్ఛకూ ఆటంకమైన ప్రతి అల్పత్వాన్ని, దుర్గతిని నిరసించింది గీతాంజలి.

ఈ ప్రపంచోత్సవంలో పాల్గొనడానికి పుట్టుకే ఓ ఆహ్వానం.

విషాదం నిరాశ సంకెళ్లయి ఆలోచనను పురోగతిని బంధిస్తే హృదయం గడ్డగట్టి ఎండిపోతే.. చైతన్యంతో తడవడానికి జీవన మాధుర్యం ఇంకిపోతే పాటల వెల్లువలో మనల్ని ముంచెత్తడానికే .... గీతాంజలి.

చైత్ర పరిమళాలతో దేదీప్యమానంగా ప్రకాశించే బతుకులోకపు అనంత ఆర్తి గీతాంజలి. ఈ జీవిత ప్రభాత భేరీలు మోగించాక.. వెలుగు వెల్లువెత్తకపోతే పోరాటం తప్పుతుందా? పోరులో పిరికితనమా! కుదరదు... మృత్యువే తలుపు తట్టినా... జీవిత పూర్తి పాత్రని అర్పించమా! జీవితం వికసించడానికి ... ఈ లోకంపట్ల చావులేని ప్రేమ కంటే సౌందర్యానందం ఏముంది?

అందుకే మృత్యువుని జయించిన "చే" అంటాడు కదా "ఈ ప్రపంచం పట్ల గాఢమయిన ప్రేమగలవాడే నిజమయిన విప్లవకారుడు".

కాబట్టి విప్లవాన్ని కామించే వారంతా 'గీతాంజలి' చదవాలి...

కవిత్వ కాంతితో లోకాన్నంతా చిక్కగా అనుభూతితో నింపినందుకు విశ్వకవికి నివాళిగా... ★



సంసారం ప్రపంచానికి అద్దం. ఎన్ని గోడలు... వర్ణం వర్గం జాతి మతం దేశం.. ఆడామగా... "ఒక మనిషిని మరొక మనిషీ ఒక జాతిని మరోజాతి దోచే, అణిచివేసే సాంఘీక ధర్మం ఇంకానా?" ఇకపై సాగకూడదు.. గోడలు బద్దలుకొట్టాలి. ఎల్లలు చెరిపేయాలి. ఆప్యాయత అందిన కుటుంబం పెత్తనం హింసలతో కాలిపోకూడదు. సంకెళ్లు లేని ఓ స్వేచ్ఛానుబంధంలో కట్టుబడిన కుటుంబం ఉద్భవించే ఓ సామాజిక నీతి నూత్నరీతి కావాలి.

"ఎక్కడ అలసట ఎరుగని శ్రమ తన బాహువుల్ని పరిపూర్ణతవైపు చాస్తుందో" "ఎక్కడ మనసు నిరంతరం వికసించే భావాల్లోకి, కార్యాల్లోకి నడుస్తుందో"...

శ్రమపై శ్రామికులదే అదుపు. దానికి శాస్త్ర సాంకేతికతల మదుపు. శారీరక మానసిక శ్రమల చక్కటి మేళవింపు.

శ్రమ చేయడమే విశ్రాంతిగా మారే ఆ కాలం...

మనిషీ - మేధస్సూ, పరికరమూ ప్రకృతీ ఒకే శృతిలో యుగళ గీతికలాలపించే... ఆ స్వర్గం....

ఆ కాలానికి ఆ లోకానికి మానవచైతన్యం మనిషిని నడిపించాలి. ఆ స్వర్గానికి వ్యక్తి సమిష్టిగా మేల్కోవాలి. ఇదీ గీతాంజలి ఆకాంక్ష.

సౌందర్య రసాత్మకతకూ, అవధులెరుగని సృజనాత్మకతకూ ఆనందాద్భుత స్వప్నాలకూ అంచుల్లేని స్వేచ్ఛకూ ఆటంకమైన ప్రతి అల్పత్వాన్ని, దుర్గతిని నిరసించింది గీతాంజలి.

విశ్వకవి విశిష్ట సృష్టి ‘గోరా’

-ఎస్. వినయకుమార్

‘మీ రచనలు తేలిగ్గా అర్థమవుతాయి. రవీంద్రుని రచనలు అంత సులభంగా అర్థం కావు’ అని ఓ పాఠకుడు తన అభిమాన రచయిత శరత్‌చంద్ర చటర్జీతో అన్నాడట.

‘నేను మీలాంటివాళ్లకోసం రాస్తాను. రవీంద్రనాథ్ టాగూర్ నాలాంటి వాళ్ల కోసం రాస్తారు. అంతే తేడా’ అంటూ శరత్ చటుక్కున సమాధానమిచ్చాడట.

పాఠకలోకం వాడుకగా చెప్పుకొనే ఈ మాటలు విశ్వకవి విశిష్టతను చాటిచెప్తాయి. నిజానికి రవీంద్రుని రచనలు సాధారణ పాఠకులు అర్థంచేసుకోలేని గొట్టు రచనలు కావు. గుండెను పిండేసే ‘కాబూలీవాలా’ నుండి సంక్లిష్ట సామాజిక స్థితిగతులను అద్దం పట్టిన ‘గోరా’ వరకు వున్నాయి. టాగూర్ గోరా నవలను 1910లో రాశారు. సరిగ్గా వందేళ్ల క్రితం రాసిందన్నమాట. దేశం బ్రిటిష్ పాలన నుంచి బయట పడింది. కులవివక్షను స్వయంగా అనుభవించిన మేధావి అంబేద్కర్ అధ్యక్షతన రాసుకొన్న రాజ్యాంగం అమల్లోకి వచ్చి కూడా అరవయ్యేళ్లు గడిచిపోయాయి. అయినా మన దేశంలోని సమకాలీన సామాజిక స్థితిగతులతో పోల్చుకుంటూ ‘గోరా’ను చదివితే మనం సాధించిన పురోగతి ఏమిటి అని అన్పించక మానదు. అనేక సామాజిక, రాజకీయ ఉద్యమాలను చవి చూడడమేకాక కమ్యూనిస్టుల ప్రాబల్యం వల్ల బెంగాల్, కేరళలో సంభవించిన మార్పులను పక్కన పెడితే మిగతా దేశంలో ఈ వందేళ్ల కాలంలో వచ్చిన మార్పు పెద్దగా లేదని స్పష్టంగా తెలిసిపోతుంది. వందేళ్ల తర్వాత కూడా కొనసాగుతున్న ఆంక్షలు మహిళలపై అణిచివేత, రుణగ్రస్త రైతాంగం, మతచాంధసం, మతోన్మాదం, కులాంతర వివాహాలు చేసుకొన్న జంటలకు విధిస్తున్న మరణశిక్షలను చూస్తుంటే మనం ‘గోరా’ రాయబడిన కాలం కంటే కూడా వెనక్కి వెళ్లామా అని అన్పిస్తుంది.

గోరా చాలా పెద్ద నవల. 500 పేజీల పైనే వుంటుంది. రచనల్లో రవీంద్రుడు వదిలేసిన ప్రక్రియ బహుశా ఏదీ లేదేమో. కవిత్వం, కథలు, నాటకాలు, నవలలు ఇలా అన్ని ప్రక్రియలనూ ఆయన అనుసరించారు. ఇవి కాకుండా చిత్రలేఖనం, నృత్యం, సంగీతం సరేసరి. ఆయన రాసిన 12 నవలల్లో గోరా పెద్ద నవలే కాకుండా చాలా సంక్లిష్టమైనది. చిరస్థాయిగా నిలిచిపోయేది. అసంఖ్యాక పాత్రలతో సాగే ఈ నవలలో నాటి సామాజిక స్థితిని సమగ్రంగా దర్శించుకోవచ్చు. ఇందులో ఏ పాత్రనూ విస్మరించడానికి వీల్లేదు. లోతైన విశ్లేషణతో కూడిన సంభాషణలతో నవల సాగుతుంది. విశ్వకవి అసమాన్య పరిశీలనా శక్తికి, చిత్తశుద్ధికి రచనా నైపుణ్యానికి మచ్చు తునక ‘గోరా’.

గోరా అన్నది నవలలోని ప్రధాన పాత్ర ముద్దు పేరు. మొత్తం పేరు గౌరీ మోహన్. బ్రాహ్మణుల ఇంట్లో పెరిగిన ఆంగ్లేయుడు. తాను ఆంగ్లేయుడని గోరాకు చివరి వరకు తెలియదు. పెంచుకొన్న తల్లిదండ్రులు అతనికి నిజం చెప్పకుండా దాస్తారు. గోరాకు దేశాభిమానం చాలా ఎక్కువ. ఆంగ్లేయులంటే అసహ్యం. హిందూ మతం పట్ల వల్లమాలిన అభిమానం. స్వతంత్ర భారతదేశం సనాతన హిందూ సమాజంగా ఉండాలని కలలు కనేవాడు. కుల కట్టుబాట్లను కచ్చితంగా పాటించాలని వాదించే వ్యక్తి. బ్రహ్మసమాజమంటే అతనికి అరికాలి మంట నెత్తికెక్కుతుంది. బ్రాహ్మణులు బ్రహ్మసమాజికులతో స్నేహం కూడా చేయరాదని వాదిస్తాడు. స్త్రీ స్వేచ్ఛ పట్ల కూడా బలమైన తిరోగమన భావాలు కల్గినవాడు. తన తల్లి గదిలో తాను కాదు గదా తన స్నేహితుడు కూడా ఏదీ తినరాదని ఆంక్షలు విధించేవాడు. తన తల్లి దగ్గర లక్ష్మి అనే క్రైస్తవ మతస్థురాలు పనిమనిషిగా వుండడమే ఇందుకు కారణం. లక్ష్మి ఇంట్లో వున్నంత వరకు నా స్నేహితుడు నీ గదిలో ఏదీ తినడానికి వీల్లేదంటూ తల్లిని శాసించే రకం. నాలుగు మిఠాయి వుండలకోసం బ్రాహ్మణత్వాన్ని మంటగలుపుకోవాలా అని అడిగేవారు. ఇలాంటి వ్యక్తి విశ్వకవి నవలకు కథానాయకుడు కావడం విశేషం. గోరాలో మంచి లక్షణాలు కూడా వున్నాయి. నమ్మినదాన్ని గట్టిగా ఆచరించే వ్యక్తి. నిజాయితీపరుడు. మంచి వక్త. తెల్లటి శరీరచ్ఛాయతో ఎవరినైనా ఆకట్టుకునేవాడు. నాయకత్వ లక్షణాలు పుష్కలం. హిందువులను ఏకం చేయడానికి ఒక సంస్థను నెలకొల్పి దానికోసం అహర్నిశలు కృషి చేసే నాయకుడు. హిందూ మతం ఉన్నతమైందంటూ బ్రహ్మసమాజాన్ని ఖండిస్తూ పత్రికల్లో ఘాటైన వ్యాసాలు రాసేవాడు.

గోరాకు ఒక ప్రాణ మిత్రుడు. పేరు వినయ భూషణ్ ఛటర్జీ. ఇద్దరూ చిన్న నాటి నుంచీ స్నేహితులు. ఇద్దరూ ఎంఎ చదువు పూర్తి చేశారు. హిందూమత ఉద్ధరణ కోసం గోరా నిర్వహించే కార్యకలాపాలన్నింటిలోనూ వినయ్ పాల్గొంటుంటాడు. గోరాలా ఛాందసుడు కాదు. సంశయం ఎక్కువ. బ్రహ్మ సమాజికుల పట్ల ఆదరణ చూపేవాడు. చదువులో గోరా కంటే చురుకైనవాడు. మృదుస్వభావి. ఇతర మతాలను, పక్షాలను విమర్శిస్తే అతనికి అభ్యంతరం లేదు. వ్యక్తిగత దూషణకు దిగరాదని మాత్రం కోరుకొంటాడు. మతాన్ని దూషించి ప్రయోజనం ఏమిటి? వ్యక్తులను బట్టబయలు చేయాలి అంటుంటాడు గోరా. గోరా వాదనలతో పూర్తిగా ఏకీభవించలేడు వినయ్. అలా అని గోరాకు దూరంగానూ వుండలేడు. వినయ్ పాత్ర స్వభావాన్ని ప్రారంభంలోనే ఒక చోట రచయిత విశ్లేషిస్తూ ఇలా చెప్తారు. ‘అతను తన మనసును అనుసరించి నడుచుకుంటాడు. అందుచేత వాదనలో ఒక సిద్ధాంతాన్ని బలపర్చుతూ ఎంత గట్టిగా మాట్లాడినా మనుషులతో వ్యవహరించవలసి వచ్చేసరికి మానవ సంక్షేమానిదే పైచేయి అవుతుంది. గోరా బోధించే సిద్ధాంతాలను సిద్ధాంతాలుగా అతను అంగీకరిస్తున్నాడా. గోరాతో ప్రాణస్నేహం మూలంగా అంగీకరిస్తున్నాడా అని చెప్పడం మాత్రం కష్టం’.

గోరా తండ్రి కృష్ణదయాళు. ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసి రిటైరయిన వ్యక్తి. కొంతకాలం ఇటావాలో కూడా పనిచేశాడు. ఉద్యోగంలో వున్నంతకాలం ఇంగ్లీషు అధికారుల ప్రాపకం పొందడానికి వేషభాషల్లో, అలవాట్లలో వారిని అనుకరించిన వ్యక్తి. తనపై అధికారులను మంచి చేసుకొని కొంత భూమిని కూడా బహుమానంగా పొందాడు. ఉద్యోగం మానేశాక అతని స్వభావం మారిపోతుంది. సనాతన ఆచారాలను మూర్ఖంగా పాటిస్తాడు. సొంత ఇంటి ఆవరణలోనే తనకు ప్రత్యేక గది ఏర్పాటు చేసుకొంటాడు. భార్యకు, కొడుకులకు కూడా ఆయన గదిలోకి ప్రవేశం లేదు. తన వంట తానే చేసుకొంటాడు. సన్యాసులను ఆహ్వానించి చర్చలు జరుపుతుంటాడు ఉపదేశాలు పొందుతుంటాడు. గోరా ఆంగ్లేయుడని వెల్లడిస్తే అప్పటిదాకా ఆ విషయం ఎందుకు దాచావని బ్రిటిష్ ప్రభుత్వం తనను ఎక్కడ శిక్షిస్తుందో, ఎక్కడ ఫించను ఆపేస్తుందో అని భయపడ్తుంటాడు.

గోరా పెంపుడు తల్లి ఆనందమయి. గోరా అంటే విపరీతమైన ప్రేమ. వినయ్ అన్నా అంతటి



రవీంద్రనాథ్ టాగూర్ మాత్రం ఆధునిక చిత్రకళకు భారతీయత పునాదిగా ఉండాలని చెబుతూనే, ఐరోపా చిత్రకళారీతుల నుండి మంచి అంశాలను స్వీకరించాలని చెప్పేవారు. అలాంటి అభిప్రాయంతోనే ఆయన తన చిత్రకళా ప్రస్థానాన్ని ఆరంభించారు. ఆయన చిత్రాలు ఆధునికత, భారతీయతల మేలికలయికగా గుర్తింపు పొందాయి. ఆయన చిత్రాలు ఇటు భారతీయులను, అటు ఐరోపావాసులను సైతం ఆకట్టుకోగలిగాయి. దేశ విదేశాల్లో ఆయన చిత్రకళా ప్రదర్శనలు జరిగాయి. 1930 మేలో పారిస్‌లో టాగూర్ చిత్రకళా ప్రదర్శన జరిగింది. ఇదే ఆయన తొలి ప్రదర్శన. ఆ ప్రదర్శనను ప్రారంభించిన ఫ్రెంచి రాజవంశానికి చెందిన అన్నా డె నోయిలెస్ 'ఈ చిత్రాలను చూస్తుంటే స్వప్న జగత్తు సోపానాలను అధిరోహిస్తున్నట్లుగా ఉంది' అని వ్యాఖ్యానించారు. తర్వాత ఈ చిత్ర ప్రదర్శన ఇంగ్లాండ్, డెన్మార్క్, స్వీడన్, రోమ్, జర్మనీ, రష్యాలలో, చివరిగా చిత్రకారుని స్వస్థలం కోల్‌కతాలో కూడా నిర్వహించబడింది. అంతవరకు భారత్‌లో ఆయన చిత్రాలు బహిరంగంగా చూసిన వారు లేరు. జర్మనీలో ఈ ప్రదర్శనను ఐన్‌స్టీన్ లాంటి ప్రసిద్ధ సైంటిస్టు సైతం సందర్శించారంటే అవి అక్కడి వారిని ఎంతగా ఆకర్షించాయో అర్థం చేసుకోవచ్చు.

కాని టాగూర్ విభిన్న మీడియంలను అనుసరించారు. ఇంక్ ఆన్ పేపర్, వాటర్ కలర్స్ ఆన్ పేపర్, పేస్టెల్స్ ఇలా రకరకాల మీడియంలను ఆయన చేపట్టారు. ఆయన వినియోగించిన వర్ణాలు సైతం రవివర్మకు భిన్నమైనవే. రవి వర్మ ముదురు రంగులను ప్రధానంగా వాడితే, టాగూర్ లేత వర్ణాలను మాత్రమే వాడారు. రవి వర్మ తన చిత్రాలలో అలంకరణలతో సహా విపులంగా అంశాలను వెల్లడించడానికి ప్రయత్నిస్తే, టాగూర్ వివరాల వ్యక్తీకరణ కన్నా భావాల వ్యక్తీకరణకే ప్రాధాన్యత ఇచ్చారు. రవి వర్మ చిత్రాలు ప్రధానంగా భారతీయ పురాణాలలోని ఘట్టాలను వివరించేవిగా ఉంటాయి. టాగూర్ చిత్రాలలో ఇతివృత్తానికి సంబంధించిన మనోభావాలు వ్యక్తమవుతాయి. ఆయన చిత్రాలలో ఓ విధమైన లయ ఉంటుంది. అది ప్రేక్షకులను కట్టిపడేస్తుంది.

టాగూర్ తన సృజనాత్మక పయనంలో చివరి మజిలీగా చిత్రకళను ఎంచుకున్నప్పటికీ దానికి ఎనలేని ప్రాధాన్యతనిచ్చారు. ఇతర ప్రక్రియల కన్నా చిత్రకళే శాశ్వతమైనదని అభిప్రాయపడ్డారు. ఉదాహరణకు ఒక నవలను తీసుకుంటే దాని ఇతివృత్తానికి సంబంధించిన సమయం, పాత్రల వేషధారణలు, హావభావాలు, దానిలో వినియోగించిన భాష- ఇలాంటివన్నీ దానికి పరిమితులు విధిస్తాయి. సాహిత్యంతో పోల్చుకున్నపుడు సంగీతం ఎక్కువ కాలం నిలుస్తుంది. కాని ఈ రెండింటికన్నా చిత్రకళ అనేది పూర్తి శాశ్వత్వం కలిగిన ప్రక్రియ అని ఆయన ఒక సందర్భంలో పేర్కొన్నారు.

టాగూర్ దాదాపు మూడువేల చిత్రాలను సృష్టించారంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఆ చిత్రాలు దేశ విదేశాలలో ఆయన మిత్రులు, శ్రేయోభిలాషుల వద్ద అనేకం ఉన్నాయి. ఆయనకు పేపర్ దొరికితే దానిమీద అందుబాటులో ఉన్న పెన్నో, పెన్సిలో, క్రేయానో- ఇలా దేనితోనయినా చిత్రాలు గీసేవారు. అందుచేతనే ఆయన చిత్రాలు ఆయన చదివిన పుస్తకాల మడతల్లో సైతం లభించాయి. అలా అవి కొందరికి అనుకోకుండా కూడ చేరిపోయాయి. అలా యధాలాపంగా వేసిన చిత్రాలపై

టాగూర్ సంతకం కూడ ఉండేది కాదు. అందుచేతనే నకిలీ చిత్రాలు కూడా ఆయన పేరుతో చెలామణి అవుతున్నాయని చెబుతున్నారు. పేరున్న ప్రతి చిత్రకారుని విషయంలోనూ ఇలా జరుగుతూనే ఉంటుంది.

చివరిగా ఓ ముఖ్యమైన అంశం- ఒక ఐరోపా చిత్రకారునికి టాగూర్ బహూకరించిన చిత్రాలను లండన్‌కు చెందిన సోదెబి అనే వేలం సంస్థ ఆయన 150వ జయంతి సందర్భంగా అమ్మకానికి పెట్టింది. కాని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, కళ, సంస్కృతుల పట్ల ప్రత్యేక అభిమానం, ఆసక్తి కలిగిన బుద్ధదేవ్ భట్టాచార్య దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. టాగూర్ చిత్రాలు జాతీయ సంపద అనీ, వాటిని అలా అమ్మకానికి పెట్టనివ్వడం అవమానకరం అని, వాటిని భారత దేశానికి రప్పించే ప్రయత్నం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ★

అభిమానమే. వాస్తవాలను వాస్తవాలుగా చూడగలది. సహనశీలి. సనాతన కట్టుబాట్ల పట్ల గోరాలో పెరిగిపోతున్న ఛాందసాన్ని చూసి ఆమె కలత పడ్తుంటుంది. తన పుట్టుక గురించి గోరాకు చెప్పాలని భర్తను ఒత్తిడి చేస్తుంటుంది. భర్త అంగీకరించడు. తనకు చావు దగ్గర పడ్తోందని అనుకొన్నప్పుడు గోరాకు అసలు విషయం చెప్తాడు. అది కూడా తనకు హిందువుకాని గోరా ఎక్కడ కర్మకాండలు చేస్తాడోనని ఆందోళనతోనే.

ఈ నవలలోని మరో ముఖ్యమైన పాత్ర సుచరిత. ఆమె పరేశబాబు అనే రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో పెరుగుతుంటోంది. పరేశబాబు బ్రహ్మ సమాజం సభ్యుడు. ఈ కుటుంబంతో వినయ్‌కు గోరాకు ఏర్పడే స్నేహం వల్ల బ్రహ్మసమాజంపై సనాతనవాదంపై చర్చోపచర్చలు జరుగుతుంటాయి. కొన్నిసార్లు సంబంధాలు దెబ్బతినేంతగా ఆవేశకావేశాలతో చర్చలు సాగుతుంటాయి. పరేశబాబు బ్రహ్మ సామాజికుడు కనుక సుచరితతో పాటు ఆయన ఇంట్లో మహిళలెవరూ ఘోషా పాటించరు. స్వతంత్ర అభిప్రాయాలు కలిగి మగవాళ్ల ముందు స్వేచ్ఛగా చర్చల్లో పాల్గొంటారు. ఛాందస సనాతన సాంప్రదాయాల పట్ల రచయితకు ఎలాంటి సానుభూతీ లేదని మనకు అర్థం అవుతూనే వుంటుంది. హిందూమతంలోని సంకుచిత ధోరణిని టాగూర్ అనేకసార్లు నవలలో ప్రస్తావిస్తారు. అదే సందర్భంలో బ్రహ్మ సమాజం పరిమితులను అతిశయాలనూ రచయిత వదిలిపెట్టలేదు. వాటిపై కూడా విమర్శనాత్మక విశ్లేషణ చేస్తారు. నాటి సమాజంలోని వైరుధ్యాలు దానిని అనుసరించి మనుషుల ఆలోచనల్లో వుండే వైరుధ్యాలు, భిన్నమైన పద్ధతుల్లో స్పందించే మానవస్వభావం, లేనిదాన్ని ఊహించుకొని దాన్ని సాకారం చేసుకోవాలనే వృథాయత్నం. అర్థంలేని ఆధిక్యతా భావం వంటి అనేక అంశాలను విశ్వకవి ఈ నవలలో లోతుగా పరామర్శిస్తారు.

ఆనాటి గ్రామీణ పరిస్థితులను, కింది కులాల బతుకులను కూడా ప్రస్తావించకుండా వదల్లేదు రవీంద్రుడు. గుడ్డిగా పాటించే సాంఘిక ఆచారాలు, శిక్షల రూపంలో, శాఖాభిమానాల రూపంలో విధించే నిషేధాలు, రుణ రూపంలో అల్లిన వలలో పేదలు చిక్కుకు పోవడం, ఆపద సమయంలోనూ, శ్రేయో సమయంలోనూ వారు భుజం భుజం కలిపి నిలబడే అవకాశం లేని స్థితిని రచయిత ప్రస్తావిస్తారు. సంప్రదాయం, ఆచారం అనే ఆయుధంతో మానవుడు మానవుడి రక్తం పీల్చడం, నిర్దాక్షిణ్యంగా దరిద్రంలోకి తోయడం. భారీ ఖర్చుతో దివాళా తీయించే ప్రాయశ్చిత్తాలు, తల్లిదండ్రుల మరణాన్ని మించిన ఆపదను తెచ్చిపెట్టే కర్మకాండల ఖర్చునూ ప్రస్తావిస్తాడు. గ్రామాల్లో పర్యటించినప్పుడు గోరా వీటన్నింటినీ గమనిస్తాడు. కానీ ఆ వాస్తవ స్థితిని అంగీకరించడానికి గోరా మనసు ఒప్పుకోదు. సకల జనులకు శక్తి, జీవం, సౌఖ్యం ఒనగూర్చే మతం ఛాయా రూపంలో కూడా గోరాకు కన్పించలేదని టాగూర్ పేర్కొంటారు.

రాజు సాధారణ ప్రజానీకానికి దూరంగా వుంటాడు. కనుకనే ప్రజలకు రక్షణ కల్పించగలడు. అలాగే బ్రాహ్మణుడు కూడా మెలగాలని తలపోస్తాడు. అప్పుడే బ్రాహ్మణుడు సమాజానికి జీవశక్తినివ్వగలడని భావిస్తాడు. దేవుడికి భక్తుడికి బ్రాహ్మణుడు వంతెనలా వుండాలి తప్ప బ్రాహ్మణుడికి భక్తిభావం అవసరమే లేదనే నిర్ణయానికి వస్తాడు.

సనాతన ధర్మంతో కూడిన భారతదేశాన్ని నిర్మించాలని అర్థంలేని ఆవేశంతో వ్యవహరించే గోరాకు తన జన్మ వృత్తాంతం తెలియడంతో నవల ముగింపు మొదలవుతుంది. నిజం తెలిశాక గోరా స్పందించిన తీరులోనే రవీంద్రుని గొప్పతనం మనకు అర్థం అవుతుంది.

ఛాందసంలో అత్యున్నత స్థాయికి వెళ్లిపోయిన గోరాకు తన తండ్రి ఐర్లాండ్ దేశీయుడని, ఇటావాలో 1857లో జరిగిన సైనిక తిరుగుబాటులో ఆయన చనిపోయాడని తన తల్లి భయంతో కృష్ణదయాల్ గొడ్లచావిట్లో దాక్కొని తనను కని చనిపోయిందని తెలుస్తుంది. అప్పటి దాకా ఏవేవో ఊహించుకున్న గోరాకు కాళ్లకింద నేల జారిపోయినట్లు అన్పిస్తుంది. తనకు జాతి, కులం లేకుండా పోయిందని కుంగిపోతాడు. బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన తనకు వున్న అర్హతలు ఇతరులకు వుండవని భావించే గోరా తల తిరిగిపోతుంది. తాను ఎవరికీ చెందని ఒంటరి వాడినని భావిస్తాడు. అదే సమయంలో ఈ విషయం ఎవరికీ చెప్పనక్కర్లేదని తన కొడుకుగా, హిందువుగా జీవించవచ్చని పెంచిన తండ్రి చెప్పిన మాటను పట్టించుకోడు. తనలోని నిజాయితీ అందుకు ఒప్పుకోదు. తిన్నగా తాను ద్వేషించే బ్రహ్మ సమాజపు సభ్యుడు పరేశబాబు దగ్గరికి వెళ్లి తన విషయం చెప్తాడు. తనకు ఇక బంధనాలేవీ లేవని ప్రకటిస్తాడు. “ఇవాళనుంచి నేను స్వతంత్రుడిని. కులభ్రష్టుడినవుతానని, వెలివేస్తారని నేను భయపడనక్కర్లేదు. నా పవిత్రతను కాపాడుకోవడానికి అడుగడుగుకు నేల చూస్తూ నడవనక్కర్లేదు” అని చెప్తాడు. తాను ఎవరికీ చెందని ఒంటరి వాడినని కుంగిపోయిన గోరా అంతలోనే తాను బంధవిముక్తుడినయినట్లు భావిస్తాడు. ఈ విషయాలు పరేశబాబుతో చెప్తున్నప్పుడు గోరా మొహం వెలిగిపోతుంటుంది.

పరేశబాబుతో గోరా ఇంకా ఇంకా చెప్తాడు. “పరేశబాబూ నా జీవిత సమస్తంలో భారతదేశాన్ని గుర్తించాలని యత్నించినప్పుడు అడుగడుగునా నాకు ఆటంకాలు కలిగాయి. ఆ ఆటంకాలను ఆరాధించాలని రాత్రింబవళ్లు యత్నించాను. ఆ కారణం చేత యదార్థ భారతదేశాన్ని ముఖాముఖిగా చూసినప్పుడు భయంతో వెనుదిరిగాను. అచంచల, అవిమర్శనా పూర్వక ఆలోచనలతో భారతదేశాన్ని రూపొందించుకొని, దానిని అజేయమయిన కోటలో భద్రపరచాలని ఇంతకాలంగా నా చుట్టూ వున్న ప్రతిదానితోనూ పోరాడాను. ఈ రోజు ఒక్క క్షణంలో నేను నిర్మించుకొన్నది కలలాగా మాయమైపోయింది. నాకు సంపూర్ణ స్వాతంత్ర్యం లభించింది. యదార్థ శ్రామిక రంగం నా ముందు విస్తరించుకొంది. అది నా భావనా శక్తితో నిర్మించుకున్నది కాదు. ముప్పయి కోట్ల భారత మాత సంతాన సంక్షేమ యదార్థ రంగం”

“నేను అహోరాత్రులు దేనికోసం తహతహ లాడిపోతున్నానో అది ఇవాళ సిద్ధించింది. ఈ రోజున నేను నిజంగా భారతీయుడిని. నాలో హిందూ, ముస్లిం, క్రైస్తవ విభేదం లేదు. ఇవాళ భారతదేశంలోని ప్రతి కులం నా కులమే. అందరి ఆహారం నా ఆహారమే. నేను ఇప్పటిదాకా అందరి సరసన కూర్చోలేకపోయాను. అగోచరమైన ఈ విభేదాన్ని దాటలేకపోయాను. నేను ప్రాణంకంటే భారతదేశాన్ని ఎక్కువగా ప్రేమిస్తున్నాను. కనుక నేను తెలుసుకోవాల్సిన భాగాన్ని విమర్శిస్తే సహించలేకపోయేవాడిని. అటువంటి నిరుపయోగమైన అలంకారాలను సృజించాలనే నిరర్థక ప్రయత్నాలనుంచి ఇప్పుడు విముక్తి పొందాను. అల్పకులాల వారి ఇంట్లో భోజనం చేసినా అపవిత్రుడిని కానంత పవిత్రుడినయ్యాను” అని అంటారు.

అక్కడినుంచి పెంపుడుతల్లి ఆనందమయి దగ్గరకు వెళ్తాడు. ఆమె ఎదురుగా కూర్చుని పాదాల మీద తల వాల్చుతాడు. పని మనిషి లక్ష్మిని కేకేసి దాహం వేస్తోంది మంచినీళ్లు తెమ్మని అడుగుతాడు. గోరాలో వచ్చిన మార్పును ఆమె వెంటనే అంచనా వేస్తుంది. బ్రహ్మసమాజ కుటుంబానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకున్నందుకు గాను దూరంగా పెట్టిన అతని ప్రాణ మిత్రుడు వినయ్‌ను పిలిపించనా అని ఆమె గోరాను అడగడంతో నవల ముగుస్తుంది.

‘గోరా కథ’ వింటుంటే తెలుగు సినిమా ‘వంశవృక్షం’ గుర్తుకొస్తుంది కదూ. మొదట ఈ సినిమాను కన్నడంలో నిర్మించారు. ఎస్. ఎల్. భైరప్ప 1965లో రాసిన ‘వంశవృక్ష’ అన్న నవల ఆధారంగా ఆ సినిమాను నిర్మించారు. అలాంటి ఎన్నో రచనలకు ‘గోరా’ ప్రేరణ. రవీంద్రుడి రచనల గురించి శరత్ చెప్పింది ఎంత కరెక్టో దీన్నిబట్టి తెలుస్తోంది. రవీంద్రుని రచనల్లో గోరాను ఉత్కృష్టమైనదిగా భావిస్తారు. 1992 నాటికే పన్నెండు భారతీయ భాషల్లోకి అనువదించబడిన ఈ నవలను బాబ్రీమసీదు కూల్చివేత అనంతరం దేశంలో ఏర్పడిన మత ఉద్రిక్తతలను దృష్టిలో పెట్టుకుని 21 భారతీయ భాషల్లోకి అనువదించాలని కేంద్ర సాహిత్య అకాడమి నిర్ణయించింది.

★

జాతి గీతిక దేశ ప్రతీక

- కె.సాహిల్

సువిశాల భారతదేశంలో ఆ గీతం గురించి తెలియనివారుండరు. ప్రతిరోజూ దాన్ని ఆలపించకుండా బాల్యం గడవనే గడవదు. పైగా పాడుతుంటే ఏదో తెలియని దేశభక్తి, ఉత్తేజం, ఉత్సాహం మన మనసుల్లోకి జొరబడుతుంది. అదే మన జాతీయగీతం 'జనగణమన'.

భిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు, రాష్ట్రాలు వున్న ఇంత పెద్ద దేశంలో ఒక పాటను జాతీయగీతంగా ఎంపిక చేసుకోవడం చిన్న విషయం కాదు. ఆ గేయంలో ఎంతో సువిశాలభావం, సౌభ్రాతృత్వం, సామరస్యం వుంటేనే సాధ్యమౌతుంది. అవన్నీ అక్షరాక్షరాన నింపుకుంది కాబట్టే బెంగాలీ కవి రవీంద్రనాథ్ టాగూర్ కలం నుంచి జాలువారిన 'జనగణమన'కు ఆ అపురూప గౌరవం లభించింది. జాతి యావత్తు సగర్వంగా చెప్పకునే జాతీయగీతం... గురించిన పలు ఆసక్తికర అంశాలు .....

జన గణమన అధినాయక జయహే
భారత భాగ్యవిధాతా
పంజాబ సింధు గుజరాత మరాఠా
ద్రావిడ ఉత్కళ వంగ
వింధ్య హిమాచల యమునా గంగా
ఉచ్ఛల జలధితరంగ
తవ శుభ నామే జాగే తవ శుభ ఆశిషమాగే
గాహే తవ జయ గాథా
జనగణ మంగళ దాయక జయహే
భారత భాగ్య విధాతా
జయహే! జయహే! జయహే!
జయ జయ జయ జయహే!

బెంగాల్ భాషలోని పద్య రూపంలో వున్న జాతీయ గీతానికి అర్థం తెలుసుకుందామా!

జనులందరి మనస్సులకూ అధినేతవు. భారత భాగ్య విధాతవు అయిన నీకు జయమగుగాక. పంజాబు, సింధూ, గుజరాత్, మహారాష్ట్ర, ద్రావిడ, ఉత్కళ, వంగ దేశాలతోనూ, వింధ్య హిమాలయ పర్వతాలతోను, యమునా గంగ ప్రవాహాలతోనూ, ఉవ్వెత్తుగా లేచే సముద్ర తరంగాలతోనూ శోభించే ఓ భారతభాగ్య విధాతా! వాటికి నీ శుభనామం ఉద్వేగం కలిగిస్తుంది. అవి నీ ఆశీస్సులు అర్థిస్తాయి. నీ జయగాథల్ని గానం చేస్తాయి. సమస్త జనులకూ మంగళ ప్రదాతవు, భారతభాగ్య విధాతవు అయిన నీకు జయమగుగాక! జయమగుగాక! జయమగుగాక!

అసలు ఈ గేయాన్ని చదువుతుంటేనే ఏదో తెలీని పారవశ్యం మనల్ని ఆవహిస్తుంది. అదే జాతీయగీతంలో వున్న ప్రత్యేకత. దీన్ని రవీంద్రుడు బెంగాలీ భాషలో రచించాడు. దీన్ని భారత రాజ్యాంగ పరిషత్తు 1950 జనవరి 24వ తేదీన ఆమోదించింది. దీనిని ప్రప్రథమంగా 1911 డిసెంబర్ 27వ తేదీన కలకత్తాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో ఆలపించారు. పూర్తి జాతీయగీతాన్ని ఆలపించడానికి 52 సెకండ్లు పడుతుంది. కొన్ని సందర్భాలలో జాతీయ గీతం మొదటి, చివరి పంక్తులను మాత్రమే పాడతారు. సంక్షిప్త రూపంలో గానం చేయడానికి 20 సెకన్లు పడుతుంది.అయితే మనదేశంలో భిన్న భాషల్లో ఆలపించడం వల్ల ఉచ్ఛరణలో తేడాలు కనిపిస్తుంటాయి.

అనువాదం, ఆలాపన అక్కడే...

రవీంద్రుడు 'జనగణమన' గేయానికి స్వరాలు కూర్చింది మన రాష్ట్రంలోనే. అదీ చిత్తూరుజిల్లా మదనపల్లిలోనే అని తెల్సా! అదెలా జరిగిందో చూద్దాం.

పశ్చిమ చిత్తూరులోని పురాతన, చిన్ని పట్టణం మదనపల్లి. సరిగ్గా తొంభయ్యేళ్ల క్రితం



1919లో తన స్నేహితుడు, ఐరిష్ కవి, అనిబిసెంట్ థియోసాఫికల్ కాలేజ్ (బి.టి కళాశాల) ప్రిన్సిపాల్ జేమ్స్ కుషన్స్ నుంచి టాగూర్‌కు ఆహ్వానం అందింది. ఆ ఆహ్వానం మేరకు ఆయన మదనపల్లిలోని బి.టి.కాలేజ్‌కు విచ్చేశారు. అక్కడే కొద్ది రోజులు గడిపారు కూడా. అప్పుడు కుషన్ విజ్ఞప్తి మేరకు జనగణమన గేయాన్ని ఆలపించారు టాగూర్. అక్కడి విద్యార్థులు కూడా గొంతు కలపడంతో ఆ పరిసరాలలో గీతం ప్రతిధ్వనించింది. ఆ సందర్భంగానే ఆ గీతాన్ని ఆంగ్లంలోకి అనువదించాడు టాగూర్. అదే మన జాతీయగీతంగా గుర్తింపు పొందింది. టాగూర్ మన మధ్య లేకపోయినా మదనపల్లిలో ఆయన జ్ఞాపకాలు ఇప్పటికీ వున్నాయి. బి.టి కళాశాల గ్రంథాలయం గోడలకు టాగూర్ స్వదస్తూరీతో వున్న జాతీయగీతం ఆంగ్ల పాఠం వేళ్లాడుతూ పలుకరిస్తుంది. అయితే రవీంద్రుడు బసచేసిన కుటీరం మాత్రం పెచ్చులూడిపోయి శిథిలావస్థకు చేరుకోవడం మాత్రం బాధగా అనిపిస్తుంది.

వివాదం

మనం జాతీయ గీతంగా స్వీకరించిన 'జనగణమన'ను రవీంద్రుడు ఇంగ్లండ్ రాజు (ఐదవ జార్జి), రాణి మన దేశం వచ్చినప్పుడు వారిని శ్లాఘిస్తూ రాశాడని వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తుంటారు. జాతీయగీతంలోని 'అధినాయక' మరెవరో కాదని ఐదవ జార్జి అని అంటుంటారు. మనం భావిస్తున్నట్టు ఇది మాతృభూమిని శ్లాఘిస్తూ రచించినది కాదని కూడా అంటారు. ముఖ్యంగా ఆర్‌ఎస్‌ఎస్ వారు 'వందేమాతరం'ను బలపరుస్తూ 'జనగణమన'పై దాడి చేస్తుంటారు. రాజ్యాంగ పరిషత్తు రెంటినీ పరిశీలించి బాగా లోతుగా చర్చించి చివరికి దీన్ని ఎంపిక చేసింది. 'వందేమాతరం'లో కొన్ని భాగాలు మతతత్వ పూరితంగా వుండడమే ఇందుకు కారణం. ఇక 2005లో అయితే ఈ విషయమై ఏకంగా కోర్టులో కేసే నడిచింది. గేయంలోని 'సింధ్' ని తీసేసి 'కాశ్మీర్' చేర్చాలన్నారు.

ఎందుకంటే సింధ్ ప్రాంతం భారతదేశంలో భాగంగా ఎక్కువకాలం లేదు. 1947లో దేశ విభజన జరిగినప్పుడు అది పాక్‌లో భాగమైంది.



చిత్రకారునిగా రవీంద్రుడు

టాగూర్ తన సృజనాత్మక పయనంలో చివరి మజిలీగా చిత్రకళను ఎంచుకున్నప్పటికీ దానికి ఎనలేని ప్రాధాన్యతనిచ్చారు. ఇతర ప్రక్రియల కన్నా చిత్రకళే శాశ్వతమైనదని అభిప్రాయపడ్డారు. ఉదాహరణకు ఒక నవలను తీసుకుంటే దాని ఇతివృత్తానికి సంబంధించిన సమయం, పాత్రల వేషధారణలు, హావభావాలు, దానిలో వినియోగించిన భాష- ఇలాంటివన్నీ దానికి పరిమితులు విధిస్తాయి. సాహిత్యంతో పోల్చుకున్నపుడు సంగీతం ఎక్కువ కాలం నిలుస్తుంది. కాని ఈ రెండింటికన్నా చిత్రకళ అనేది పూర్తి శాశ్వత్వం కలిగిన ప్రక్రియ అని ఆయన ఒక సందర్భంలో పేర్కొన్నారు.

-గుడిపూడి విజయరావు



రవీంద్రనాథ్ టాగూర్ బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన కవి, నవలా రచయిత, నాటకకర్త, సంగీతకారుడు, జాతీయ వాది. అంతే కాదు ఆయనలో చాలామందికి అంతగా తెలియని మరో పార్శ్వం ఉంది. అదే ఆయనలోని చిత్రకారుడు. చిత్రకారునిగా తన కృషిని చాలా లేటు వయసులో అరవైఏడో ఏట ఆయన ప్రారంభించారు. అయితే ఆయన ఏదో ఉబుసుపోక చిత్రాలు వేయలేదు. ఆ వయసులో ఆ రంగంలోకి ప్రవేశించినా భారతీయ ఆధునిక చిత్రకళకు ఆద్యులలో ఒకరిగా ఆయన పేరుగాంచారు. చిత్రకళతో ప్రత్యక్ష పరిచయం, ప్రమేయం లేకపోయినప్పటికీ ఆయన సాంస్కృతిక రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించిన వ్యక్తి కావడంతో అదే ఆయన చిత్రకళలో సాధించిన విజయాలకు ప్రాతిపదికగా పనిచేసింది. నేరుగా పరిచయం లేకపోయిన మాట వాస్తవమే అయినప్పటికీ ఆయన కుటుంబంలోనే పేరుగాంచిన చిత్రకారులున్నారు. ఆయన పెద్ద సోదరుడు జ్యోతిరారింద్ర టాగూర్ మంచి చిత్రకారుడు. అలాగే అబనీంద్రనాథ్ టాగూర్ కూడా. విదేశాలలో పర్యటించిన సమయాల్లో ఆయా దేశాల చిత్రకళను ఆయన అధ్యయనం చేసేవారు. ఇది కూడా చిత్రకళలో సొంతంగా తన శైలిని రూపొందించుకోవడానికి దోహదపడింది. నిజానికి ఏ సృజనాత్మక కళలో ప్రావీణ్యం సంపాదించిన వారైనా సౌందర్య దృష్టి వారిలో పుష్కలంగా ఉంటుంది. అది టాగూర్‌లో మరింత అధికం. ఉదాహరణకు ఆయన కవిత్వం రాసే సమయంలో పేజీలపై ఆయన తన కొట్టివేతలను సైతం ఒక అందమైన కళారూపాలుగా మలిచారు. ఆ తర్వాత అలాంటి పేజీలను పూర్తిస్థాయి చిత్రకళాఖండాలుగా పరిగణించి ప్రదర్శనకు సైతం ఉంచారు.

భారతీయ ఆధునిక చిత్రకళకు ఆద్యుడు రాజా రవి వర్మ అని అందరికీ తెలుసు. ఆయన ఐరోపా చిత్రకళారీతులను భారతీయ చిత్రకళలో ప్రవేశపెట్టాడు. అయితే ఆయన వారి పద్ధతులను మక్కీకి మక్కీ అనుకరించాడన్న విమర్శలను సైతం ఎదుర్కొన్నాడు. రవి వర్మ చిత్రాలు భారతీయ జీవనానికి సంబంధించినవే అయినప్పటికీ వాటి రూపాలు, శరీర సౌష్టవం ఐరోపా వాసులను తలపిస్తాయని విమర్శకుల అభిప్రాయం (దీనినే ఎకడమిక్ రియలిజం అంటారు). ఇలాంటి విమర్శలను అంగీకరించే వారు భారతీయ ఆధునిక చిత్రకళ భారతీయ మూలాల నుండే అవిర్భవించాలని చెబుతారు. అలాంటి అభిప్రాయాలతోనే బెంగాల్‌లో ఆధునిక చిత్రకళా ధోరణి అభివృద్ధి చెందింది.

రవీంద్రనాథ్ టాగూర్ మాత్రం ఆధునిక చిత్రకళకు భారతీయత పునాదిగా ఉండాలని చెబుతూనే, ఐరోపా చిత్రకళారీతుల నుండి మంచి అంశాలను స్వీకరించాలని చెప్పేవారు. అలాంటి అభిప్రాయంతోనే ఆయన తన చిత్రకళా ప్రస్థానాన్ని ఆరంభించారు. ఆయన చిత్రాలు ఆధునికత, భారతీయతల మేలికలయికగా గుర్తింపు పొందాయి. ఆయన చిత్రాలు ఇటు భారతీయులను, అటు ఐరోపావాసులను సైతం ఆకట్టుకోగలిగాయి. దేశ విదేశాల్లో ఆయన చిత్రకళా ప్రదర్శనలు జరిగాయి. 1930 మేలో పారిస్‌లో టాగూర్ చిత్రకళా ప్రదర్శన జరిగింది. ఇదే ఆయన తొలి ప్రదర్శన. ఆ ప్రదర్శనను ప్రారంభించిన ఫ్రెంచి రాజవంశానికి చెందిన అన్నా డె నోయిలెస్ 'ఈ చిత్రాలను చూస్తుంటే స్వప్న జగత్తు సోపానాలను అధిరోహిస్తున్నట్లుగా ఉంది' అని వ్యాఖ్యానించారు. తర్వాత ఈ చిత్ర ప్రదర్శన ఇంగ్లాండ్, డెన్మార్క్, స్వీడన్, రోమ్, జర్మనీ, రష్యాలలో, చివరిగా చిత్రకారుని స్వస్థలం కోల్‌కతాలో కూడా నిర్వహించబడింది. అంతవరకు భారత్‌లో ఆయన చిత్రాలు బహిరంగంగా చూసిన వారు లేరు. జర్మనీలో ఈ ప్రదర్శనను ఐన్‌స్టీన్ లాంటి ప్రసిద్ధ సైంటిస్టు సైతం సందర్శించారంటే అవి అక్కడి వారిని ఎంతగా ఆకర్షించాయో అర్థం చేసుకోవచ్చు.

రవివర్మ ఐరోపా చిత్రకారులను అనుకరిస్తూ కేవలం ఆయిల్ ఆన్ కేన్వాస్ మీడియంను మాత్రమే వినియోగించారు.

జాతీయ గీతం అంటే...

ఒక దేశం (జాతి) యొక్క ప్రాధాన్యతకు సంగీతాన్ని అద్ది జాతికి అందించేదే జాతీయగీతం. ఇది ఆ దేశ చరిత్ర, సంప్రదాయాలు, ప్రజాపోరాట స్ఫూర్తితో నిండివుంటుంది. కొన్ని దేశాలు దీనికి సంగీతస్వరాలను అధికారికంగా సమకూర్చుకుంటే మరికొన్ని అనధికారికంగా ఏర్పాటుచేసుకుంటాయి. కొన్ని దేశాలకైతే ఒకటికంటేఎక్కువ జాతీయగీతాలున్నాయి.



అమర్ సోనార్ బంగ్లా

బంగ్లాదేశ్ జాతీయగీతమిది. దీన్ని 1906వ సంవత్సరంలో రవీంద్రనాథ్ టాగూర్ రచించి స్వరపరిచారు. అయితే జాతీయ గీతంగా బంగ్లాదేశ్ (అవతరించిన కొద్దికాలానికి) దాన్ని 1972లో స్వీకరించింది. 'సోనార్' అంటే 'బంగారంతో చేసిన' అని అర్థం. బెంగాల్ విభజన సందర్భంగా టాగూర్ ఈ గేయాన్ని రచించాడు. దీన్ని ఆంగ్లంలోకి అనువదించింది మాత్రం సయ్యద్ అలి అసన్.

కాబట్టి ఆ పదం తీయాలన్నారు. అయితే సువిశాల సంస్కృతిలో భాగమైన సింధూ నాగరికతకు మన దేశంలో ఎంతో ప్రాధాన్యత వుంది. దాని ప్రతిరూపమే సింధు. కాబట్టి దాన్ని తీసేయాల్సిన ఆవశ్యకత మాత్రం లేదని కొందరు వాదించారు. మార్పు చేయనక్కర్లేదని కొత్త పదాలు తగిలించనవసరం లేదని సుప్రీంకోర్టు చెప్పాకే వివాదం సద్దుమణిగింది. అయితే రవీంద్రుడు ఆ కాలంలోనే తన రచనల ద్వారా సామ్రాజ్యవాదాన్ని, ఫాసిజాన్ని తిరస్కరించాడు. రష్యాను సమర్థించాడు. జలియన్‌వాలాబాగ్ మారణహోమం తర్వాత బ్రిటీష్ వారిచ్చిన 'సర్' బిరుదును సైతం తిరస్కరించాడు.

ఆయన రచించిన రెండు పాటలు (జనగణమన, అమర్ సోనార్ బంగ్లా) రెండు దేశాలకు (భారత్, బంగ్లాదేశ్) జాతీయ గీతాలుగా ఎంపిక కావడం మరెవరికీ దక్కని అపురూప గౌరవం. పైగా ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతి (సాహిత్యంలో) అందుకున్న తొట్ట తొలి భారతీయుడు కూడా రవీంద్రుడే కావడం మనకు గర్వకారణం. ★

పుస్తకం పేరు	అనువాదం
1. గోరా (నవల)	శ్రీనివాస చక్రవర్తి (1982)
2. ఆదర్శప్రేమ (కథలు)	ఎం.వెంకటేశ్వరరావు, ఎం. నరసింహారావు, కె.వి.సుందర్ (1961)
3. త్యాగఫలం (నవల)	కమలాసనుడు (1961)
4. రవీంద్ర కథావళి (కథలు)	...............(1964)
5. రవీంద్ర నాటకావళి	బెల్లంకొండ రామదాసు (1961)
6. చిరకుమారసభ (నవల)	కె. రమేష్ (1964)
7. పడవమునక (నవల)	కమలాసనుడు (1983)
8. చోఖేర్‌బాలి (నవల)	దండమూడి మహీధర్ (1982)
9. ఇంటాబయట (నవల)	కమలాసనుడు (1976)
10. రాజర్షి (నవల)	కె.రమేష్ (1993)
11. అతడు (నవల)	కె.రమేష్ (1993)
12. పంచభూతాలు (నవల)	శ్రీనివాస చక్రవర్తి (1993)
13. జల్‌జలా (నవల)	మైత్రేయ (1993)
14. రాగీఘాట్ (నవల)	శ్రీవిరించి (1993)
15. చతురంగ (నవల)	మైత్రేయ (1993)
16. నా జీవిత స్మృతులు	శ్రీనివాస చక్రవర్తి (1987)
17. శేషకవిత (నవల)	శ్రీనివాస చక్రవర్తి (1987)
18. చివరిమాట (నవల)	మైత్రేయ (1987)
19. నా జన్మభూమి (జ్ఞాపకాలు)	ఖండవల్లి సాంబశివరావు (1987)
20. చారులత (నవల)	శ్రీనివాస చక్రవర్తి (1987)
21. అక్కా చెల్లెలు (నవల)	శ్రీనివాస చక్రవర్తి (1987)
22. లేబరేటరీ (నవల)	డి.మంజులత (1987)
23. గీతాంజలి (కవిత)	బెల్లంకొండ రామదాసు (1995)
24. అరూపరత్నం (అరూపరత్నం)	శ్రీనివాస చక్రవర్తి (1961)
25. నందిని (నాటకం)	శ్రీనివాస చక్రవర్తి (1961)
26. పసిపాపల దరహాసం (కవిత)	పోలివరపు శ్రీనివాసరావు ,విరించి (1961)
27. రవీంద్ర దర్శనం (రవీంద్రుని రచనలపై వ్యాసాలు)	వివిధ రచయితలు (1987)
28. ముక్త ధార (నాటకం)	శ్రీనివాస చక్రవర్తి (1961)
29. ఉత్తమ ఇల్లాలు (కథలు)	మోటూరి వెంకటేశ్వరరావు(1964)
30. కిరణ్మయి (కవిత)	అమర సుందర్ (1964)
31. నటీర్ పూజ (నాటకం)	స్వర్ణరాజ హనుమంతరావు(1965)
32. తరణి (కవిత)	ఖండవిల్లి సాంబశివరావు (1964)
33. మాలిని (నాటకం)	బెల్లంకొండ రామదాసు (1962)
34. మూడు నాటికలు (నాటకం)	రెంటాల గోపాల కృష్ణ (1966)
35. రవికిరణాలు (కవిత)	స్వర్ణరాజ హనుమంతరావు ఖండవిల్లి సాంబశివరావు (1961)
36. పోస్టాఫీసు (పిల్లల కథలు)	శ్రీనివాస చక్రవర్తి (1961)
37. రాజు-రాణి (నాటకం)	బెల్లంకొండ రామదాసు (1961)
38. వరమాల	కె.రమేష్ (1967)
39. బలిదానం (నాటకం)	బెల్లంకొండ రమేష్ (1961)
40. నదీతీరం (పిల్లల కథలు)	అమరసుందర్ (1961)
41. త్యాగమూర్తి (పిల్లల కథలు)	అమరసుందర్ (1957)
42. శుభదృష్టి (పిల్లల కథలు)	మోటూరి వెంకటేశ్వరరావు (1990)
43. కాబూలీవాలా (పిల్లల కథలు)	డి.వెంకటేశ్వరరావు (1990)
44. చంద్రవంక (పిల్లల కథలు)	అమరసుందర్ (1990)
45. నీలకాంత్	అమరసుందర్ (1990)
46. ఆకలిరాళ్లు (పిల్లల కథలు)	అమరసుందర్ (1990)
47. చిత్ర	బెల్లంకొండ రా[illegible]
48. నదీతీరం-బంగరుపడవ (పిల్లల కథలు).................... (1993)	
49. నీలకాంత్-ఆకలిరాళ్లు (పిల్లల కథలు) .... (1993)	

★

పోరాడి రవీంద్రుని సాధించుకున్నాం

రవీంద్రనాథ్ టాగూర్ మా అస్థిత్వానికే చిరునామా. సాహసం, సంయమనానికి భావకుడు. అలాగే ఆయనను చూసి మేం గర్విస్తాం. పాకిస్తానీ దుష్ట పాలనకు వ్యతిరేకంగా పోరాడి కవి గురువును మా నెత్తిన పెట్టుకున్నాం. పాకిస్తానీ పాలకులు-ముస్లింలీగ్ అయినా, సైనికపరిపాలన అయినా, వారు కన్నెర్రజేసినా లెక్కచేయకుండా మేము రవీంద్రనాథ్ టాగూర్‌ను భావకుడిగా అట్టి పెట్టుకున్నాం. వారాయనను అప్పటి తూర్పు బెంగాల్ / తూర్పు పాకిస్తాన్ నుండి పూర్తిగా చెరిపివేయాలని భావించారు. కానీ తూర్పు బెంగాల్ సాధారణ ప్రజానీకం సాయంతో ఆ కుయుక్తులను తిప్పికొట్టాం. రవీంద్రనాథ్ టాగూర్ రాసిన బెంగాల్ విభజన వ్యతిరేక కవిత "ఆమార్ సోనార్ బాంగ్లా, ఆమి తోమాయ్ భాలోబాసి, (నా బంగారు బెంగాల్, నేను నిన్ను ప్రేమిస్తాను)" నేడు మా జాతీయ గీతం.

కామాల్ లోహాని (బంగ్లాదేశ్ రచయిత)

ఆంధ్రానువాదం: **వేదుల రామకృష్ణ**

ఏ రవీంద్రనాథుడినైతే సమూలంగా పెరికివేయాలని పాకిస్తానీ పాలకులు భావించారో ఆ రవీంద్రనాథుడే నేడు ప్రతిరోజు ఉదయం పాట అయినాడు. అందరూ ఒకే పాట పాడుతున్నారు. పిల్లలు, కిషోరులు, యువకులు, వృద్ధులు, పాఠశాలల్లో, ఇతర ప్రదేశాల్లో ఎరుపు-ఆకుపచ్చ పతాకం ఎగురవేస్తున్నారు. ఈ పతాకాన్ని మేము 1971లో ముక్తియుద్ధం ద్వారా ఎంతో రక్తాన్ని చిందించి, లక్షలాది అమర వీరుల ప్రాణాలు అర్పించి సాధించుకున్నాం.

నిరంకుశ పాలకవర్గ భూస్వామ్య, వలసవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటంలో రవీంద్రనాథ్ మాకు అండగా నిలిచారు. ఆ పోరాటంలో మేము పాడింది "మోదేర్ గౌరబ్ మోదేర్ ఆశా, ఆమోరి బంగ్లాభాషా (మా గర్వం, మా ఆశ, మా యొక్క బంగ్లాభాషా)". ఈ పాటతోనే బెంగాలీని అధికార భాషగా స్వీకరించాలనే డిమాండ్ మొట్టమొదట పెల్లుబికింది. అది కూడా కొత్తగా పాకిస్తాన్ ఏర్పడిన కొద్ది నెలల లోపలే. ఆ ఉద్యమంలో 1952లో బరకత్, సలాం, రఫీక్, జబ్బార్ ప్రాణాలర్పించి బెంగాలీని అధికార భాషగా ప్రతిష్ఠింపజేశారు.

ముస్లింలీగ్ పాలనకు వ్యతిరేకంగా ప్రజాఉద్యమాన్ని నిర్మించడంలో రవీంద్రనాథ్ మాకు బాగా కలిసివచ్చారు. మత కలహాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కవిగురువు మాతో ఉన్నారు. పాకిస్తాన్‌లో సైనికపాలన ఉన్న సమయంలో 1961లో ఆయన శతజయంతి వచ్చింది. జనరల్ ఆయూబ్‌ఖాన్ శతజయంతి ఉత్సావాలు జరపనివ్వదలచుకోలేదు. కాని రవీంద్రనాథ్ టాగూర్ మా సాహిత్య సాంస్కృతిక అస్థిత్వం, రాజకీయ పోరాట సహయోధుడు. ఆయన శతజయంతి ఉత్సవం జరపనివ్వాలసిందేనని పట్టుబట్టడంతో సైనిక పాలకులు అడ్డుచెప్పలేకపోయారు. 1967 సంవత్సరం మధ్యలో జాతీయపరిషత్‌లో అప్పటి సమాచార శాఖమంత్రి ఖాజాసహాబుద్దీన్ కటువుగా ఇలా అన్నారు. "రవీంద్రనాథ్ ఎప్పుడు కూడా మా సంస్కృతీ, సాహిత్యంలో భాగంగా లేరు". ఈ వార్త రాగానే పెద్దఎత్తున తూర్పుబెంగాల్‌లో నిరసన బయలుదేరింది. మార్క్సిస్టు సంస్కృతీ సంస్థ "క్రాంతి, శిల్పి, గోష్ఠి" నిరసన నిర్వహించింది. నిరసనలో భాగంగా పెద్ద ఎత్తున రవీంద్రనాథ్‌కు సంబంధించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాకిస్తానీ పాలకులు ఈ వెల్లువ చూసి ఇంకా రెచ్చిపోయారు. ఇటువంటి సభలు, కార్యక్రమాలపై అదను చూసి దాడిచేసే కుట్రలు కూడా పన్నారు. కాని యువత ముఖ్యంగా విద్యార్థులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండటం వలన వాళ్ళ పాచికలు పారలేదు. ఆ విధంగా ఆ రోజు మేము పోరాడి రవీంద్రనాథ్‌ని సాధించుకున్నాము.

రవీంద్రనాథ్ పుట్టి 150 ఏళ్ళు అవుతున్న సందర్భంలో బంగ్లాదేశ్‌లో కూడా మేము ఉత్సావాలు, కార్యక్రమాలు పెద్ద ఎత్తున దేశమంతటా జరుపుకుని ఆ కవీంద్రుడి, విశ్వకవీంద్రుడి పట్ల మా ప్రేమానురాగాలు చాటుకుంటాం, మా భక్తి శ్రద్ధలు ఆ మహత్తర వ్యక్తిత్వానికి నివేదించుకుంటాం.

రవీంద్రుడి సాహిత్యంలో బాలుడు

సాహిత్యంలో రవీంద్రనాథ్‌కి సాటిలేనప్పటికి పిల్లల ప్రపంచంలో మాత్రం అతనికి సాటి లేకపోలేదు. అయినా ఆయన రవీంద్రనాథ్ టాగూర్. సమాజం గురించి ఆలోచించే విషయంలో ఆయనది అగ్రగణ్య వ్యక్తిత్వం. పిల్లల సాహిత్యం విషయంలో ఆయన ఆలోచనలు వేరు. అందరి కంటే భిన్నం. స్వాతంత్ర్యంతో కూడినది. తన చిన్నతనం నుండి తమ శాంతినికేతన్‌లో విద్యార్థి, విద్యార్థినుల నుండి చిన్న పిల్లల మనస్సును ఆవిష్కరించారు. రవీంద్రుడికి తెలుసు, పిల్లవాడి ఊహ అనేది ఏ తర్కానికి, వాదానికి లోబడి ఉండదు. అందుకే పిల్లవాడు సంపంగి చెట్టు సంపంగి అవ్వాలని అనుకుంటాడు. బందిపోటుతో యుద్ధం చేయాలని అనుకుంటాడు, తల్లిని రక్షిస్తాడు. రవీంద్రనాథ్ తల్లి ప్రేమను అంతగా పొందలేదు. చిన్నతనంలోనే తల్లి పోయింది. రవీంద్రుడి పిల్లలు కూడా తల్లి అకాల మృత్యువు వలన తల్లి ప్రేమకు చాలా దూరమైనారు. అందుకే రవీంద్రనాథుని బాలుడు కథంతా తల్లి చుట్టూతే తిరుగుతుంటుంది. తల్లిని కేంద్రీకరించే వాడి ఊహ రథం ఆకాశాన, చెట్లమ్మటా, గాలిలోకి పరుగులు తీస్తుంది. కావలసిన వాళ్ళ మృత్యువు రవీంద్రనాథుని జీవితంలో పదేపదే ఎదురైంది. ముఖ్యంగా పిల్లల మరణం. ఆయనకి అందరికంటే ఇష్టమైన, వల్లమాలిన ప్రేమ ఉన్న శామింద్రుడి మృత్యువు ఆయనను తీవ్రంగా కుదిపివేసింది, బాధాంధకారంలోకి నెట్టివేసింది. రవీంద్రనాథుడు ఎంత తాత్వికుడైనా, త్రికాలజ్ఞుడైనా "దుఃఖం ఉంది, మృత్యువు ఉంది – అయినా ఆనందం మేల్కొంటుంది" అని ఉచ్చరించినవాడైనా వేదన తప్పలేదు. ఆయన కూడా మనలాగే మనిషి. ఆనంద- విషాదాల, భావోద్వేగాల, గుణాల- నిర్గుణాల ఒక మనిషి. బ్రహ్మాండం అంతా నిండిన ఒక వ్యక్తి, ఆయన ఉన్నతమైన మనస్సు ద్వారా మనలని ఆవహించిన వ్యక్తి. కాని పిల్లల విషయంలో? మళ్ళీ మళ్ళీ సంతానం కోల్పోయిన తల్లికి బాలుడు పువ్వు అయి మరలా తిరిగి వస్తాడని చెబుతాడు. ఇది పిల్లల కోసం రాసిన రాత అయితే కాదు. సంతానం కోల్పోయిన ఒక తల్లి బాధకి ఉపశమనం. రవీంద్రనాథ్ బాలసాహిత్యం పరిమితి ఇక్కడే ఉన్నది. ఈ పరిమితి కారణంగానే రవీంద్రనాథ్ పిల్లల మనస్సు గురించి ఆలోచించడం వేరుగా ఉంటుంది. ఆయన బాలుడిని "పసివాడుగా చూడలేదు" పెద్దవాళ్ళ ఆలోచన, మననం యొక్క బీజాలు ఆయన బాలుడి మనస్సులో దాగి ఉంటాయి. బెంగాలీ బాల సాహిత్యంలో ఈ పరిపక్వత కొరకు మనం రవీంద్రనాథ్‌కి మనం రుణపడి ఉన్నాం.

మన శాంతినికేతన్



- జైదీప్ సర్కార్

రవీంద్రనాథ్ పుట్టి 150 ఏళ్లు అవుతున్న సందర్భంగా... ప్రత్యామ్నాయ విద్యావిధానాన్ని ప్రపంచానికి చాటిచెప్పడానికి ఆయన స్థాపించిన 'శాంతినికేతన్'లో పెద్ద ఎత్తున ఉత్సవాలు జరపటం సహజమే. ఈ ఏడాది దానికోసం అక్కడ పాలకమండలి భారీ ప్రణాళికనే సిద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వాన్ని నిధుల కోసం అభ్యర్థించింది. వివిధ ప్రాంతాలలో సాంస్కృతిక కార్యక్రమాలు, సెమినార్లు, సభలు నిర్వహించనుంది. విశ్వకవిని మరోసారి ప్రపంచానికి పరిచయం చేయాలని పాలకమండలి ఆలోచన. ఒకప్పుడు ప్రపంచం మొత్తాన్ని ఏక తాటిపైకి తేవాలని కలగన్న రవీంద్రుడు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుండి నిధులు సేకరించి శాంతినికేతన్‌ను ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం శాంతినికేతన్ పాలకమండలి అట్టహాసంగా భారీ ఎత్తున కార్యక్రమాలు నిర్వహించి తన భక్తి చాటుకోవాలనుకుంటున్నది.

ఇక్కడే వివాదం వుంది. ఎన్నో అభియోగాలూ వున్నాయి. రవీంద్రుడు, వారి శాంతినికేతన్ మార్కెట్ ఉపకరణాలుగా మారడం, టాగూర్ 150వ జయంతి ఉత్సవం కోసం భారీ ఎత్తున ఖర్చుపెట్టడానికి పూనుకోవడం స్థానికులలో ఎన్నో ప్రశ్నలు రేపుతున్నాయి. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే ఏమవుతుంది? కొద్ది నెలల క్రితమే కదా విశ్వభారతి 350 కోట్ల రూపాయల ప్రత్యేక సహాయం పొందింది! సౌమేంద్రనాథ్ బంధ్యోపాధ్యాయ అనే రవీంద్ర పరిశోధకుడికి దయాదాక్షిణ్యం, ఆమోదం అంటే గిట్టటం లేదు. మాజీ ఉపాధ్యాయుడుగా ఆయన విశ్వభారతితో దీర్ఘకాల సంబంధాలు కలిగి ఉన్నాడు. ఆయన ప్రకారం "దేవుని మీదే దైవత్వం నేను ఒప్పుకోలేను. కేంద్రప్రభుత్వం విశ్వవిద్యాలయ మంజూరీ కమీషన్ అయినా లేక ఏ పేరునైనా సరే రవీంద్రనాథుని విశ్వ విద్యాలయానికి నిధులు ఇస్తున్నారని వారు చెప్పినట్లే నడవాలి, విశ్వభారతి తన సొంత ఆదర్శాన్ని కోల్పోవాలనేది అభీష్టం కాదు. ఎందుకంటే కొన్ని సంఘటనల ద్వారా పైనుండి నిధులతో పాటు నిర్దేశాలూ వస్తున్నాయని తెలుస్తోంది. ఇదేంటంటా? దీని జాతీయ ప్రత్యేకత గుర్తించే వారు నిధులివ్వాలి. మార్పులు, చేర్పులు రుద్దడం అభీష్టం కాదు"

విశ్వభారతిపై ఆయనకు చాలా ఆశలున్నాయి. మొదట ఇంతకు ముందు ప్రచురితం కానివి ప్రచురణ జరగాలి. ఇప్పటికీ రవీంద్రనాథుని రచనలు, ఉత్తరాలు ఎన్నో సాధారణ ప్రజలకు చేరలేదు. రవీంద్రనాథుని సమస్త రచనలు ప్రచురించడం ప్రథమ కర్తవ్యం. కాపీరైట్ లేకపోవడం వల్ల రవీంద్రనాథ్ రచనల ప్రచురణల వివిధ నమూనాలు చూసి వరిష్ఠ ఆశ్రమవాసులు తప్పులు లేకుండా సమగ్ర ప్రచురణ బాధ్యత విశ్వభారతీయే తీసుకోవాలనుకుంటున్నారు. కాని ఉద్యోగాలు కుదించడంలో విశ్వభారతి కూడా మినహాయింపు కాదు. ప్రచురణ విభాగం ఉద్యోగులను ఇంచుమించు అందరినీ వేరే విభాగాలకు తరలించడం జరిగింది. ప్రచురణకు ప్రాధాన్యత లేదు. ఇంకా చెప్పాలంటే కేంద్రప్రభుత్వం ఆమోదించిన రవీంద్రనాథ్ యొక్క 1500 ల ఛాయా చిత్రాలు ప్రచురించే బాధ్యత ఒక ప్రైవేటు ప్రచురణ సంస్థకు ఇవ్వడం జరిగింది. సౌమేంద్రనాథ్ బంధ్యోపాధ్యాయ ఇప్పుడు విశ్వభారతిలో జరుగుతున్న పలు అవాంఛనీయ సంఘటనలపై దృష్టి సారించాలని పాలకమండలిని అభ్యర్థించారు. శాంతినికేతన్, విశ్వభారతి పట్ల యావత్తు ప్రపంచానికి ఉన్న నమ్మకం, గౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని కాపాడుకోవాలని అభ్యర్థించారు.

చెప్పుకోవాలంటే చాలా ఉన్నాయి. విశ్వవిద్యాలయ కేంద్ర భవనం అంతా ఉపాధ్యాయుల, అవాంఛనీయ కార్యకలాపాలకు సంబంధించిన పోస్టర్లతో నిండిపోయింది. కాంగ్రెసు, తృణమూల్, మొదలైన కుమ్ములాటలు సాధారణమయ్యాయి. మొదట సరస్వతి పూజకు విఘ్నం వాటిల్లింది. కళా భవనం కట్టడాలను పగలుకొట్టడానికి విశ్వభారతిలో పనిచేసే రాజకీయ పక్షాలకు చేతులు వణకలేదు. విద్యార్థుల కొట్లాట, విద్యార్థిని హత్య, హాస్టళ్ళు రక్తసిక్తం, కాంగ్రెసు, తృణమూల్ అగ్రనాయకుల బహిరంగ సంఘర్షణ, ఇలా ఎన్నాళ్ళు నడుస్తుంది?

ఇటువంటి సంక్షోభ వాతావరణంలో ఈ ఏడాది రవీంద్రనాథ్ పుట్టినరోజు నాడు వరిష్ఠ ఆశ్రమవాసి సుప్రియఠాకూర్ ఆశించిందేమిటి? విశ్వభారతిలో జరుగుతున్న నానా రకాల అవాంఛనీయ సంఘటనలకు బెదిరిపోయి ఆయన్ని అనాల్సివచ్చింది. "ఒక్కొక్కటిగా నా ఆశలు అన్ని అడియాశలవుతున్నాయి. అయినా రవీంద్రనాథ్, ఆయన సృష్టి వున్నాయి. మా విశ్వభారతి, శాంతినికేతన్ ఉన్నాయి. విశ్వభారతి ఈ సమయంలో ముఖ్యమైన విషయాలపై దృష్టి సారిస్తుందని ఆశిస్తున్నాను. నాట్యం, గానం, నాటకాలు ఇవన్నీ ఎలా అవుతున్నాయో అవనివ్వండి. రవీంద్రనాథ్‌పై పరిశోధనకు ఇంకా ప్రాధాన్యత సంతరించుకోవాలి. చేసేది చాలా చాలా ఉంది. ఆ వైపే దృష్టి సారించాలి. పరిశోధన వేరే ఒక సంపద. రవీంద్రనాథ్ రచించినది, సృష్టించినది పరిశోధన కానిది చాలానే ఉన్నది. ఇది అపరిమిత విలువగలది. ఇది జరిగితే చాలానే సాధించవచ్చు. లెక్కలో దాన్ని అంచనా వేయలేము"

విశ్వభారతి కళాభవన్ మాజీ అధ్యక్షుడు భాస్కర్ ప్రవీర్ విశ్వాస్ చెప్పే ప్రకారం "ఈ సమయంలో విశ్వభారతి పైపైన కొన్ని కార్యక్రమాలు చేయటానికి మాత్రమే పరిమితమైతే సరిపోదు. ఇప్పుడు రవీంద్రనాథుని ప్రత్యేకతను అర్థం చేసుకోవాలి. రవీంద్రుడు ఒక ఆధునిక మానవుడు. ఆయన ఆలోచనలు సంకీర్ణతలను అధిగమించి వుండేవి. ఆ విషయం గమనంలో ఉంచుకోవాలి. మహిళా విద్యా ప్రసారం, గ్రామీణాభివృద్ధి, సహకార సంస్థలు వీటిన్నింటినీ పక్కన పెట్టి కార్యక్రమాలు చేస్తే సరిపోదు. రవీంద్రనాథ్ నా దృష్టిలో ఒక గాజు పాత్రలో పట్టిన బొమ్మ కాదు. ఆయన ఆలోచనల్లోని మానవీయ దృక్కోణం, సామరస్యం, అభివృద్ధికి సంబంధించి స్పృహ అందులో వుండాలి. రాష్ట్రమంతటా హింసను ఎలా విస్తరింపజేస్తున్నారో ఇప్పుడు చూస్తున్నాం, ఈ విషయంలో రవీంద్రనాథుడుని తెలుసుకోకుండా, ఆయన గురించి ఆలోచించకుండా ఉండగలమా?"

శిల్పి, సాహిత్యకారులు, గుణీజనాలు, విశ్వభారతి పట్ల పెట్టుకున్న ఆశలకు సంబంధించి విశ్వభారతి తన బాధ్యతను ఎలా నిర్వహించాలనుకుంటుంది? విశ్వవిద్యాలయ ప్రజా సంబంధాల అధికారి అమితాబ్ చౌదరి ప్రకటన "ఈసారి మేము 50 గ్రామాల్లో రవీంద్రనాథుని పుట్టిన రోజు నాడు కంప్యూటర్ అక్షరాస్యత కేంద్రాలను నిర్వహిస్తాం, రవీంద్రనాథ్ రచనలు ఒక సంకలనం ప్రచురిస్తాం. 1500 ల ఛాయా చిత్రాలు ప్రచురిస్తాం........"

విశ్వభారతిలో ఉన్న మూడు అతిథిగృహాలు ప్రైవేటుపరం చేయటానికి పాలకమండలి ప్రాథమిక చర్యలు తీసుకున్నది. ఉద్యోగుల నియామకంలో పెద్ద ఎత్తున లోపాలున్నాయి. అవినీతి కూడా దానికి తోడైంది. ఉన్నతస్థాయి కమిటీ 273 పేజీల నివేదిక సమర్పించి తెలియజేసిన నిర్ణయాలు చూసి ఆశ్రమవాసుల నుండి సెనేట్ సభ్యుల వరకు అందరూ నిరసన తెలియజేశారు. ఉదాహరణకు పాఠభవన్, ఉత్తర శిక్షా సదన్ విలీనం. శాంతినికేతన్ నిర్వహణ బాధ్యతంతా సరాసరి కేంద్రప్రభుత్వం తీసివేసుకోవడం ద్వారా కేంద్రప్రభుత్వం ఏమనుకుంటున్నదనేదే ప్రశ్న.

★

కాబూలీవాలా

- రవీంద్రనాథ్ టాగూర్

మా అయిదేళ్ల పసిపాప మిని నోరు క్షణం మూత పడదు. ఎప్పుడూ వాగింది వాగినట్లే వుంటుంది. అది మాతృ గర్భం నుండి ఈ భూమిమీద పడ్డాక మాటలు నేర్చుకుంటూ ఒక సంవత్సరం మాత్రం అలా మూగగా పడివుందేమో! ఆ తర్వాత అది మేలుకొని వున్నంతసేపూ ఆ కాలాన్ని మౌనంతో ఒక్క క్షణం కూడా వృథాపుచ్చి ఎరగదు.

ఆనాడు ఉదయం నా నవలలో పదిహేడవ అధ్యాయం రాద్దామని కూర్చున్నాను. ఇంతలో మిని వచ్చి "చూడు, నాన్నగారు! ఆ నౌకరు రామదయాల్ లేడూ, వాడు కాకిని 'కౌవా' అంటున్నాడు. వాడికేమీ తెలియదు కదు నాన్నగారు" అన్నది.

ప్రపంచంలోని భాషల విభిన్నతత్వాలను గురించి నేను చెప్పబోతుండగా ప్రసంగం మార్చి "చూడు నాన్నగారు, ఆ భోలా ఏమంటున్నాడో! ఆకాశంలోంచి ఏనుగు తొండంతో నీళ్లు చిమ్ముతూ వుంటుందట. ఆ నీళ్లే వర్షంగా కురుస్తున్నాయట. అవును గాని నాన్నగారూ, భోలా వుత్త అబద్ధాల కోరుగదూ? వుత్త వదురుబోతు! రాత్రింబగళ్లు ఒకటే వదురుడు" అన్నది మిని.

ఆ విషయాన్ని గురించి నా అభిప్రాయం కోసం నిరీక్షించకుండా హఠాత్తుగా జిలిబిలి మాటలతో ఛటీమని ఈ సారి ఇంకో జటిల ప్రశ్న అడిగింది. "నాన్నా, అమ్మ నీకు ఏమవుతుంది" అని. "పెండ్లాం" అని అనుకుని నాలో నేనే నవ్వుకున్నాను. పైకి మాత్రం "మినీ నువ్వు ఇక్కడి నుండి కొంచెం సేపు వెళ్లమ్మా. అలా వెళ్లి ఆ భోలాతో ఆడుకో. నాకు కొద్దిగా పనుంది. మంచిదానివి కదూ. వెళ్లు" అని బతిమిలాడాను.

అలా అనగానే టేబిల్ పక్కగా నా కాళ్లదగ్గర కూర్చొని కాళ్లు చేతులు చాపి 'కాళ్లా గజ్జా కంకాళమ్మ' ఆట ఆడుకోవడం ఆరంభించింది. అప్పుడు నా నవల పదిహేడవ అధ్యాయంలో ప్రతాప సింహుడు జైలునుంచి కాంచనమాలను విడిపించుకుని, గాఢాంధకారావృతమైన ఆ నిశిరాత్రి ఎత్తైన జైలు గోడమీదికి ఎక్కి కింద పారుతున్న నదిలో దూకి పారిపోవడానికి ఉద్యుక్తుడై వున్నాడు.

మా ఇల్లు రోడ్డు పక్కనే వుంది. అందాకా 'కాళ్లా గజ్జా కంకాళమ్మ' ఆట ఆడుకుంటున్న మిని చివాలున లేచి కిటికీ దగ్గరకు వెళ్లి నిలబడి 'కాబూలీవాలా! ఓ కాబూలీవాలా!' అని బిగ్గరగా కేకలు పెడుతూ పిలుస్తోంది.

నల్లగా మాసి మురికితోలు అయిన వదులొదులు చొక్కా, పైజమా, పెద్ద తలపాగా ధరించి, ఆజానుబాహువు అయిన కాబూలీవాడొకడు రెండు చేతుల్లో రెండు ద్రాక్షపండ్ల పెట్టెలు, భుజానికి ఎండుద్రాక్ష, బాదంపప్పులతో నిండిన సంచి తగిలించుకుని, ఆ రోడ్డు మీదినుంచి మెల్లగా నడిచి వెళ్తున్నాడు. అతణ్ణి చూడగానే మా మిని హృదయంలో, ఏం భావాలు ఉత్పన్నమయ్యాయో ఏమో, నాకైతే తెలియదు. కానీ మిని ఆ కాబూలీవాలాను మాత్రం బిగ్గరగా కేకలు వేస్తూ పిలుస్తోంది. సంచిని భుజాన వేసుకుని అటు పోతున్న ఆ కాబూలీవాలా, నా గదిలోకి వస్తే మళ్లీ కొత్త ప్రమాదం నెత్తినవచ్చి పడేటట్లుందే, ఆరి భగవంతుడా నా పదిహేడవ అధ్యాయానికి నేటికి ఇక ఇంతటితో స్వస్తి కాబోలు అని అనుకున్నాను.

మిని కేకలు విని ఆ కాబూలీవాలా నవ్వుతూ దానికేసిచూసి చరచరా ఇంట్లోకి వచ్చేస్తున్నాడు. కానీ ఇంట్లోకి వస్తున్న ఆ కాబూలీవాలాను చూడడంతోటే తనను పట్టుకుపోతాడన్న భయంతో ప్రాణాలు బిగబట్టుకుని మిని లోనికి పారిపోయింది. అంతే. మళ్లీ కంటికి కనిపించలేదు. గప్‌చిప్ సాంబారుబుద్దిలాగా దాక్కొంది ఎక్కడో.

బజారులోంచి కాబూలీవాలా నవ్వుతూ వచ్చి నాకు సలాం చేసి నిల్చున్నాడు. ఇక ఇవతల నవలలో ప్రతాపసింహుడు, కాంచనమాలలు యమయాతనలతో వున్నప్పటికీ ఆ మనిషిని తీరా ఇంట్లోకి పిలిచి, ఏమీ కొనకుండా ఊరికే తిప్పి పంపడం మర్యాద కాదనిపించింది.

అందుకని ఏవో కొద్దిగా కొన్నాం. క్రమక్రమంగా మేమిద్దరం లోకాభిరామాయణంలో పడ్డాం. రష్యావాళ్లను గురించి, సరిహద్దు వివాదాలను గురించి లెక్చరు దంచేస్తున్నాడు కాబూలీవాలా.

చివరకు అతను లేచి వెళ్లిపోబోతూ "బాబుగారూ, తమ పాపాయి ఎక్కడుంది?" అని అడిగాడు వచ్చీ రాని పరాయి భాషలో.

దాని హృదయంలో ఉత్పన్నమైన భయాన్ని తొలగిద్దామన్న అభిప్రాయంతో లోపలి నుంచి మినీని పిలిపించాను. అది నన్ను కరచుకుని, కాబూలీవాలా ముఖంవైపు, అతని సంచివైపు అదేపనిగా అనుమానంగా చూస్తూ నిలబడింది. కాబూలీవాలా తన సంచిలోంచి ఇంత బాదంపప్పు, ఎండుద్రాక్ష తీసి మినీకివ్వబోయాడు. కానీ వాటిని తీసుకోవడానికి భయపడింది. దాని అనుమానం మరీ ఎక్కువైంది. ఇక అది నా మోకాళ్లను వదలకుండా చుట్టేసుకుంది. అలా ప్రారంభమైంది వారి తొలి పరిచయం.

ఒకనాడు ఏదో అవసరమైన పనుండి పొద్దున్నే బజారుకు బయలుదేరాను. వాకిట్లోకి వచ్చి చూసేసరికి మా అమ్మాయి మిని ఇంటిముందర అరుగుల మీద కూర్చొని ఆ కాబూలీవాలాతో జోరుగా మాట్లాడేస్తోంది. ఆ కాబూలీవాలా దాని కాళ్లముందర కూర్చొని చిరునవ్వుతో దాని మాటలను బహు ఓపిగ్గా ఆలకిస్తున్నాడు. అప్పుడప్పుడు సందర్భాన్ని బట్టి అతను తనకు వచ్చీ రాని పారాయి భాషలో మిని మాటల మీద తన అభిప్రాయాలను కూడా వ్యక్త పరుస్తున్నాడు. తను పుట్టి బుద్దెరిగిన తర్వాత ఈ అయిదు సంవత్సరాలలో దాని మాటలను అంత ఓపికతో ఆలకించినవారు 'తండ్రినైన' నేను తప్ప బహుశా మరెవ్వరూ ఆలకించి వుండరు. దాని బుల్లి పరికిణీకేసి చూశాను. దాని నిండా బాదంపప్పు, కిస్‌మిస్ పండ్లు వున్నాయి. జేబులోంచి అర్ధరూపాయి బిళ్ల తీసిస్తూ "దానికవన్నీ ఎందుకిచ్చావ్? ఇక ముందెప్పుడూ అలా ఇవ్వకు" అన్నాను ఆ కాబూలీవాలాతో. అతను మాట్లాడకుండా ఆ అర్ధరూపాయి తీసుకుని జేబులో వేసేసుకున్నాడు. బజారునుండి నేను ఇంటికి తిరిగొచ్చేసరికి ఆ అర్ధరూపాయి ఇంట్లో పెద్ద గందరగోళాన్ని పుట్టిస్తోంది.

మిని తల్లి నున్నని వేముబెత్తాన్ని ఝళిపిస్తూ దాన్ని గద్దించి అడుగుతున్నది "అర్ధరూపాయి నీ కెక్కడిదే" అని

"కాబూలీవాలా ఇచ్చాడు" అన్నది మిని.

"ఊ, చెప్పవేం, ఆ కాబూలీవాలా నీ కెందుకిచ్చాడు?" అన్నది కోపంగా.

"నేనడగలేదు. అతనంతట అతనే ఇచ్చాడు" అన్నది మిని ఏడుస్తూ.

మినీని రెక్కపట్టి బయటికి లాక్కొచ్చి దాన్ని ఆ ఆపదనుండి తప్పించాను.

ఆ కాబూలీవాలాను మినీ కలుసుకోవడం ఇది రెండవ సారి మాత్రమే కాదని తెలిసింది. ఈలోపున ఆ కాబూలీవాలా రోజూ మా ఇంటికి వచ్చిపోతూ మినీకి బాదంపప్పు, కిస్‌మిస్ పండ్లు లంచమిచ్చి దాని పసి హృదయాన్ని ఆకర్షించి లోబరుచుకున్నాడు.

వాళ్లిద్దరూ రోజూ సరదాగా మాట్లాడుకుంటుంటారు. రహమత్‌ను చూడగానే మా మిని నవ్వుతూ "కాబూలీవాలా! కాబూలీవాలా! నీ సంచిలోపల ఏం వుంది" అని అడుగుతుంది.

రహమత్ చిరునవ్వు నవ్వుతూ వేళాకోళంగా 'ఏనుగు' అనేవాడు. అది విని మిని

పకపక నవ్వేది. రహమత్ కూడా నవ్వేవాడు. ఒకరు బాగా వయసు ముదిరిన వ్యక్తి. ఇంకొకరిది అమాయక పసిహృదయం. శరత్కాల ప్రభాతవేళ వారిద్దరి మధ్య జరుగుతున్న ఆ స్నిగ్ధ సరళ హాస పరిహాసాలు వింటానికి నాకు సరదాగానే వుండేది.

అంతేకాదు, వారిద్దరిమధ్య రోజూ ఇంకోమాట అనుకోవడం కూడా మామూలైంది. "మినీ నువ్వు అసలు అత్తవారింటికి వెళ్లకు. అవును, వెళ్లవు కదూ!" అనేవాడు మినీతో రహమత్.

మన దేశంలోని బాలికలకు పుట్టినప్పటినుండి "అత్తవారిల్లు" అన్న పదం తెలిసుంటుంది. కానీ మేము ఆధునిక వాతావరణానికి అలవాటుపడ్డవాళ్లం కనుక మా అమ్మాయికి అత్తవారింటి విషయాల్ని గురించి చెప్పలేదింకా. అందువల్ల రహమత్ అంటున్న ఆ పదాల భావం మినీకసలు తెలిసేదికాదు. కాని ఆ విషయాన్ని గురించి దానికసలు తెలియకపోయినా ఆ మాటలకు తిరిగి జవాబు చెప్పకుండా వూరుకోవడం మిని స్వభావానికి విరుద్ధం. అందువల్ల మిని తిరిగి ఎదురు ప్రశ్న వేస్తూ "నువ్వు వెళతావా అత్తవారింటికి" అని అడిగేది రహమత్‌ను.

ఊహాజనితమైన ఆ 'అత్త'ను గుద్ది చంపబోతున్న వాడిలా తన బలమైన పిడికిలి బిగించి మీదికి ఎత్తి "ఊ, ఇదిగో చూడు. దీనితో మా అత్తను గుద్ది చంపేస్తాను" అంటూ అనేవాడు రహమత్.

కాలచక్రం గబగబా తిరిగిపోతోంది. చూస్తుండగానే కాలచక్రం గిర్రున తిరిగి నిర్మల శరదృతువు మళ్లీ రానే వచ్చింది. పూర్వం ఈ రోజుల్లోనే రాజులు దిగ్విజయ యాత్రకు బయలుదేరేవారు. నేను కలకత్తా వదిలి బయటికి వెళ్లి ఎరుగను. బహుశా అందువల్లే కాబోలు, నూతిలో కప్పలా మా ఇంట్లో ఒక మారుమూల చిరప్రవాసం చేస్తున్న నా మనసు బాహ్య ప్రపంచం కోసం పరితపిస్తూ ఈ సకల చరాచర ప్రపంచాన్ని ఊహా జగత్తులో చుట్టి వస్తుంటుంది. విదేశపు పేరు వినిపించిందంటే చాలు, నా మనస్సక్కడికి పరుగెడుతుంది. విదేశస్తుడెవరన్నా కనిపించాడా ఇక సరే సరి. ఆ హృదయం ఆ దేశంమీద సానుభూతితో నిండిపోతుంది. అక్కడి పర్వతాలు, అడవులు, నదులు, జానపదాలు, వారి స్వతంత్ర జీవనాన్ని గురించిన ఊహాజనిత దృశ్యాలు నా కళ్లముందర మెదులుతాయి.

బాహ్య ప్రపంచం అలాంటి సుందర దృశ్యాలతో నిండి వుంటుంది. నూతిలోని కప్పలాగా ఇక నాకు మా ఇల్లే సకల ప్రపంచం. ఇల్లొదిలి బయటికి రావడమంటే నాకు తలనొప్పి. అందువల్లే పొద్దుటిపూట నా గదిలో టేబుల్ ముందర కూర్చొని ఆ కాబూలీవాలా చెబుతున్న లెక్చర్లు వింటూ దేశాటన కార్యక్రమానికి సంబంధించినంత వరకు కుతి తీర్చుకుంటుండే వాడిని.

మిని తల్లి వట్టి పిరికి మనిషి. బజార్లో కాస్త గొడవ జరిగిందంటే సరి, లోకంలో తాగితందనాలాడే తాగుబోతులంతా ఇక మా యింటిమీదికే వస్తున్నారని అనుకుంటుంది. ఈ ప్రపంచమంతా దొంగలు, బందిపోట్లు, తాగి తందనాలాడే తాగుబోతులు, పాములు, పులులు, మలేరియా జ్వరాలు, గొంగళి పురుగులు మొదలైన వాటితో నిండి వుంటుందని ఆమె అభిప్రాయం. ఇంతకాలం నుంచి (అట్టే ఎక్కువకాలం కాలేదనుకోండి) ఈ ప్రపంచంలో కాపురం చేస్తున్నా ఆమె మనసులోని ఈ భయాందోళనలు దూరమవలేదు.

ముఖ్యంగా కాబూలీవాలా రహమత్‌ను గురించి ఆమెకు కొన్ని సందేహాలు వున్నాయి. అందువల్ల వానిమీద కాస్త కన్నేసి వుంచమని నాతో పదేపదే అంటూవుంటుంది. నేనామె సందేహాన్ని నవ్వులాటకింద తోసిపుచ్చేవాడిని. కాని అలాంటప్పుడు ఆమె వూరుకునేది కాదు. కాబూలీలు పిల్లల్ని ఎత్తుకుపోరూ? కాబూల్‌లో పిల్లలను అమ్ముటంలా? రాక్షసిలాంటి ఆ కాబూలీ వాడికి చిన్న పిల్లల్ని మాయచేసి ఎత్తుకుపోవడం ఒక లెక్కా? అని నా మీద ఇలా ఎన్నో ప్రశ్నల వర్షం కురిపించేది.

ఆమె అలా అనుమానించడంలో కూడా కొంత యదార్థం లేకపోలేదని చివరకు నేను అంగీకరించక తప్పలేదు. కాని అది నమ్మదగ్గ విషయం కాదు. నమ్మగలిగిన శక్తి అందరిలో ఒకే మాదిరిగా వుండదు. అందువల్ల నా భార్యలో ఆ భయం అలాగే వుండిపోయింది. కాని కేవలం అనవసరంగా కలిగిన భయంతో నిర్దోషి అయిన రహమత్‌ను మా ఇంటికి రావద్దనలేకపోయాను.

ప్రతి సంవత్సరం మాఘమాసంలో రహమత్ స్వదేశానికి వెళ్తుంటాడు. ఇక ఆ రోజుల్లో తన ఖాతాదార్ల నుండి రావలసిన అప్పులు వసూలు చేసుకోవడంలో అతనికి బొత్తిగా తీరికే వుండేది కాదు. ఇల్లిల్లు తిరగాల్సి వచ్చేది. కాని ఆ పరిస్థితుల్లో కూడా అతను ఎప్పుడో ఒకప్పుడు కాస్త వీలు చూసుకుని మినీని పలకరించి పోతుంటాడు. చూసేవాళ్లకు వాళ్లిద్దరూ ఏదో కుట్ర పన్నుతున్నారనిపిస్తుంది. ఒక్కొక్కనాడు తీరిక చిక్కక పొద్దుటిపూట రాలేకపోతే ఆఖరికి సాయంత్రం మా ఇంట్లో తప్పక హాజరయ్యేవాడు. వదులు చొక్కా పైజమా ధరించి భుజానికి సంచులు తగిలించుకుని చీకట్లో ఇంటిమూలన కూర్చునివుండగా దీర్ఘ కాయుడైన ఆ కాబూలీవాలాను అదాటున చూసినవారు నిజంగానే భయపడతారు.

కానీ కాబూలీవాలా కనిపించడంతోటే మిని 'కాబూలీవాలా! ఓ కాబూలీవాలా! అని కేకలేసుకుంటూ నవ్వులు, కేరింతలతో అతని దగ్గరకు పరుగెత్తుతుంది. ఈడు జోడు కాని ఆ ఇద్దరి మిత్రుల మధ్య చెలరేగుతున్న వారి ఆ నవ్వులు, కేరింతలకు ఆనందంతో నా మేను పులకరిస్తుంది.

ఒక రోజు పొద్దునే నేను నా గదిలో కూర్చుని నా నూతన గ్రంథపు ప్రూఫులు దిద్దుకుంటున్నాను. వెళ్లిపోబోతున్నానని కాబోలు మూడు నాలుగు రోజుల నుండి చలి ఎముకలు కొరికేస్తుంది. శరీరంలో గజగజ వణుకొస్తోంది. కాళ్లు చేతులు కొంగర్లు పోతున్నాయి. కిటికీలోంచి పొద్దుపొడుపు ఎండ టేబిల్ కింద వున్న నా పాదాలమీద వచ్చి పడుతోంది. ఆ సూర్యకిరణాల గోరువెచ్చని వేడి హాయిని ప్రసాదిస్తోంది. సుమారు ఎనిమిది గంటలై వుంటుంది. మఫ్లర్లు మెడకు చుట్టుకుని ప్రాతఃకాలం వాహ్యాళికి వెళ్లిన ఉషాచరణం ఇళ్లకు తిరిగొస్తోంది. సరిగ్గా ఆ సమయానికి నడిరోడ్డుమీద గల్లంతేదో జరుగుతున్నట్లు పెద్ద పెద్ద కేకలు బొబ్బలు వినిపించాయి.

దర్వాజా దగ్గర నిలబడి చూద్దును గదా కాబూలీవాలా రహమత్‌ను ఇద్దరు పోలీసువాళ్లు పట్టుకుని తీసుకొస్తున్నారు. వారివెనుక కుర్రవాళ్లమూక కుతూహలంతో పరుగెత్తుకొస్తుంది. రహమత్ చొక్కా అంతా రక్తంతో తడిసిపోయింది. పక్కన వస్తున్న కానిస్టేబుల్ చేతిలో రక్తం వడుస్తున్న కత్తి వుంది. నేను ఇంట్లోంచి బజార్లోకి వచ్చి పోలీసులను ఆపి "విషయం ఏమిటి?" అని అడిగాను.

మా పొరుగింటి ఆసామి ఒకరు రహమత్ వద్ద రాంపూర్ శాలువా కొని పైకం మొత్తం ఇవ్వకుండా ఇంకా కొంతబాకీ వుంచాడని, ఇప్పుడు రహమత్ ఆ బాకీ అడిగితే నేనెరుగను పొమ్మన్నాడని, దానిమీద మాటకు మాట ముదిరి రహమత్ ఆ ఆసామిని కత్తితో పొడిచాడని, కొంత పోలీసుల ముఖతా, కొంత రహమత్ ముఖతా విన్నాను.

రహమత్ తన బాకీదారును, నోట అనకూడని తిట్లన్నీ తిడుతున్నాడు. ఇంతలో కాబూలీవాలా, ఓ కాబూలీవాలా! అని అరుచుకుంటూ మిని ఇంట్లోంచి బయటికి వచ్చింది.

రహమత్ ముఖం ఆ క్షణం ఆనంద రేఖతో విప్పారింది. అతని భుజానికి ఇవాళ సంచిలేదు. అందువల్ల సంచిని గురించిన ఆ ఇద్దరి మిత్రుల నిత్య హాస్యాలాపనలకు అవకాశం లేకపోయింది. మిని తడుముకోకుండా "నువ్వు అత్తవారింటికి వెళతావా" అని అడిగేసింది.

రహమత్ "అవును, అక్కడికే వెళుతున్నాను!"

తనిచ్చిన ఆ సమాధానం మినీని సంతృప్తి పరచలేకపోయిందని గ్రహించాడు రహమత్. అప్పుడిక చేతులు చూపిస్తూ "అత్తను చంపేసేవాడినే, కానీ ఏం చేయను. చేతులు కట్టేశారు" అన్నాడు.

కత్తి విసిరాడన్న నేరంమీద రహమత్‌కు దీర్ఘకాల శిక్ష విధించారు.

ఆ కాబూలీవాలా క్రమక్రమంగా మా స్మృతిపథంలోంచి తొలగిపోతున్నాడు. కాదు. మేమే బొత్తిగా మరచిపోయాం. మా యింట్లో హాయిగా కాలక్షేపం చేస్తున్న మాకు కొండలమీద నిర్భయంగా విహరించవలసిన ఆ స్వేచ్ఛాజీవి అలా నాలుగు గోడల మధ్య ఇంకా జైలులో మగ్గుతున్నట్లు అసలు స్ఫురణకే రాలేదు.

ఇక చంచల హృదయమగు మిని అంతలో ఆ కాబూలీవాలాను ఎలా మరిచిపోగలిగిందో చూస్తే నాకే ఆశ్చర్యం వేసింది. ఇప్పుడు అది తన పాత స్నేహితుణ్ణి పూర్తిగా మర్చిపోయింది. కాబూలీవాలా జైలుకెళ్లాక మా నౌకరు నబీతో కొన్నాళ్లు ఆడుకుంది. ఇక క్రమక్రమంగా దానికి వయసు వస్తున్నకొద్దీ మగ పిల్లలను వదిలేసి తన ఈడు ఆడపిల్లల జట్టును కూడ గట్టింది. అంతేకాదు మిని దర్శన భాగ్యం రాను రాను చివరకు కన్నతండ్రినైన నాకే దుర్లభమైంది. ఒక రకంగా మినీతో నా సంబంధం పూర్తిగా తెగిపోయిందనే చెప్పొచ్చు.

అనంత కాలవాహినిలో కొన్ని సంవత్సరాలు దొర్లిపోయాయి. అది శరత్కాలం.

మిని పెళ్లి నిశ్చయమైంది. మా యింటిని నిత్యానందంతో కలకలలాడించే ఆనందమయి మా మిని కూడా పుట్టింటిని అంధకారంలో ముంచి కైలాసవాసిని పార్వతిలాగా ఇక అత్తామామలింటికి వెళ్లిపోబోతోంది.

బాలభానుని ప్రాతఃకిరణాలు అతి మనోహరంగా ప్రకాశిస్తున్నాయి. వర్షంనీటితో కడిగి శుభ్రం చేయబడిన శరత్కాల బాలార్కుని ఆ తొలి ఎండలు వెలిగారమద్దిన బంగారంలా స్వర్ణకాంతులీనుతున్నాయి. అవి వెదజల్లుతున్న అనుపమ లావణ్యానికి శోభాయమానమైన ప్రకృతి మిలమిల మెరుస్తోంది.

ఇవాళ తెల్లవారు ఝామునుంచి మా ఇంట్లో సన్నాయి మోగుతుంది. సన్నాయి గొట్టంలోంచి వినిపిస్తున్న కరుణా పూరితమైన ఆ భైరవి రాగం నా హృదయాంతరాళపు, మూగ వేదనను సమీపిస్తున్న హృదయవిదారకమైన మా ఎడబాటును శరత్కాల లేత ఎండలతో పాటు అనంతవిశ్వంలో వ్యాపింపచేస్తున్నది.

అది మా మిని పెళ్లిరోజు. పొద్దుటినుంచీ ఇంట్లో చాలా హడావిడిగా వుంది. చుట్టాలు పక్కాలు వస్తున్నారు. ఇంటిముందర పందిట్లో పెళ్లి మండపం కడుతున్నారు. హాలు, వరండా అంతా పచ్చని మామిడి తోరణాలతో అలంకరించబడుతోంది. ఊ కానీయండి. అదిగో అటుతిప్పి తీసుకురండి. లగ్నం సమీపిస్తోంది. తొందర చేయండి. చూస్తారేం కానీయండయ్యా, అన్న కేకలు వినిపిస్తున్నాయి నా గదిలోకి.

పెళ్లి ఖర్చుల జాబితా వేసుకుంటూ, నా గదిలో కూర్చున్నాను. ఇంతలో రహమత్ వచ్చి సలాం చేసి నిలబడ్డాడు.

నేనసలు అతన్ని గుర్తుపట్టలేకపోయాను. వెనుకటిలాగా అతని భుజానికి ఇప్పుడా సంచిలేదు. నెత్తిమీద వుంగరాలు తిరిగిన ఆ జులపాలూ లేవు. ముఖంలో మునుపటి ఆ కళాలేదు. చివరకు చిరునవ్వును బట్టి అతను రహమత్ అని గుర్తుపట్టగలిగాను.

ఏం రహమత్ ఎప్పుడొచ్చావ్?

"నిన్న సాయంత్రమే జైలునుంచి విడుదలయ్యాను"

అతని మాటలు నన్ను తీవ్రంగా వేధించాయి. ఖూనీకోరుతో ఇంతవరకు ఎన్నడూ మాట్లాడి ఎరుగను. వానిని చూడడంతోనే నా హృదయం గడ్డకట్టుకుపోయింది. ఇవాళ ఈ శుభదినంనాడు ఈ మనిషి ఇక్కడి నుండి వెళ్లిపోతే బాగుండుననిపించింది.

కాబూలీవాలాతో "ఇవాళ మా ఇంట్లో కాస్త అవసరమైన కార్యం ఉంది. తొందరపనిలో వున్నాను. అందువల్ల ఇప్పుడు నీతో మాట్లాడడానికి తీరికలేదు. మళ్లీ ఇంకోనాడురా" అని అన్నాను.

నా మాటలు విని అతను వెంటనే తిరిగి పోసాగాడు. కానీ దర్వాజాదాకా వెళ్లి కాస్త ఇటుఅటు చూసి "పాపకు ఒకసారి చూపించరూ?" అని అడిగాడు.

పాపం. మిని మునుపటిలాగే ఇంకా పసిపాపగానే వుందని అతని విశ్వాసం కాబోలు. మిని పూర్వంలాగా ఇప్పుడు కూడా 'కాబూలీవాలా!' ఓ కాబూలీవాలా!' అని అరుచుకుంటూ తన దగ్గరికి పరుగెత్తి వస్తుందని, మునుపటిలాగానే నవ్వులు కేరింతలతో ఆడుకోవచ్చని అనుకుంటున్నట్లున్నాడు. అంతే కాదు మునుపటి స్నేహానికి స్మృతిచిహ్నంగా ఒక ద్రాక్షపళ్లగుత్తి, ఒక కాగితంలో ఇన్ని కిస్‌మిస్ పళ్ళు, బాదంపప్పులు పొట్లం కట్టుకుని తీసుకొచ్చాడు. సంచి దగ్గర లేదు. బహుశా వాళ్ల దేశస్థుడెవరినో అడిగి తెచ్చుంటాడు.

ఇవాళ ఇంట్లో చాలా పనులున్నాయి. ఎవరినీ చూడ్డానికి వీలుండదు అని జవాబిచ్చాను.

నా జవాబు విని రహమత్ విచారంతో ఉండిపోయాడు. నిరాశతో ఒక్కసారి నా వైపు చూశాడు. "సలామ్ బాబూ" అంటూ బరువుగా గడపదిగి బజార్లోకి వెళ్లాడు.

అప్పుడు అతని బాధను చూసి నా హృదయం అవ్యక్తావేదనతో తపించి అతన్ని తిరిగి పిలుద్దామా అని అనుకుంటుండగా ఇంతలో తనంతట తానే తిరిగొస్తున్నాడు. "ఈ ద్రాక్ష, కిస్‌మిస్, బాదంపప్పులు పాప కోసం తెచ్చాను. ఇవిగో ఇవి పాపకు ఇవ్వండి" అన్నాడు. నా దగ్గరకు వచ్చి.

నేను అతని చేతిలోని పొట్లాలు తీసుకుని వాటికి డబ్బు ఇవ్వబోయాను. అతను దాన్ని తీసుకోలేదు. "బాబుగారూ, చాలా మేలు చేశారు. డబ్బు ఇవాళ ఉంటుంది. రేపు పోతుంది. కానీ మీ ఉపకారం మాత్రం శాశ్వతంగా ఉంటుంది" అని మళ్లీ కాసేపాగి "బాబుగారూ మీ పాపతోటిదే మా దేశంలో నాకూ ఒక పాపాయి ఉంది. మీ అమ్మాయిని చూసినప్పుడల్లా నాకు మా పాప గుర్తుకువస్తుంది. అందువల్ల పాపకు పప్పులు పెట్టి చూసిపోవడానికి వస్తుంటాను. అంతేకాని మీ ఇంటికి సరుకులు అమ్ముకోవడానికి రావడం లేదు" అన్నాడు.

అలా చెబుతూ చెబుతూనే తన చొక్కాలో చెయ్యి దూర్చి రొమ్ము దగ్గర నుంచి ఒక మురికి కాగితపు ముక్కను బయటికి తీసి అతి జాగ్రత్తగా దాని మడతలన్నీ విప్పి రెండు చేతులతో పట్టుకుని నా టేబుల్ మీద పరిచాడు.

ఆ కాగితం మీద ఒక పసిపాప అరచేతి ముద్రలు అద్ది ఉన్నాయి. అవి ఫొటో తీసినవి కావు. తైలవర్ణంతో చిత్రించిన చిత్రాలు కావు. కేవలం చేతులకు ఇంత మసిపూసి కాగితం మీద అద్దించిన గురుతులు మాత్రమే. రహమత్ తన పసిపాప స్మృతిచిహ్నంగా ఆ అరచేతి ముద్రలను వెంట తెచ్చుకున్నాడు. ఆ స్మృతిచిహ్నాన్ని చొక్కా లోపల తన హృదయం వద్ద భద్రంగా దాచుకుని ప్రతి సంవత్సరం వచ్చి కలకత్తా సందుగొందుల్లో తిరిగి వ్యాపారం చేసుకుంటుంటాడు. మసితో అద్దించిన ఆ చేతి ముద్రలు పాపాయికి దూరమయి నిరంతరం దేశ సంచారం చేస్తున్న ఆ కాబూలీవాలా విశాల వక్షస్థలంలో అమృతాన్ని చిలికిస్తున్నాయి.

ఆ కాగితాన్ని చూసి నా కళ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి. ఇక దాంతో అతనొక పండ్లు అమ్ముకుంటూ తిరిగే పేద కాబూలీవాడని, నేను ఒక సంపన్న కుటుంబంలో పుట్టిన ధనవంతుడననే భేదభావం నాలో నశించింది. కానీ నేనతని కంటే ఏమంత అధికుణ్ణి. అతను కూడా నాలాగే ఒక తండ్రి. ఇద్దరమూ సమానులమే అన్న అనుభూతి నాలో జనించింది. ఎక్కడో దూరాన పర్వతాలమధ్య వాసం చేస్తున్న అతని చిన్నారి పాపాయి పార్వతి హస్తముద్రలు మా మినీని నాకు జ్ఞాపకం చేశాయి. అందరూ వద్దని అభ్యంతరపెట్టారు. కానీ వాటిని పట్టించుకోకుండా వెంటనే లోపలి నుంచి మినీని బయటికి పిలిపించాను. మినీ పెండ్లిదుస్తులు, నగలు నత్రా ధరించి కాళ్లకు పసుపు పారాణులతో పెండ్లి కూతురులా ముస్తాబై నునుసిగ్గుతో నా సరసన వచ్చి నిలబడింది.

మినీని చూసి కాబూలీవాలా రహమత్ నిశ్చేష్టుడయ్యాడు. ఆమెతో మునుపటిలాగా స్వతంత్రించి మాట్లాడలేకపోయాడు.

చివరకు నవ్వుకుంటూ "పాపా, అత్తవారింటికి వెళ్లిపోతున్నావు కదూ?" అని అన్నాడు.

మినీకి ఇప్పుడు అత్తవారిల్లంటే ఏమిటో తెలుసు. అందువల్ల మనుపటిలాగా జవాబు చెప్పలేకపోయింది. రహమత్ ప్రశ్నకు ఆమె ముఖం సిగ్గుతో జేవురించింది. కాబూలీవాలాతో మిని ఆ ప్రథమ పరిచయదినం నాకు గుర్తుకొచ్చింది.

మిని వెళ్లిపోయిన తర్వాత ఒక వేడి నిట్టూర్పు వదిలి రహమత్ అక్కడే నేలమీద కూర్చున్నాడు. మినిలాగ తన కూతురు కూడా ఇలా ఎదిగి ఉంటుందనీ, తాను ఆమెతో కొత్తగా మళ్లీ పరిచయం చేసుకోవాల్సి ఉంటుందని ఊహించుకుంటున్నాడు. బహుశా వాని హృదయంలో చిన్న నాటి ఆ చిట్టి పాపాయి ఇక తనకు కనిపించదు కాబోలు అన్న భావాలు ఉదయించి ఉండవచ్చు. ఈ ఎనిమిది సంవత్సరాలలో అక్కడ ఇంటి వద్ద ఎలా ఉందో? ఏమి జరిగిందో! శరత్కాల బాలార్కుడు తన స్నిగ్ధకిరణాలను లోకం మీద ప్రకాశింప చేస్తున్నాడు. మా ఇంట్లో పెండ్లిపందిరి పచ్చని తోరణాలతో కళకళలాడుతోంది. సన్నాయి మోగుతోంది. రహమత్ కలకత్తాలోని నా గదిముందర చతికిలబడి మరుభూములు పర్వతశ్రేణులతో కూడిన ఆఫ్ఘనిస్తాన్ దృశ్యాలను హృదయఫలకంలో చిత్రించుకుంటున్నాడు.

నేను జేబులోంచి నోటొకటితీసి అతనికి ఇచ్చి "రహమత్! స్వదేశానికి తిరిగి వెళ్లి మీ అమ్మాయిని కలుసుకో. మీ ఇద్దరి కలయిక మా మినీకి సౌభాగ్యాన్ని కలిగిస్తుంది".

రహమత్‌కు డబ్బు ఇచ్చినందువల్ల పెండ్లి ఆడంబరాలు ఒకటి రెండు తగ్గించుకోవలసి వచ్చింది. అనుకున్నన్ని విద్యుద్దీపాలు అమర్చలేకపోయాను. మిలిటరీ బ్యాండును పిలిపించడం మానుకున్నాను. ఇంట్లో స్త్రీలు కోపంతో ఏమేమో గొణుక్కున్నారు. పోనీ వాళ్లు గొణుక్కుంటే గొణుక్కున్నారు. రహమత్ ఎక్కడో దూరదేశాన ఉన్న తన కుమార్తెను తిరిగి కలుసుకుంటున్నందుకు సంతోషము, అపూర్వంగా ప్రకాశిస్తున్న మంగళకాంతులతో మా మిని శుభకార్యం శోభాయమానంగా పరిసమాప్తమైంది అన్న సంతృప్తిని పొందగలిగాను.

★

రవీంద్ర సంగీతం

- బాలాంత్రపు రజనీకాంతరావు

రవీంద్రనాథుడు అనేక రంగాలలో స్థితప్రజ్ఞుడు. ఆధునిక భారత సాహిత్యకారులలో మహనీయుడు. విశ్వకవిగా విఖ్యాతుడైన వేదాంతి, నవలాకారుడు, నాటకకర్త, సమకాలీన రాజకీయతత్వ విధులలో, సాంఘికశాస్త్రవేత్తలలో, విద్యాకోవిదులలో అగ్రగణ్యుడు. అంతేకాదు, ఆయన అత్యుదాత చిత్రాలను చిత్రించే శిల్పికూడ. విశ్వభారతి అను పేరుతో తాను స్థాపించిన విశ్వ కళాసంస్థను నిర్వహించి పోషించడంలో విరతిలేని ప్రయాణములూ, రచనా, చిత్ర సాహిత్య సంగీత వ్యాసంగమూ కల్పించుకుంటూ, ఆయన నిత్యకృత్యముగా అహోరాత్రులు పాడుకున్న పాటలే అద్భుత విశ్వపు సృష్టికర్తగా అత్యంత సన్నిహితంగా ఆడుకున్న స్వేచ్ఛాలాపములే రవీంద్ర సంగీతమైనవి.

బాల్యం నుంచీ రవీంద్రుడు ఉత్తరాది శాస్త్రీయ సంగీతసంప్రదాయంలో శిక్షణ పొందినవాడు. శతాబ్దాల నుండి ఈ సంప్రదాయంలో అనేక గేయ రచనారీతులుద్భవించి వర్ధిల్లుతూ వచ్చాయి. రవీంద్రునికి తన బాల్యం నాటి శాస్త్రీయ సంగీత రచనలలో బాహ్యాడంబరాలతో నిండిన రసహీనమైన ధోరణులు కనిపించాయి. అవి ఏ విధమైన చైతన్యముగాని, ఆత్మోత్తేజకమైన కల్పనావిస్తృతి కానీ లేక, దంభముతో ఆలపించే స్వరవిన్యాసాలు అనిపించాయి.

బాల్యంలో శాస్త్రీయసంగీతాన్ని శ్రద్ధాభక్తులతో అభ్యసించిన రవీంద్రుడు నాటి సంగీతంలోని ఆడంబర విన్యాసాలపైకి విప్లవం లేవనెత్తాడు. ఈ విప్లవం వినాశాత్మక విమర్శకాదు. సృజనాత్మకం.

సంగీత సరస్వతిని బంధించిన ప్రక్రియాత్మక శృంఖలాలను విడగొట్టి వందలకొలది నూత్నాలంకారాలతో ఆ దేవీమూర్తిని అర్చించాడు. రవీంద్రుని ఈ గేయ రచనావ్యాసంగాన్ని చారిత్రక కాలానుక్రమంగా ఇక్కడ వివరింప ప్రయత్నిస్తాం.

దాదాపు 1881 నుంచి 1941 వరకు సుమారు 61 సంవత్సరాలు రవీంద్రుని సంగీత రచన సాగింది. ఇది ప్రధానంగా మూడు యుగాలు. మొదటిది 1881 నుంచి 1900 వరకు. ఈ కాలంలో ఆయన చేసినవి భారతీయ శాస్త్రీయ సంగీతాన్ని అనువదించి చేసిన రచనలు. ధ్రుపద్ భక్తిరసాత్మకమైన సాహిత్యంతో ఒక రాగభావమును విలంబిత, మధ్యమ, ద్రుతకాలములలో క్రమంగా విన్యసించే శాస్త్రీయ రచన. ఇది బహు ప్రాచీనప్రక్రియ. మధ్య యుగ ముస్లిముల కాలంలో ధ్రుపద్‌పైన విసుగుపుట్టిన విద్యాంసులు టుమ్రీ, టాప్పా, ఖ్యాల్‌వంటి శృంగారేతివృత్తంగల రచనలను అవలంబించారు. రవీంద్రుడు ఈ కాలంలో టాగూర్ కుటుంబంలోని తన సోదరీసోదరులతో కలిసి, రాధికా మోహనగోస్వామి, జదూభట్టా, శ్రీకాంత సింహా మున్నగు శాస్త్రీయ సంగీత విద్వాంసుల వద్ద శిక్షణ పొందుతూ వుండేవారు. అప్పటిలో ప్రచారంలో వున్న, తాను నేర్చుకున్న ప్రసిద్ధ శాస్త్రీయరచనల్లోని ధ్రుపద్, ఖ్యాల్, టుమ్రీ మొదలైన వీటికి హిందూస్థానీ సాహిత్యానికి బదులు వంగసాహిత్యం కూర్చేవారు. ఆ విధమైన రవీంద్రుని రచనల్లో శాస్త్రీయ తాన, గమక, విస్తృత ప్రస్తారాలను వదిలేసి, సాహిత్యభావానికి, మూల హిందీరచనలలో లేని ప్రాధాన్యాన్ని కలిగించారు.

రెండవ యుగం 1901 నుంచి 1920 వరకు. ఇది ఆయన వివిధ ప్రయోగాలను చేసిన యుగం. రాగరాగిణుల ప్రాతిపదిక రూపాలను ఆధారంగా తీసుకోవడం తప్ప, హిందూస్థానీ శాస్త్రీయ వనరులపై ఆధారపడడం తగ్గింది. సొంత సంగీత రచనలు ప్రారంభమయ్యాయి. గీతాంజలి, గీతీమాల్య, గీతాళి అనే సంపుటాలలో దేశమంతటా వ్యాప్తిచెందిన గేయాలూ, ఇంకా అనేక సుప్రసిద్ధ గేయాలూ ఈ కాలంలో తయారైనవే. 1905 నాటి వంగవిభజన సమయంలోనే ఆయన దేశభక్తి గేయాలలో చాలా భాగమును రచించారు. ఆయన షడ్తాళప్రయోగరచనలన్నీ ఈ కాలానికి చెందినవే. నేటి భారత జాతీయగీతమైన 'జనగణమన' 1912 ప్రాంతంలో గురుదేవుడు ఆంధ్రదేశంలోని మదనపల్లిలో వుండగా రచించారు.

మూడవ యుగం 1920 నుండి 1941 వరకు. ఇది చాలా ప్రధానమైన యుగం. ఈ కాలంలోనే రవీంద్రుడు సంగీత రచయితగా ఒక విప్లవాన్ని సాధించాడు. "హిందూస్థానీ సంగీతాన్ని సంప్రదాయ శృంఖలాలలో బంధించే నిరంకుశుల కాఠిన్యాన్ని నేను సహింప"నని తానే అన్నాడు. ఒక్కొక్కసారి ఒకే రచనలో సాహిత్యభావంలోని రంగుల ఫిరాయింపును అనుసరించి వివిధ రాగాల ఛాయలు మిశ్రితాలై కనపడతాయి. అంతవరకు అటువంటి వశృంఖలతను లక్షణవిరుద్ధమని పండితులు మన్నించేవారు కారు. ఆ తర్వాత, ఒక్కొక్కసారి శాస్త్రీయ రాగధోరణికి పక్క పక్కనే జానపద గేయధోరణి చేరుతూ, మరొకసారి రెండూ గంగాయమునా సంగమంలా క్రమంగా కలిసిపోయి, రవీంద్రసంగీతపు శైలి ఒక స్పష్టరూపం దాల్చింది. ఈ విధంగా పాత సంప్రదాయాలను ధిక్కరించిన నిత్యనూతన రచనల సృజనోత్సాహంతో కూడుకొన్నది మూడవయుగం. ఈ యుగం పూర్తయ్యేనాటికి (1940నాటికి) రవీంద్రసంగీతం వంగదేశంలోనేకాక, విశ్వభారతీ శిష్యులద్వారా, రేడియో, గ్రామఫోనుల ద్వారా భారతదేశం అంతటా ఇంటింటా సుపరిచితమైపోయింది.

భారతీయ సంగీతచరిత్రలో ఆయన కనిపెట్టిన ఆరు కొత్తతాళాలు : ఝంపక, షష్ఠి, రూపకా, నబతాళ్, ఏకాదశి, నబపంచ. రవీంద్ర సంగీత రచనలు సులభ తాళములలోనూ దుష్కర తాళములలోనూ కూడా ఉన్నవి. భారతదేశ వంగరాష్ట్రంలోనేకాక, పాకిస్తాన్ వంగరాష్ట్రంలో కూడా రవీంద్ర సంగీతం ప్రజా జీవనంలో ఒక భాగంగా కలిసిపోయింది. రవీంద్రుడు పంజాబ్, మహారాష్ట్ర, గుజరాత్, తమిళ, ఆంధ్ర, కర్ణాటక సంగీత విద్వాంసులను విని ఆనందించడమే కాక, వారివారి భాషలలోని గేయాల వరుసలలో కూడా కొన్ని వంగగేయాలను రచించారట. ప్రసిద్ధ ఆంధ్రవైణికులు కీర్తిశేషులు శ్రీ తుమరాడ సంగమేశ్వరశాస్త్రి రవీంద్రునితో అటువంటి సహచర్యం పొందిన విద్వాంసులలో ఒకరు.

టాగూర్ రచించిన గేయాలు దాదాపు రెండువేల ఐదువందలు వుంటాయి. ఇవి ప్రధానంగా రెండు విధములు : కొన్ని కవితా ప్రధానములు, కొన్ని సంగీత ప్రధానములు. భక్తిగీతాలు, దేశభక్తిగేయాలు, ప్రణయగీతాలు, రుతుగీతాలు మొదటి విధానికి చెందినవి. వీటిలోని కవితారసవ్యంజనకు సంగీతం ఉపకరణం మాత్రమే. ధ్రుపద్, ధమార్, ఖ్యాల్, టుమ్రీ, టప్పా, జానపదగేయరీతులు రెండవ విధము. వీనిలో కవితకన్న సంగీతానికి ఎక్కువ ప్రాధాన్యం. ఇవి కాక, మైథిలీ ప్రాంతీయ భాషలో రాసిన భానుసింహ పదావళి, వైదిక ప్రార్థనా బుక్కులు, బాల గేయాలు, హాస్యగేయాలు, ఉత్సవ సంప్రదాయగేయాలు, యవ్వన గీతావళి, పాశ్చాత్య సంగీత ధోరణులలోను, ప్రాంతీయ సంగీత పద్ధతులలోను చేసిన రచనలు, నూతన ఛందోరీతులు వున్నాయి.

శాంతినికేతన గురుకులంలో ఉదయాస్తమయములా, రుతువురుతువునా, మాసమాసమునా వచ్చే పండుగలకూ, ఉత్సవాలకూ, వేడుకలకూ, గురుదేవుని సోదరుడు దినేంద్రనాథ ఠాకూర్ ఆ గీతాన్ని వాద్యబద్ధం చేసి, సంగీతాన్ని లిపిబద్ధం చేసేవారు. సంగీత నాటికలు, నృత్య నాటికలు శాంతినికేతనంలోని వసంత సుమవికాసాలలో పల్లవశకుంత మర్మరాలలో అపూర్వ కళా ప్రదర్శనాలుగా విరాజిల్లేవి.

విశాల విశ్వపు అపార భౌతిక సంపదా, ఆధ్యాత్మిక తత్వవిచారంతో కూడిన విమర్శా, వేర్వేరు రుతువులలో ప్రకృతిదేవి వివిధావతారాలలో భీకరగర్జనలు మొదలు రమణీయ శరత్ప్రశాంతి వరకూ గల వివిధావస్థలు రవీంద్ర సంగీతమైనవి. ధూళి ధూసరిత వస్త్రాలు తాల్చిన యాత్రికుడు, పతి ఆగమనమును ఎదురుచూచు కొత్త పెళ్లికూతురు, బీడునేలను శ్రమపడి దున్నుకొనే హాలికుడు, రాళ్లు పగులకొట్టి రహదారులు వేసే శ్రామికుడు, సొంత నేలపైన కొనను కోసం బెంగతో తిరిగి వచ్చే కొంగలబారు, తుట్టతుది వీడ్కోలుచెప్పే పక్కింటి మానిసి, ఇన్ని రమణీయ కల్పనలు ఆయన గేయాలలో ప్రకృతి సహజములై మానవతా ద్యోతకములై దర్శనమిస్తాయి. అందుకే, అనిపిస్తుంది "మూర్తిరహితమైన పరబ్రహ్మ స్వరూపమునన్వేషించిన ఈ రవీంద్రుని గేయాలలోని మానవతా, ప్రకృతి, మూర్తిమంతములై భాసిచే రచనలు కోకొల్లలు" అని.

పడవలు నడిపే బెస్త, పొలము దున్నే రైతు వంటి పామరుల మొదలు, వ్యుత్పన్నమతులైన పండితుల వరకూ ఆయన గేయాలకు పరవశులు కానివారు లేరు. ఆ పాటలకు అనుగుణంగా పసిపిల్లలు నాట్యమాడుతారు. ప్రేమికులు వాటిని ఏకాంతంలో కూడబలుక్కొంటారు. వయసు మళ్లినవారు వాటిలో ఆత్మ సంయమనమూ, ఆనందమయ బ్రహ్మతేజమునూ దర్శిస్తారు. రవీంద్రుని సంగీతం ఒక ఆశ్వాస సరసి. ఒక ఆనంద నిర్ఝరిణి.

(డిఆర్ అభినందన 'అక్షర' నుంచి...)



భారత దేశ వ్యాపితంగా తన కవితా ప్రభావం ప్రసరించడమే గాక అన్నిభాషా కవులనూ ప్రభావితం చేసిన ఏకైక ఆధునిక కవి రవీంద్రనాథ్ టాగూర్. అంతకుముందు కాలంలోని కబీరు, నానక్ తుకారాం, మీరాబాయి వంటి వారు కూడా భక్తులుగా తప్ప కవులుగా దక్షిణాది వారికి పరిచితులు కాదు. ఆ ఘనత దక్కిన ఏకైక భారతీయ కవి రవీంద్ర నాథ్ టాగూర్ మాత్రమే. ప్రసిద్ధ వామపక్ష చరిత్ర కారుడు కె.ఎన్. ఫణిక్కర్ ఈ విషయం చెబుతూ తమ మళయాళ భాషలో మహాప్రసిద్ధుడైనందువల్ల థోల్ నారాయణ మీనన్ టాగూర్ ప్రభావానికి గురైనట్టు గుర్తు చేశారు. ఒరియాలో కాళిందీ చరణ్ పాణిగ్రాహి, అన్నదా శంకరరాయ్, వైకుంఠనాథ్ వంటివారు ఈ ప్రభావంతోనే సబూజ్ (హరిత) కవులుగా ఏర్పడి కవితా సృజన చేశారు. హిందీలో నిరాలా, ప్రసాద్, పంత్‌త్రయం కూడా రవీంద్రుని ప్రభావంతోనే ఛాయావాద్ అనే కాల్పనిక కవిత్వ శాఖను నడిపించారు. ఇక తెలుగు కవిత్వంలో ఆధునికతకు ఆద్యుడైన గురజాడ అప్పారావుకు టాగూర్ పట్ల అమిత గౌరవం. మన కవులకే మార్గదర్శకుడైన గురజాడనే ప్రభావితం చేయడంలో టాగూర్ గొప్పతనం తెలియడం లేదూ? 1908 నాటికి తెలుగు కవులను టాగూర్ జాతీయ భావన ఎంతగానో ఉత్తేజపర్చినట్టు సిఆర్ రెడ్డి రాశారు.

భారతీయ పునర్వికాస కవీంద్రుడు

-తె ర

గురజాడ టాగూర్ కన్నా మూడు నెలలు మాత్రమే చిన్న. అయితే కవిత్వపరంగా, విజ్ఞానపరంగా మాత్రం ఆయన పట్ల చాలా గౌరవం. ఆయనతో పరిచయం పెంచుకుని ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాడు. వాడుక భాష కోసం తను జరుపుతున్న పోరాటంలో టాగూర్ సలహాలూ సూచనలూ వుపయోగించుకున్నాడు. బెంగాలీ సంపాదకుడు శంభు చంద్ర ముఖర్జీ తమ కవిత్వంలో వస్తున్న కొత్త ధోరణులను గురజాడ దృష్టికి తెచ్చాక టాగూర్‌ను ప్రత్యేకంగా అధ్యయనం చేయసాగారు. 'ప్రజల భాషలో రాయడం ఇష్టంలేని వాడు రాయడమే మానుకోవచ్చని' టాగూర్ అన్న మాటలు ఆయనను చాలా ఉత్తేజపర్చాయి. 1912లో కోల్‌కత్తాలో టాగూర్‌ను కలిసిన తర్వాత గురజాడ ఇలా రాశారు:

కవి రాజైన రవీంద్రునికి బంగాళా చూపిన మిక్కుటపు పేరు పొరలేని భక్తి ఏ రాజెరుగును. ఆ మహాకవి భాషను యెత్తాడు. తలపుల నెత్తాడు. కీర్తి వెన్నెలల దిక్కుల నింపాడు. అది తన కీర్తి అని వంగ దేశము గుర్తించినది. అతను తన సిరియని గర్వించింది. దేవుడని పూజించింది.

"టాగూర్ శాంత స్వభావి. మాట పొందిక మహ మెత్తన. నాజూకైన ముఖ లక్షణాలు. తేటగా సున్నితంగా నవ్వుతారు. మాటలాడేప్పుడు పురుషత్వం తొణకిసలాడుతుంది. ఒక విధమైన మనో నిశ్చయం ప్రస్ఫుటమువుతుంది. మన వీరేశలింగం గారి మనఃప్రవృత్తికిది పూర్తి విరుద్ధం. ఆయన వలె రవీంద్రుడు గడబిడగా మాట్లాడడు. సంభాషిస్తున్నప్పుడు జీవం తొణకిసలాడుతూ వుంటుంది. ఆయన ప్రార్థన చేస్తున్నప్పుడు ప్రవచిస్తున్నప్పుడు కంఠం శ్రావ్యంగా వుంటుంది. రవీంద్రునిది వినసొంపైన గొంతుక" టాగూరు కవిత్వాన్నే గాక వ్యక్తిత్వాన్ని స్వరాన్ని స్వరూపాన్ని కూడా గురజాడ అంతటి వ్యక్తి ఇంత పరవశంతో వర్ణించారంటే ఆయన ప్రగాఢ ముద్ర తెలుస్తుంది.

గురజాడ తర్వాత అంతటి వాడుగా పేరు పొందిన రాయప్రోలు సుబ్బారావు 1915 నుంచి 1917 వరకూ రెండేళ్ల పాటు టాగూర్ దగ్గరే శాంతినికేతన్‌లో గడిపారు. ఫిడేలు రాగాలతో సరికొత్త కవిత్వాన్ని తెలుగులోకి తెచ్చిన పఠాభి కూడా శాంతినికేతన్ విద్యార్థి. ఆ రోజులలోనే ఆయన టాగూర్ ప్రకృతి ప్రేమ వగైరాలపై తిరుగుబాటు చేశారని ఎవరో రాస్తే దాన్ని పఠాభి గట్టిగా ఖండిస్తూ టాగూర్‌పై తన గౌరవాన్ని పునరుద్ఘాటించారు. సంచలన కవి చలం కూడా టాగూర్‌ను అనువదించడమే గాక ఎంతగానో గౌరవించారు.

ఇక ఆయన రచనలను అనువాదం చేశారు కూడా. వీరందరి భావ కవిత్వంపైన ప్రకృతి ఆరాధనపైన టాగూర్ కవిత్వ ప్రభావం అపారంగా వుంటుంది. వేంకట పార్వతీశ్వర కవులు టాగూరును మొదట్లో అనువదించి జనానికి అందుబాటులోకి తెచ్చారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి, చలం, దువ్వూరి రామిరెడ్డి కూడా టాగూరు పట్ల ఎంతగానో ఆకర్షితులైనారు. ఆ ప్రభావానికి తలవంచక పోగా ప్రతికూలత చూపిన ఒకే ఒక గొప్పకవి శ్రీశ్రీ. ఆయన టాగూరుపై అదే పనిగా విమర్శలు రాస్తూ వచ్చారు. ఇందుకు చలం గట్టిగా సమాధానం ఇస్తే తను మారబోనని శ్రీశ్రీ చెప్పారు. టాగూర్ నా అలెర్జీ అంటూ ఆయన పనిగట్టుకుని రాసింది చూస్తే ఇప్పటికీ ఆశ్చర్యం కలుగుతుంది. శ్రీశ్రీకి భిన్న ధృవంగా ఖ్యాతికెక్కిన విశ్వనాథ కూడా టాగూర్‌ను పెద్దగా నెత్తిన పెట్టుకోరు.

టాగూర్‌లోని స్వేచ్ఛా ప్రియత్వం, సౌందర్యారాధనా దృష్టి, దేశ భక్తి భావన ప్రయోగశీలత ఆయనను తెలుగు వారికి సన్నిహితం చేసినట్టు కనిపిస్తుంది. జీవితంలో వైవిధ్యాన్ని టాగూర్ ఆహ్వానించారు, ఆవిష్కరించారు కూడా (కవితలు చూడండి). జీవితాన్ని తృణీకారంగా చూసే వైరాగ్య భావనను టాగూర్ ఆదరించలేదు. అయితే ఆయన జీవన తాత్వికత ఏమిటన్నది ఎప్పుడూ నిగూఢంగానే మిగిలిపోయింది.

1962లో రాయప్రోలు సుబ్బారావు టాగూర్ ప్రభావం భావ కవిత్వానికే పరిమితమన్నట్టు రాస్తే కె.వి.రమణారెడ్డి దానితో విభేదిస్తూ ఆయన దృక్పథం వామపక్ష అభ్యుదయ వాదులకే దగ్గరగా వుంటుందని వివరించారు. "కమ్యూనిస్టు సాహిత్యం దూకి పడిన తర్వాత టాగూరు ప్రభావం అంతరించిందనడం అబద్ధమే గాక ఆత్మాపచారమని తెలుసుకోవాలి. రవీంద్రుని జాతీయాంతర్జాతీయ భావనా వైఖరులకు భారతీయ సాహిత్యంలో నిజమైన వారసులు అభ్యుదయ రచయితలు. ప్రజా సంక్షేమం. రాజకీయ, ఆర్థిక భావ స్వేచ్ఛలు, ఫాసిజం నిరసన,

సామ్యవాద వ్యవస్థలో ప్రత్యక్షమైన సంస్కృతీ మూల్యాల గుర్తింపు ఇవి వ్యక్తిగా రవీంద్రుని మూర్తిని పెంచగలిగాయి' అని కె.వి.ఆర్... రాశారు. "రవీంద్రుని మర్మవాదం, అధ్యాత్మిక భావన, ఎంత మధురమైనా అభ్యుదయ రచయితల మదికెక్కలేదు. కారణమేంటంటే వారు ఎక్కువగా భౌతికవాదులు. మానవలోకాన్ని మించి చుక్కలు గుట్టు విప్పేందుకు మబ్బుల వలువలు వలిచేందుకు సృష్టి మర్మం కనుగొనేందుకు తమ భావాలను వాళ్ల గాలికి వదలలేదు. ఈ అభిప్రాయాన్ని కాస్త వికటంగా ప్రకటించడానికే 'గీతాంజలి' కంటే 'వాడే వీడు' అనే అపరాధ పరిశోధక నవల గొప్పదని శ్రీశ్రీ అనవలసి వచ్చింది. మహనీయులు విడిచి వెళ్లిన సంస్కృతీ ధనంలోని పొల్లును తీసి నెల్లును స్వీకరించే గుణం రచయితలది" ఇంతకూ టాగూర్ తొలిదశలోని కవిత్వాన్ని భావ కవులు స్వీకరిస్తే తర్వాతి కాలపు సామాజిక చైతన్యకవితను అభ్యుదయ కవులు ఆరాధించారు. అందుకే ఈ వైరుధ్యం అనివార్యం.

'గీతాంజలి'ని ఎందరు తెలుగులోకి అనువదించారో లెక్కలేదు. ఇప్పటికీ అది అంతగా ఆకర్షిస్తూనే వుంటుంది. విశిష్టాద్వైతాన్ని విలక్షణ శైలిలో ఆవిష్కరించిన రచనగా చెప్పే గీతాంజలి ఆంగ్లానువాదాలు కూడా తెలుగు నాట బాగా ప్రాచుర్యం పొందాయి. ఆ ప్రభావంతోనే రవీంద్ర భారతి మొదలు వూరూరా ఆ పేరిట పాఠశాలలు కూడా వెలిశాయి. కొన్ని దశాబ్దాలలో తెలుగు . వారు చాలా ఎక్కువగా పెట్టుకున్న పేర్లలో రవి ఒకటైంది. గీతాంజలి కవిత్వ సారాంశం ఏమైనా సౌందర్యం మాత్రం ఆకర్షిస్తూనే వుంటుంది. అందులోని ఒక గీతం భారతదేశంలో ప్రగతిశీల భావకుల స్వేచ్ఛా ప్రియుల అనధికార ప్రణాళికగా మారిపోయింది. (బాక్సు చూడండి).

నోబుల్ బహుమతి వచ్చినందువల్ల గీతాంజలి గురించి ఎక్కువగా చెప్పుకున్నా టాగూర్ మొత్తం వెయ్యికి పైగా కవితలు రాశాడు. రవీంద్ర సంగీతంలోని వేలాది పాటలు రాయడమే గాక తనే బాణీలు కట్టాడు. 1896-1901 మధ్య కాలంలో కణిక, కల్పన, నైవేద్య వంటి కవితా సంపుటాలు వెలువరించాడు. ఈ సంపుటాల్లో ఒక అదృశ్య అస్పష్ట నాయికను దృష్టిలో పెట్టుకుని రాశాడు. ఆమెను కొన్నిసార్లు మానవి అని, మరికొన్ని సార్లు విచిత్ర వ్యక్తి అని, ఇంకా కొన్నిసార్లు సౌందర్య రసాధిదేవత అని పలు రకాలుగా చిత్రిస్తూ వచ్చాడు. ఈ కవితలు ప్రేమ సౌందర్యాల మయంగా వుండి మన భావ కవిత్వానికి వరవడి పెట్టినట్టు అగుపిస్తాయి. 30 ఏళ్ల ప్రాయంలో జీవితం నుంచి దూరంగా తన లోకంలో తనుండిపోయిన టాగూర్ మనస్తత్వం మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత చాలా మారిపోయింది. అప్పటి వరకూ ఆయన తను పెరిగిన నేపథ్యాన్ని బట్టి ప్రపంచం అంటే ఇష్టానుసారం నడుస్తుందని అనుకునేవాడు. కాని ఆ యుద్ధం తర్వాతే ఆయనకు మానవజాతి ఎదుర్కొంటున్న సవాళ్లు, సంక్లిష్టతలు తెలిసి వచ్చాయి. ఆదర్శ వాదం మాయమై వాస్తవికత పొటమరించింది. అప్పుడే ఆయన 'వెనక్కు తిరిగి చూసే సమయం' అన్న కవిత రాశాడు. తర్వాతి కవిత్వం రూపురేఖలు మారిపోయాయి. వాస్తవానికి గీతాంజలికి నోబుల్ బహుమతి వచ్చేనాటికే ఆయనలోని మార్మికవాదం మాయమైపోయిందని పరిశీలకుల అభిప్రాయం. అందులోనూ బంగ్లా భాష తెలిసిన వారికి టాగూర్ విభిన్నంగా ఆత్మీయంగా కనిపిస్తాడంటారు. చలాకా (కొంగల సమూహం) అనే కవితా సంపుటిలో టాగూర్ రమణీయ పద గుంఫనం, పద ప్రవాహం గోచరమౌతాయి. పలాతక్‌లో ఆయన జానపద శైలిని తీసుకుని మహిళల బాధలను గానం చేశాడు. రొమాంటిక్ కవిగా టాగూర్‌కు తిరుగులేదని విమర్శకుల అంచనా. బెంగాలీలో ఆయన తర్వాతే విష్ణుడే వంటి మార్క్సిస్టు కవులు, జీవానంద దాసు వంటి ప్రతీకవాదులు కూడా బాగా పేరు తెచ్చుకున్నారు.

1925-41 మధ్య ఆయన పూరబి, మహువా, పరిశేష్, సప్తన్, విచిత్ర, దిధిక, ప్రాంతిక, ప్రవాసిని, వనజాతక, రోగశయ్యాయ్, ఆరోగ్య, జన్మదినే, జీవన దేవత తదితర కావ్యాలు వెలువరించారు. పూరబి బలాక మహువా వంటి ఈ కవితా సంపుటాల్లో ఆయన ప్రకృతి పరిష్వంగం నుంచి ప్రపంచపుటావర్తంలోకి రావడం చూస్తాం. ప్రాంతిక, స్ఫేంజుతి వంటి కవితల్లో ఆయన ఫాసిజాన్ని గట్టిగా నిరసించడం కనిపిస్తుంది. మనిషిలో అమానుషత్వం అంత దారుణంగా వుంటుందని ఆయనకు ఐరోపాలో పర్యటించిన తర్వాత తెలిసి వచ్చింది. అప్పటి నుంచి ఆయన కవిత్వమే గాక బెంగాలీ కవిత్వం కూడా మారిపోయింది. జన్మదిన్ మానవీయ విలువలకు పట్టం కట్టిన మహోన్నత కవిత. బెంగాలీ సనాతన సంప్రదాయాలను ధిక్కరిస్తూ గద్య కవిత్వం అన్న దాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చింది కూడా టాగూరే. ఆయన ప్రేరణతోనే బెంగాలీ నూతన కవి లోకం సృజనలో పరవళ్లు తొక్కింది. వారంతా ఆయనకు వందనం చేశాకే తమ గురించి చెప్పుకుంటారు. ఇంతకూ టాగూర్ పీడిత ప్రజా కవి అని చెప్పడం కష్టమే గాని ప్రపంచ శాంతినీ, ప్రజాస్వామిక లౌకిక విలువలనూ కోరిన ప్రజాస్వామిక వాది అని సామ్యవాదాన్ని కూడా స్వాగతించిన దార్శనికుడని చెప్పక తప్పదు. నోబుల్ బహుమతి గ్రహీతగా వుండి ఫాసిజాన్ని వ్యతిరేకించడం, సోవియట్‌ను హర్షించడం చిన్న విషయాలు కాదు. ఆ అర్థంలో ఆయన నిజంగా విశ్వ కవీంద్రుడే.

మనోహర ప్రేయసిని తల్చుకొని రవీంద్రుడి హృదయ జగత్తులో ఉప్పొంగిన భావధార....

ఒక శూన్య సంతోషం నాలో నిండనీ
నా చేతిని నీ చేతిలోకి తీసుకో
అంతే చాలు
చీకటి పరుచుకునే నిశి వేళ
నా హృదయం నీదిగా చేసుకో
స్వేచ్ఛగా ఆడుకో
....

కృతకమైన అలంకారాలు, ఆడంబరాలు నిజమైన ప్రేమకు అడ్డుగోడలుగా నిలుస్తాయని, అనవసరమైన నిర్బంధాలు జీవన సహజత్వాన్ని దూరం చేస్తాయని రవీంద్రుడు భావించిన గీతం ఇది.

" ఈ పాపకి తల్లి యువరాజు దుస్తులు వేసింది
వజ్రాలు పొదిగిన బంధాలు కంఠం చుట్టూ వేసింది
ఇక ఈ పాప ఎలా ఆడుకుంటుంది?
ఈ దుస్తులు, ఈ అలంకారాలూ ఎప్పుడూ
అడ్డు వస్తూనే వుంటాయి
ఈ దుస్తులు మాసిపోతాయని,
ముడుతపడతాయని
ఎప్పుడూ భయమే
ప్రపంచానికి దూరంగా, కదలడానికి భయపడుతూ
నిల్చోవలసిందే!

భగవంతుని కృపావిశేషమే జీవిత సాఫల్యాన్ని ప్రసాదిస్తుందని ప్రకృతిలోని సుందరమైన ఉపమానాన్ని ఆధారంగా తీసుకుని రాసిన గీతం :

"నేనొక
నిర్మలమైన శరత్కాల మేఘ శకలాన్ని
ఈ విశాల ఆకాశంలో
ఊరకే పచార్లు చేస్తున్నాను
ప్రభూ! నీ ప్రచండ సూర్యకాంతి
నా జలాన్ని గ్రహించి
తనలో లీనం చేసుకోలేదు
ఎంత కాలమో మరిచిపోయింది
నీకు సమ్మతమైతే ప్రభూ!..."

రవీంద్రుడు ప్రకృతిని ఈశావాస్యంగా దర్శించినాడు. "మెరుపు మెరిస్తే, వాన కురిస్తే, ఆ కాలమున హరివిల్లు విరిస్తే" ఆయనకు ఒక అమోఘమైన సత్యం సాక్షాత్కరించేది. తన గీతాలన్ని నిశ్శబ్దం సముద్రంలో లీనమై ప్రభువుకి ఘటించిన అంజలిగా రూపొందాలని ఆయన కాంక్షించాడు.

గురుదేవ్ - రంగస్థలం

- కె. శాంతారావు

గాలి పీలిస్తేనే వదలగలుగుతాం

ప్రాణం నిలబడాలంటే ఉచ్ఛ్వాస నిశ్వాస ప్రక్రియలు నిరాఘాటంగా సాగవలసిందే.

జ్ఞానం కూడా అంతే. జ్ఞానం నిలబడాలన్నా, జ్ఞానంతో మనిషి మనిషిగా సమున్నతంగా ఎదగాలన్నా తెలియని విషయాలు తెలుసుకునేందుకు కొత్తవి నేర్చుకునేందుకు నిరంతరం శ్రమించాల్సిందే. నిత్యవిద్యార్థి కావాలి.

తెలుసుకున్న విషయాలు ఆచరణలో అన్వయించి ఫలితాలు సాధించాలి. వాటిని భిన్న భిన్న రూపాలతో ఆకర్షణీయంగా అభివ్యక్త పరిచి లోకాన్ని ఉత్సాహపరచాలి. జ్ఞానాన్ని దృఢచిత్తుల్ని చేయాలి. ఎప్పటివరకు కడవరకు. అప్పుడు ఆ వ్యక్తే మహాశక్తిగా ప్రకాశిస్తాడు, అదో గురుమార్గం.

అసాధారణ జ్ఞానాన్వేషణ, ప్రాపంచిక పరిశీలన అభివ్యక్తీకరణ సామర్థ్యం త్రివేణీ సంగమమై టాగూర్‌ను గురుదేవ్‌గా మలిచాయి.

కవిత్వం, సాహిత్యం, సంగీతం, చిత్రలేఖనం, నృత్యం, నాటకం ఇలా సర్వకళల్లో భారత ఆత్మేకాదు విశ్వమానవతా ఆత్మ తొణికిసలాడేది.

కనుకనే రవీంద్రుని కళలు నిత్య సత్యాలుగా ప్రత్యేకతను సంతరించుకుని పతాక స్థాయిలో నిలిచాయి.

ఇరవైఏళ్ల చిరుప్రాయంలో 'వాల్మీకి ప్రతిభ' అనే డ్రామా ఒపేరా (నృత్యనాటకం)ను రూపొందించాడు. ఒక బోయవాడు రామాయణ కావ్యాన్ని రచించే మహా రుషి ఎలా కాగలిగాడు? సరస్వతీ కటాక్షం ఎలా లభించింది? ఈ పరిణామంలో తన ఆటవిక లక్షణాలను ఎలా విసర్జించాడు. కరుణరస భూమికపై సాధనా సంస్కార ప్రవర్తనతో తేజోవంతునిగా ఎలా మారాడు? ఈ విషయాలన్నీ ప్రేక్షకులకు బలీయంగా చెప్పాలనే సంకల్పంతో కఠోర శ్రమకోర్చి దేశీయ, పాశ్చాత్య నాటక లక్షణాలను జమిలిగా ఉపయోగించుకున్నాడు. నటనలో, నృత్యంలో, సంగీతంలో నవ్యతను చూపించి ఆధునిక శిల్పానికి ఓ కొత్త రూపాన్ని ఇచ్చాడు. సంప్రదాయ కీర్తనలతో పాటు సుమధుర ఆంగ్లబాణీలను ఉపయోగించడం ప్రత్యేకాకర్షణ. ప్రేక్షక హృదయాలపై మనోజ్ఞముద్రను నాడే వేశాడు.

'చండాలిక' నృత్య నాటిక గురించి అందరికీ తెలిసిందే. సమాజం నుండి వెలివేయబడిన ఓ ఆదివాసీ పంచమకన్య చండాలిక నుండి దాహార్తి అయిన ఓ బౌద్ధ భిక్షువు నీరు తాగి తరించడం. పంచభూతాలకు లేని అస్పృశ్యత మానవులకెందుకు? యుగయుగాలుగా మానవుడు సాధించుకున్న వివేచన ఏమైంది?

నాకటం ద్వారా సమకాలీన సమాజానికి ఓ ప్రశ్న. ఓ సందేశం, ఒక సంస్కారం. ఒక ఉదాత్తమైన ఆచరణశీలమైన భావన గుండెల్లో గుడి కడుతుంది.

ఛండాలిక నృత్య నాటికను ప్రదర్శించని భారతీయ భాష వుండజాలదు.

కాగా, రవీంద్రుడు సృష్టించిన బాలల కథా సాహిత్యం ఎక్కువగా నాటక లక్షణాలు ఉండడం కద్దు.

అసలే పిల్లలకు నాటకాలంటే చాలా ఇష్టం. లేనివి ఉన్నట్టు ఊహించుకుని వాటిని వారికి వారే రూపొందించుకుని, తమకు తాముగా రూపాంతరం చెంది ఎన్నో ఆటలు ఆడుకుంటారు. రైలు ఆట, బస్ ఆట, దొంగా పోలీస్ ఆట, గద్దా కోడిపిల్ల ఆట, ఇలా ఎన్నెన్నో ఆటలు ఇప్పటికీ మనం చూస్తూనే వుంటాం.

నాటకం ప్రధానంగా దృశ్యమాధ్యమం. బాలల రంగస్థలం అంటేనే సృజన శీలరంగ స్థలం కనుక వారి తెలివితేటలను అందులో రంగరించి గుమ్మరిస్తే మరింత ఆసక్తి నెలకొంటుంది.

ఉదాహరణకు 'గెలుపెవరిది?' అనే కథలో కళింగదేశం పిల్లలు నదీ తీరంలో ఆడుకుంటూ ఉంటారు. అటుగా వంగదేశపు మహారాజు సైనిక పటాలంతో వెళ్తూవుంటాడు.

పిల్లలు రెండు జట్లుగా విడివడి యుద్ధం ఆట ఆడతారు. ఒకటి కళింగదేశం జట్టు, మరొకటి వంగదేశం జట్టు.

అంతలో రాజు సేద తీరేందుకు నది వద్దకు వచ్చి పిల్లల ఆట చూసి "యుద్ధంలో ఏ జట్టు గెలుస్తుంది?" అని అడుగుతాడు.

ఉభయజట్టులు ముక్త కంఠంతో కళింగదేశం జట్టే గెలుస్తుందని చెప్తాయి.

రాజుకు కోపం వచ్చి చీకటి పడేవేళకు ఎవరుగెలుస్తారో తెలుస్తుంది వెధవలకు అంటూ వెళ్లిపోతాడు.

పిల్లలు నదిలో నీళ్లతాగి మళ్లీ ఆడుకుంటూ ఉండగానే దూరాన చెలరేగుతున్న మంటలు కన్పిస్తాయి. హాహాకారాలు విన్పిస్తాయి (షాడో).

కొద్ది సేపటికి అదే తీరానికి మరల వంగదేశపు రాజు సైన్యంతో తిరిగి వస్తాడు. ఈసారి వారి చెంతన కళింగరాజు బంధీ అయివున్నాడు.

విజయ గర్వంతో పిల్లలతో "ఇప్పుడు చెప్పండి ఏ జట్టు గెలిచింది?" అని అడుగుతాడు.

పిల్లలు మళ్లీ ఐక్యంగా "కళింగదేశమేనండి" అంటారు. రాజు ఉగ్రుడై గర్జిస్తాడు.

విదూషకుడు సమాధానపరిచి అక్కడినుండి రాజును తోడ్కొని పోతాడు. కొంతదూరం పోయిన తర్వాత నిదానంగా రాజుతో ఇలా ప్రస్తావిస్తాడు. 'మనం మహాసామ్రాజ్యాన్ని గెలిచినంత సులువుగా పిల్లల మనసును గెలవలేం'.

చివరి వాక్కులో ఎన్నో అర్థాలు స్ఫురిస్తాయి. మహా సామ్రాజ్యాల కంటే పిల్లల హృదయాలు చాలా విశాలమైనవి. లోతైనవి. పిల్లల గుండెనిండా అకళంక దేశ భక్తి వుంటుంది.

క్రీడోత్సవమేకాదు వారిది తల వంచని సమరోత్సాహం కూడా.

సహజమైన ఈ లక్షణాలు నాటకంలో ప్రతిఫలించమంటే ఇంక చెప్పేదేముంది. విజృభింస్తారు.

వారికి కావాల్సిన పరికరాలు, కిరీటాలు, యుద్ధ సామాగ్రి, ఆహార్యం, విలాసాలు, వస్త్రాలంకరణ, కేశాలంకరణ, షోడో కోసం తెర, లైటింగ్ సాంకేతిక సహాయం అన్ని చకచకా చేసుకుపోయేవారు. ఆటలు, యుద్ధాలు, అభినయాలలో వారి శక్తియుక్తులను ఉపయోగించేవారు. దర్శకునిగా కొంత మార్గదర్శనం చేస్తే చాలు అల్లుకుపోయేవారు. అప్పుడు ఎవరికైనా అర్థమయ్యేదేమిటంటే ఇష్టమైన పనిలో వారి శక్తి సామర్థ్యాలు, వుత్సాహం ద్విగుణీకృతం అవుతాయి.

ఆ విధంగా ప్రజానాట్యమండలి నిర్వహించిన బాలల రంగస్థలం కార్యక్రమంలో యుద్ధం (గెలుపెవరిది?) నాటిక విజయవంతం అయింది.

★



కొత్త పాత

అనగనగా ఒక బొమ్మలు చేసే శిల్పి వుండేవాడు. అతని బొమ్మల్ని రాజభవనంలోని పిల్లలెక్కువగా కొనేవారు. ఏటేటా కోట ఆవరణలో బొమ్మల ప్రదర్శన జరిగేది. అందులో శిల్పనైపుణ్యానికి గాను గొప్ప గొప్ప బహుమతులిచ్చేవారు. ఆ బహుమతులలో ఎక్కువ భాగం ఈ శిల్పికే దక్కేవి.

ఆయనకి ఎనభైఏళ్లు వచ్చాయి. అప్పుడా నగరానికి కిషన్‌లాల్ అనే ఒక కొత్త శిల్పి వచ్చాడు. అతను యువకుడు. అతను బొమ్మల్ని ఒక కొత్త పద్ధతిలో చేసేవాడు. బొమ్మల్ని సగం సగమే నిర్మించి, ఒకానొక సొంత పద్ధతిలో రంగులు వేసేవాడు.

కొత్తతరం వాళ్లు "ధైర్యమంటే ఇదీ" అనేవాళ్లు.

పాతతరం వాళ్లు "ధైర్యం? ఎందుకో ఇది వట్టి దుస్సాహసం, గర్వం" అని జవాబిచ్చేవాళ్లు.

కాని, కొత్తతరాలలో కొత్త రుచులు పుడతాయి. రాచకన్యలు 'మాకు ఆ కొత్తరకం బొమ్మలే కావాలి" అని పట్టుబట్టేవాళ్లు.

వాళ్ల ముసలి దాదులు వాళ్ల పట్టుదలను సడలింపజూచేవాళ్లు. అయినా రాకుమార్తెలు పట్టిన పట్టు వదల్లేదు.

అప్పటినుండి ముసలివాని అంగడికి మునుపటిలాగా జనం గుంపులు గుంపులుగా రావడంలేదు. వస్తుందో రాదో తెలియని బల్లకట్టుకోసం నది ఒడ్డున గుడ్లు మిటకరించి చూస్తూ నిలబడే జనాల బారుల్లాగా ముసలివాని అంగడిలో అమ్ముడుగాకుండా మిగిలిపోయిన బొమ్మలు గుడ్లప్పగించి చూస్తుండేవి.

ఇలా రెండేళ్లు గడిచాయి. జనం ముసలి శిల్పి పేరే మర్చిపోయారు. రాజభవనంలో బొమ్మలమ్మే వాళ్లలో కిషన్‌లాల్ ముఖ్యుడైపోయాడు.

ఆ ముసలివాని హృదయం కుంగిపోయింది. తిండికి సంపాదించుకోవడమే కష్టమైపోయింది. అతని కూతురికి చాలాకాలం క్రితమే పెళ్లయింది. భర్తతో కాపురం చేసుకుంటోంది. ఆమె ఒకనాడు తండ్రిని చూడడానికి వచ్చి "మా ఇంటికి వచ్చేయ్ నాన్నా! నీ జీవితాన్ని హాయిగా సుఖంగా గడుపుకో" అని పిలుచుకెళ్ళింది.

ముసలివాని కూతురు పగలంతా ఇంటిపనులతో సతమతమైపోతూ వుండేది. అల్లుడు మట్టి ప్రమిదలు చేసి, చుట్టుపక్కల బస్తీలలో అమ్ముకొచ్చేవాడు.

మారే రోజులూ, రుచులూ ముసలివానికి అర్థం కాలేదు. అందువల్ల తన మనుమరాలు ఇంకా పసిపిల్ల కాదనీ, పదహారేళ్ల చక్కని పడుచని గుర్తించలేకపోయాడు. మనుమరాలు రాగానే అతని మీదపడి, మెడ కావలించుకునేది. ఆ స్పర్శకు అతని ఎముకలు సంతోషంగా జలదరించేవి.

ఆమె "తాతా నాకో బొమ్మ చేసిపెట్టు" అని అడిగేది.

"నా బొమ్మలు నీకు నచ్చవులే బుజ్జీ"

"నీకంటే ఇంకెవరు బాగా చేస్తారేం?"

"ఎవరేంటి, కిషన్‌లాల్"

"కిషన్‌లాలా? ఛా" అనేది ఆమె.

ఈ విషయంలో వాళ్లనేకసార్లు వాదించుకున్నారు. చివరికి ముసలాయన తన శిల్పసామాగ్రి, బంకమట్టి సుద్దా తెచ్చి, గుండ్రని దళసరి కళ్లద్దాలు ధరించి పని మొదలుపెట్టాడు.

"పైరు కంకుల్ని కాకులు తినేస్తాయేమోనమ్మా"

"వాటి సంగతి నే చూస్తుంటాలే తాతా!"

పగటి కాంతి మందగిస్తుంది. దూరం నుంచి పశువుల చిరుగంటల చప్పుడు వినిపిస్తుంది. ఆ బాలిక కాకుల్ని తరుముతోంది. వృద్ధుడు బొమ్మలు చేసేపనిలో మునిగిపోయివుండగా, కూతురు వచ్చింది.

"సుభద్రకు ఇప్పుడు ఇంటిపనులు చూసుకునే ఈడు వచ్చింది. నువ్వు మరీ గారాం చేస్తుంటే అది పనీ పాటా లేకుండా గోళ్లు గిల్లుకుంటూ కూర్చుంటుంది. అది ఇప్పటి నుండి బొమ్మలతో ఆడుకోవడం మానేయాలి కదూ?" అంది.

వృద్ధుడు వెంటనే "ఏమిటీ ... అవును. నేనీ బమ్మలు చేసేది సుభద్రకోసం కాదు. కోటలోని పిల్లల కోసం . వీటి మీద కొంత పైకం సంపాదించి సుభద్రకు పెళ్లి కానుకగా ఏదన్నా కొనాలనుకుంటున్నా" అన్నాడు.

కూతురికి కోపం వచ్చింది. "నీ బొమ్మలు కొనేదెవరో?" అని ఈసడించింది.

వృద్ధుడు తల దించుకున్నాడు. సుభద్ర మాత్రం ఊరుకోక, ముంగురులూగేట్లుగా తలూపుతూ "వాళ్లు తాతయ్య బొమ్మల్ని కొంటారో లేదో నేను తేల్చుతాగా" అంది.

రెండు రోజుల తర్వాత సుభద్ర ఒక బంగారునాణెం తెచ్చి తల్లికిచ్చింది. "ఇవి తాతయ్య బొమ్మల అమ్మకం" అని చెప్పింది.

తల్లి ఆశ్చర్యపడి "నువ్వు దీన్నెక్కడ సంపాదించావు?" అని అడిగింది.

"రాజభవనంలో"

ముసలాయన సంబరపడుతూ, నవ్వి "అదీ సంగతి! నా చూపు ఇంకా బాగుండీ, నాచేతులు ఇంకా వణక్కుండా వుంటేనా" అన్నాడు.

ఆ తల్లి సంతోషించింది.

ఇలాంటివి పదహారు బంగారు నాణేలైతే, సుభద్రకు ఒక గొలుసవుతుంది" అంది.

"దిగులుపడకు. త్వరలోనే దానికి గొలుసు చేయిస్తాలే" అన్నాడు.

సుభద్ర అతని భుజాలమీద వేలాడుతూ "తాతా ఇంక ఎవ్వరూ నాకొక వరుణ్ణి వెతికేందుకు తాపత్రయపడనక్కరలేదు" అంది.

ముసలాయన పకపకానవ్వి, ఒక ఆనందభాష్పాన్ని తుడుచుకున్నాడు.

ఆ వృద్ధుడు మళ్లీ యువకుడైపోయినట్లు కనిపించాడు. ఒక చెట్టు నీడన కూర్చుని బొమ్మలు తయారుచేస్తుండేవాడు. సుభద్ర కాకుల్ని అదిలించుతుండేది. దూరంనుంచి పశువుల చిరుగంటల ధ్వనులు వినిపించేవి.

ఒక్కొక్కటే పదహారు కాసులూ పోగయ్యాయి. కంఠహారం కొన్నాడు.

తల్లి "ఇక కావలసింది పెళ్లికొడుకే" అంది.

సుభద్ర తాత చెవిలో రహస్యంగా 'తాతా! పెళ్లి కొడుకు సిద్ధంగా వున్నాడు" అని చెప్పింది.

తాత "నీకెక్కడ దొరికాడమ్మా?" అని అడిగాడు.

సుభద్ర "మొట్టమొదటగా నేను రాజభవనానికి వెళ్లినప్పుడు ద్వారపాలకుడు "నీకేం కావాలి" అని అడిగాడు. నేను బొమ్మల్ని రాకుమార్తెలకు అమ్మాలి' అన్నాను. అతడా బొమ్మలు పనికిరావని నన్ను లోపలికి పోనివ్వలేదు. నేను ఏడుస్తూ తిరిగొస్తుంటే ఒకాయన ఆపి 'బొమ్మల దుస్తుల్ని కొంచెం మార్చనియ్, తప్పకుండా అమ్ముడవుతాయన్నాడు. తాతా నీకు ఆమనిషి నచ్చితే నేను తప్పకుండా పెళ్లాడతాను" అంది.

"ఇప్పుడతను ఎక్కడున్నాడు?"

"అక్కడ ఆ రావిచెట్టుకింద"

ఇంతలో ఆ అపరిచితుడు గదిలోకి వచ్చాడు.

వృద్ధుడు అతడిని తేరిపార చూసి, మహాశ్చర్యంతో "హా.. అయితే ఇతడు కిషన్‌లాల్ కదా?" అన్నాడు.

కిషన్‌లాల్ తాత పాదాలు స్పృశించి "అవును. నావాడే" అన్నాడు.

తాత అతణ్ణి కౌగిలించుకుని "పూర్వం నువ్వు నా మట్టి బొమ్మల్ని దోచుకున్నావు. ఇవ్వాళ నా హృదయపు బొమ్మనే దోచుకుంటున్నావు" అన్నాడు.

సుభద్ర తాత మెడను కౌగిలించుకుని, "అవును తాతా! అంతేకాదు, పెళ్లి కానుకగా నాతోపాటు నిన్ను కూడా తీసుకుపోతున్నాను" అంది.

-రవీంద్రనాథ్ టాగూర్

The Poet's Birthday Beckons
"... I shall not commit the grievous sin of losing faith in Man. ... unvanquished Man will retrace his path of conquest, despite all barriers, to win back his lost human heritage"
Rabindranath Tagore
রবীন্দ্র সার্ধশত জন্মবর্ষ
150th Birth Anniversary of Rabindranath Tagore 1861-2010
Government of West Bengal
ICA/1343/Victory/2010